

అమ్మ
రూ॥ 350/-
పేజీలు: 400
నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్), హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ, హిమాయత్‌నగర్ (హైదరాబాద్) హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★




ఉన్మాదం దేశానికి ప్రమాదకరం 12


సంపుటి 08, సంచిక: 147 | ఆదివారం | 27-04-2025 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00





# ప్రపంచ వ్యాప్తంగా రాజకీయాలు మారాయ్

- పదేళ్ల క్రితం పరిస్థితులు ఇప్పుడు లేవు
- ప్రత్యర్థులు కోపం, ద్వేషంతో రగిలిపోతున్నారు
- వారితో కాంగ్రెస్ పార్టీ పోటీ పడలేకపోతోంది
- పార్టీ గతచరిత్రను గుర్తుచేసుకుని భారత్ జోడో యాత్ర నిర్వహించా
- యాత్రలో అనేక పాఠాలు నేర్చుకున్నా
- 'భారత్ సమ్మిట్–2025'లో లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ

ప్రజాపక్షం /హైదరాబాద్

"ప్రపంచ వ్యాప్తంగా రాజకీయాలు ఎంతో మారిపోయాయని, పదేళ్ల క్రితం నాటి పరిస్థితులు ఇప్పుడు లేవని, రాజకీయాల్లో తమ ప్రత్యర్థులు కోపం, ద్వేషంపై గుత్తాధిపత్యం కలిగి ఉన్నారని, ఆ విషయాల్లో వారితో కాంగ్రెస్ పార్టీ పోటీ పడలేకపోతోందని అఖిల భారత కాంగ్రెస్ కాంగ్రెస్ కమిటీ (ఎఐసిసి) అగ్ర నాయకులు, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ వ్యాఖ్యానించారు. భారతదేశంలో ప్రస్తుతం ప్రతిపక్షాన్ని మాట్లాడనివ్వకుండా, అణచివేసే దూకుడు రాజకీయాలు కొనసాగుతున్నాయని, విపక్షాలను అణగదొక్కడమే అధికార పార్టీకి పనిగా మారిందని, మీడియా స్వేచ్ఛకు సంకెళ్లు వేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'భారత్ సమ్మిట్–2025'లో రెండవ రోజు శనివారం గ్లోబల్ కాన్ఫరెన్స్‌లో రాహుల్‌గాంధీ కీలకోపన్యాసం చేశారు. ఈ సమ్మిట్‌లో సుమారు 100 దేశాలకు చెందిన 450 మంది ప్రముఖులు పాల్గొన్నారు. సమ్మిట్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్‌గౌడ్ తదితరులు ప్రసంగించారు. సమ్మిట్‌లో రాహుల్ గాంధీ ప్రసంగిస్తూ కొన్నేళ్ల క్రితం కాంగ్రెస్ పార్టీ పూర్తిగా ఒంటరిగా, రాజకీయంగా చిక్కుకుపోయినట్లు భావించామని ఆయన వెల్లడించారు. తమకు అందుబాటులో ఉన్న మార్గాలన్నీ మూసుకుపోయాయని, మీడియా సహా ఏదీ తమకు అనుకూలంగా లేదని అన్నారు. ఈ ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలోనే తమ పార్టీ చరిత్రను గుర్తు చేసుకుని,

తరువాయి 2లో



## అన్ని వర్గాల ఆకాంక్షలు నెరవేర్చడమే లక్ష్యం

'భారత్ సమ్మిట్'లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

సమాజంలోని అన్ని వర్గాల ఆకాంక్షలను నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత, రైతులు, మహిళలు, అణగారిన కులాల ఆకాంక్షలు నెరవేర్చడం తమ కర్తవ్యమన్నారు. భారతదేశ చరిత్రలోనే అతి పెద్ద సంక్షేమ పథకాలను రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిందని, 2024 ఆగష్టు 15 నాటికి రూ.20,617 కోట్లు చెల్లించి

తరువాయి 2లో



# 400 గుడిసెలు అగ్గికి ఆహుతి

- రంగారెడ్డి జిల్లా కుంట్లూరు రావి నారాయణరెడ్డి కాలనీ ఫేస్3లో పేదల గుడిసెల్లో భారీ అగ్నిప్రమాదం
- పేలిన సిలిండర్లు, ఎగిసిపడిన మంటలు
- పూర్తిగా దగ్ధమైన నిత్యావసర సరుకులు
- ఫైర్ ఇంజన్లతో మంటలను అదుపులోకి తెచ్చిన అగ్నిమాపక సిబ్బంది
- గుడిసెలను పరిశీలించిన సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



ప్రజాపక్షం/ఎల్‌బి నగర్

బతుకుదెరువు కోసం పట్టణాలకు వచ్చి నివాసముంటున్న పేదల గుడిసెలు అగ్నికి ఆహుతయ్యాయి. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, కుంట్లూరు గ్రామ సమీపంలోని రావి నారాయణరెడ్డి కాలనీ ఫేస్ 3లో పేదలు వేసుకున్న గుడిసెల్లో శనివారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఎండ తీవ్రతకు క్షణాల్లో మంటలు పెద్ద ఎత్తున ఎగిసిపడ్డాయి. దాదాపు 30 సిలిండర్లు పేలడంతో మంటలు ఆకాశాన్నంటాయి. 400పైగా గుడిసెలు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో

తరువాయి 2లో



కాళేశ్వరం ప్రాజెక్ట్

## మాజీ ఇఎన్‌సి ఇంట్లో ఎసిబి సోదాలు

- హరిరామ్ కుటుంబసభ్యులు, బంధువుల ఇళ్లు, ఫామ్ హౌస్‌లతోపాటు ఏకకాలంలో 14 చోట్ల దాడులు
- ఎన్‌డిఎస్‌ఎ నివేదిక ఆధారంగా అధికారులు చర్యలు
- తనిఖీల్లో భారీగా ఆస్తి పత్రాలు లభ్యం

ప్రజాపక్షం/హైదరాబాద్

కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ (కెఎల్‌ఐఎస్) మాజీ ఇంజనీర్ ఇన్ చీఫ్ (ఇఎన్‌సి) అధికారి హరిరామ్ ఇంటిపై శనివారం ఎసిబి అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. హరిరామ్‌కు చెందిన కుటుంబ సభ్యులు, బంధువులు, ఫామ్‌హౌజ్‌లతో పాటు మర్కూర్ తహసీల్దార్ కార్యాలయంపై ఏకకాలంలో 14 చోట్ల అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) అధికారులు దాడులు నిర్వహించారు. ఇటీవలే కాళేవ్వరం ప్రాజెక్ట్ నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డిఎస్‌ఎ) వెల్లడించిన నివేధిక ఆధారంగా ఎసిబి

తరువాయి 12లో

# నేడు బిఆర్ఎస్ రజతోత్సవం

- వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో భారీ బహిరంగసభ
- కెసిఆర్ ప్రసంగంపై ఉత్కంఠ






ప్రజాపక్షం/ హనుమకొండ ప్రతినిధి

బిఆర్ఎస్ రజతోత్సవం సభ ఏర్పాట్లు పూర్తి అయి సభకు సర్వ సిద్ధం చేశారు. అందరి చూపు బిఆర్ఎస్ రజతోత్సవం సభ వైపు నెలకొన్నది. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలోని చింతలపల్లిలో ఇప్పటికే సభ కోసం భారీ స్థాయిలో ఏర్పాట్లు చేశారు. ఈ నెల 27న ఎల్కతుర్తి సభలో మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ఏం చెబుతారో అనే విషయమై అందరూ చర్చించుకుంటున్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటే లక్ష్యంగా 2001లో ఏర్పాటైన తెలంగాణ రాష్ట్ర సమితి పేరును 5 అక్టోబర్ 2022న భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్)గా మార్చుకుంది. పేరు ఏదైనా పార్టీ అధికారంలో ఉన్న పది సంవత్సరాలు బంగారు తెలంగాణే లక్ష్యంగా కృషి చేశారు. పార్టీ ఆవిర్భవించి 25 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా ఈ నెల 27న హనుమకొండ జిల్లాలోని ఎల్కతుర్తిలో దేశం మురిసేలా రజతోత్సవ వేడుకలను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అందులో భాగంగా నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు రాష్ట్రం నలుమూలల నుంచి పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరు కానున్నారు. సభ సక్సెస్ చేసేందుకు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ భాస్కర్, పెద్ది సుదర్శన్ రెడ్డి, వొడితెల సతీష్ కుమార్, చల్లా ధర్మారెడ్డి తదితరులు తమదైన పాత్ర పోషిస్తున్నారు. కాగా

తరువాయి 2లో




## పహల్గామ్ ఉగ్రదాడి క్షమించరానిది

- మానవ హననానికి పాల్పడిన ముష్కరులను కఠినంగా శిక్షించాలి
- సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్
- ఉగ్రదాడి మృతులకు నివాళిగా సిపిఐ కొవ్వొత్తుల ప్రదర్శన

ప్రజాపక్షం/హైదరాబాద్

పహల్గామ్ ఘటన క్షమించరానిదని,హత్యాకాండకు పాల్పడిన ఉగ్రవాద సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. సిపిఐ హైదరాబాద్ జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో పహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారికి నెక్లెస్ రోడ్ అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో సిపిఐ నాయకులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ

తరువాయి 2లో

## కూంబింగ్ ఆపండి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని డిమాండ్



ప్రజాపక్షం/హైదరాబాద్ /హనుమకొండ

కర్రెగుట్టలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కూంబింగ్‌ను తక్షణమే నిలిపివేయడంతో పాటు మావోయిస్టులతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శాంతి చర్చలు జరపాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. శాంతి చర్చలకు సిద్ధమని మావోయిస్టులు పదేపదే ప్రతిపాదిస్తున్నప్పటికీ చత్తీస్‌గఢ్ సరిహద్దులోని కర్రెగుట్టలో కూంబింగ్ నిర్వహించడం సమంజసం కాదన్నారు. కర్రెగుట్ట అడవులలో వేలాది మంది సాయుధ బలగాలు చుట్టుముట్టి

తరువాయి 2లో

## కర్రెగుట్టలు ఎరుపెక్కుతున్నాయ్

- భద్రతాదళాలు, మావోయిస్టుల మధ్య తూటాల వర్షం
- నక్సల్స్ కోసం రంగంలోకి హెలిక్యాప్టర్లు, డ్రోన్‌లు
- ఆపరేషన్‌లో వడదెబ్బకు గురవుతున్న జవాన్లు



ప్రజాపక్షం/భద్రాచలం

అసలు కర్రెగుట్టల కథేంటి, ఆపరేషన్ కర్రెగుట్టల వ్యవహారం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. 2026 మార్చి నెలాఖరు నాటికి మావపక్ష తీవ్రవాదాన్ని లేకుండా చేస్తామని చెప్పిన కేంద్ర హోం మంత్రి అమీత్‌షా ఆ దిశగా వడివడిగా అడుగులు ముందుకేస్తూనే ఉన్నారు. కాగా మావోయిస్టులకు పెట్టని కోటగా ఉన్న ఛత్తీస్‌గఢ్ దండకారణ్యం మావోయిస్టుల నెత్తుటి మరకలతో ఎంగిలవుతోంది. అడవుల్లో సమాంతర పాలన సాగించిన వారు ఇప్పుడు

తరువాయి 2లో

పంచాయతీ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు

## క్రిమినల్ కేసులు వెల్లడించాల్సిందే

హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు తీర్పును సమర్థించిన 'సుప్రీం'

**న్యూఢిల్లీ :** పంచాయతీ ఎన్నికలలో పోటీచేసే అభ్యర్థులు వారిపై పెండింగ్ కేసుల సంబంధిత సమాచారాన్ని వెల్లడించాలన్న హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు తీర్పును శనివారం సుప్రీంకోర్టు సమర్థించింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, ఎన్.కోటీశ్వర్ సింగ్‌తో కూడిన ధర్మాసనం మండి జిల్లాలోని పంగ్నా గ్రామపంచాయతీకి చెందిన ప్రధాన్(హెడ్)ను తొలగించడానికి సంబంధించిన విషయమై హిమాచల్ ప్రదేశ్ హైకోర్ట్ నిర్ణయాన్ని సమర్థిస్తూ సుప్రీంకోర్టు ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. '2024 అక్టోబర్ 16న పిటిషనర్ చేసిన వాస్తవాల కల్పన హిమాచల్ ప్రదేశ్ పంచాయతీ రాజ్ చట్టం1994


తరువాయి 12లో

## పోలీసులు, భద్రత బాధ్యత ఎల్‌జి, హోం శాఖదే


బైసరన్ పర్యాటక ప్రదేశం ఏడాది పొడవునా తెరిచే ఉంటుంది

**న్యూఢిల్లీ :** ఉగ్రదాడి జరిగిన మినీ స్విట్జర్లాండ్‌గా పిలువబడే బైసరన్ పర్యాటక ప్రదేశం ఏడాది పొడవున తెరిచే ఉంటుందని జమ్మూ కశ్మీర్ ప్రభుత్వ అధికారి ఒకరు వెల్లడించారు. ఉగ్రదాడి ఘటనపై కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశంలో బైసరన్‌లో పర్యాటకుల సందర్శన ప్రారంభమైన విషయంలో పోలీసుల అనుమతి అడగలేదని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ అధికారులు వెల్లడించినట్లు వార్తలు

తరువాయి 12లో



## భారత్, పాక్‌లే పరిష్కరించుకుంటాయ్



ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతల వేళ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్య

**న్యూయార్క్ :** భారత్, పాకిస్తాన్‌ల మధ్య ఎల్లవేళలా ఉద్రిక్తతలు ఉంటాయని, రెండు దేశాలు ఒకటి కాకపోతే మరో మార్గంలో వారంతట వారే పరిష్కారం చేసుకుంటారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. "నేను భారతదేశానికి సన్నిహితంగా ఉంటాను. అలాగే పాకిస్తాన్‌తో అత్యంత సన్నిహితంగా ఉంటానని మీకు తెలుసు. కశ్మీర్ విషయంలో వారికి 1,000 ఏళ్ళ నుంచి పోరాటం జరుగుతూనే ఉంది. నాకు ఇద్దరు నేతలు తెలుసు. పాకిస్తాన్, భారత్‌ల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు ఉన్నాయి. కానీ, అవి ఎప్పటి నుంచో ఉన్నాయ'ని అన్నారు. పహల్గామ్ ఉగ్రదాడుల నేపథ్యం ఆయన శుక్రవారం నాడు మీడియాతో మాట్లాడుతూ అన్నారు.



# ప్రపంచం
WORLD NEWS

## విస్కాన్సిన్ మహిళా న్యాయమూర్తి అరెస్టు



**మాడిసన్ :** అమెరికా విస్కాన్సిన్ మహిళా న్యాయమూర్తి హన్నా దుగన్‌ను ఎఫ్‌బిఐ అధికారులు అరెస్టు చేశారు. మిల్వాంకీ కౌంటీ సర్క్యూట్ జడ్జి దుగన్ ఒక అక్రమ వలదారుణ్ణి చట్టం నుండి ఉద్దేశపూర్వకంగా రక్షించేందుకు ప్రయత్నం చేశారని ఎఫ్‌బిఐ డైరెక్టర్ కాష్ పటేల్ చెప్పారు. మెక్సికోకు చెందిన వలసదారుణ్ణి అరెస్టు చేసేందుకు ప్రయత్నిస్తున్న ఇమ్మిగ్రేషన్ అధికారులను సదరు జడ్జీ తప్పుతోవ పట్టించారనీ, కానీ అదృష్టవశాత్తూ అధికారులు అతడిని వెంబడించి పట్టుకున్నారనీ, ఈ నేరానికిగాను ఆమెను అరెస్టు చేస్తున్నట్లు ఎక్స్ వేదికగా కాష్ పటేల్ చెప్పారు. అరెస్టును అడ్డుకునేందుకు, నేరస్తుణ్ణి తప్పించేందుకు చేసిన రెండు నేరాలకుగాను ఆమెకు గరిష్ఠంగా ఆరు సంవత్సరాలు జైలుశిక్ష పడే అవకాశాలు ఉన్నాయి. ఐతే తాత్కాలికంగా ఆమెను పూచీకత్తుపై విడుదల చేశారు.

# గాజాలో ఐదేళ్లు యుద్ధ విరమణ


### ఒకేసారి ఇజ్రాయెల్ బందీలందరి విడుదల
### హమాస్ అంగీకారం



**కైరో :** పాలస్తీనాలో యుద్ధ విరమణకు హమాస్ ముందడుగు వేసింది. ఐదు సంవత్సరాలపాటు గాజాలో యుద్ధాన్ని విరమించేందుకు అంగీకరించింది. ఐదేళ్ల పాటు శతృత్వాన్ని విడిచిపెట్టి కాల్పుల విరమణకు అంగీకరించింది. అదే విధంగా ఇజ్రాయెల్‌కు చెందిన బందీలందరినీ ఏకకాలంలో విడుదల చేసేందుకు కూడా సుముఖత వ్యక్తం చేసింది. పాలస్తీనా గ్రూపుకు చెందిన అధికారి ఒకరు శనివారం ఈ విషయం చెప్పారు. ఇజ్రాయెల్ వద్ద జైళ్లల్లో ఉన్న ఖైదీలను విడుదల చేసుకునేందుకు తగిన చర్యలు తీసుకుంటుందని పేరు చెప్పటానికి ఇష్టపడని పాలస్తీనా గ్రూపు అధికారి ఒకరు చెప్పారు. గడచిన కొద్ది రోజులుగా కైరోలో మధ్యవర్తులు హమాస్‌తో చర్చలు చేస్తున్నారు. ఈ చర్చల్లో మధ్యవర్తులతో సమావేశం జరిగిన 24గంటల తరువాత పాలస్తీనా గ్రూపు అధికారి ఈ విషయం ప్రకటించారు. ఈనెల 17వ తేదీన హమాస్ పాక్షిక కాల్పుల విరమణ ఒప్పందాన్ని తిరస్కరించింది. ఇజ్రాయెల్ ఈ ప్రతిపాదన చేసింది. 10మంది ఇజ్రాయెల్ బందీలను విడుదల చేస్తే 45 రోజులపాటు కాల్పుల విరమణకు ఇజ్రాయెల్ ప్రతిపాదించింది. కానీ అందుకు హమాస్ ఒప్పుకోలేదు. ఇప్పుడు మధ్యవర్తులతో చర్చల తరువాత హమాస్ తాజా ప్రకటన చేసింది. దీంతో గాజాలో ప్రజల కష్టాలు తీరే అవకాశాలు కనపడుతున్నాయి. 2023 అక్టోబర్‌లో హమాస్ ఉగ్రవాదులు ఇజ్రాయెల్ సరిహద్దు దాటి లోనికి వెళ్లి విచక్షణా రహితంగా కాల్పులు జరిపి 1200మందిని చంపారు. 250మందిని కిడ్నాప్ చేశారు. ఆ తరువాత గాజాలో ఇజ్రాయెల్ యుద్ధం ప్రారంభించింది. ఇప్పటివరకు జరిగిన యుద్ధంలో 61,000మంది పాలస్తీనియన్లు మరణించారు. హమాస్ అగ్రనాయకులు మరణించారు. ఇజ్రాయెల్ ప్రభుత్వం గాజాలో మానవ విలయాన్ని సృష్టించింది. దీంతో అంతర్జాతీయ న్యాయస్థానం నేతన్యాహుతోపాటు మరికొంతమందిపై అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. ఆ తరువాత మధ్యవర్తుల చర్చల ఫలితంగా ఈ ఏడాది జనవరి 19న గాజాలో 45 రోజుల కాల్పుల విరమణ అమలులోకి వచ్చింది. ఈ సమయంలో 33మంది బందీలను విడుదల చేసేందుకు హమాస్ అంగీకరించగా 1800మంది పాలస్తీనా ఖైదీలను విడుదలచేసేందుకు ఇజ్రాయెల్ ఒప్పుకుంది. అయితే పూర్తిస్థాయిలో ఈ ఒప్పందం అమలు కాలేదు. 45రోజుల కాల్పుల విరమణ తరువాత తాజాగా చర్చలు జరగాలని హమాస్ పట్టుబట్టింది. అందుకు ఇజ్రాయెల్ తిరస్కరించింది. దీంతో మార్చి 2వ తేదీనుండి ఇజ్రాయెల్ గాజాలోకి ఆహారంతోపాటు ఇతర మానవతా సహాయాన్ని రానీయకుండా అడ్డుకుంది. మార్చి 18న గాజాలో యుద్ధం మొదలైంది. హమాస్–ఇజ్రాయెల్ ఎట్టకేలకు మధ్యవర్తుల ద్వారా ఒక ఒప్పందానికి వచ్చే సూచనలు కనపడుతున్నాయి. ఈ విషయంపై ఇంకా పూర్తి స్పష్టత రావాల్సి ఉంది.

# వాటికన్‌సిటీలో ట్రంప్–జెలెన్‌స్కీ కీలక భేటీ

### శాంతి ఒప్పందం గురించేనా!



**వాటికన్‌సిటీ:** వాటికన్‌సిటీలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఉక్రేన్ అధ్యక్షుడు వి.జెలెన్‌స్కీ అనధికారిక సమావేశం జరిపారు. పోప్ ఫ్రాన్సిస్ అంత్యక్రియలకు హాజరైన వారిద్దరూ ఆ కార్యక్రమానికి ముందుగా సెయింట్ పీటర్స్ బాసిలికా భవనంలో శనివారం నాడు సమావేశమయ్యారు. వారిద్దరిమధ్యా చర్చలు ఫలవంతమయ్యాయని అనంతరం వాషింగ్టన్ వర్గాలు ఒక ప్రకటన ద్వారా తెలియజేశాయి. ఈ చర్చలకు సంబంధించిన సారాంశం, దాని ఫలితాలను తర్వాత ప్రకటిస్తామని వాషింగ్టన్ వర్గాలు చెప్పాయి. అమెరికా దూత విట్‌కాఫ్ శుక్రవారంనాడు పుతిన్‌తో మాస్కోలో సమావేశమైన కొద్దిగంటలకు ఉక్రేన్, రష్యాలు ఒప్పందానికి చేరువలో ఉన్నాయని ట్రంప్ ప్రకటించారు. ఈ పూర్వరంగంలో జెలెన్‌స్కీతో ట్రంప్ ప్రైవేటు చర్చలు ప్రాముఖ్యత సంతరించుకున్నాయి. విట్‌కాఫ్ ద్వారా చేరిన పుతిన్ సందేశాన్ని ఈ చర్చల్లో జెలెన్‌స్కీకి ట్రంప్ తెలియజేశారన్నదే ప్రధాన టాపిక్‌గా మారింది. రష్యాతో శాంతి ఒప్పందం చేసుకునే దిశగా ఉక్రేన్‌ను ముందుకు నడిపించేందుకు ట్రంప్‌కు ఈ ప్రైవేటు భేటీ అంత్యంత కీలకమైనదిగా భావిస్తున్నారు. గడచిన ఫిబ్రవరి చివరిలో జెలెన్‌స్కీ అమెరికా పర్యటన చేసినప్పుడు ఓవల్ ఆఫీసులో చర్చల సందర్భంగా, అమెరికా చేసిన సాయానికి కనీసం కృతజ్ఞత కూడా చెప్పలేదని ట్రంప్ ఆగ్రహించి ముఖాముఖీ ''అరుపులాట''కు దిగిన ఘటన ప్రపంచదేశాలను నివ్వెరపరచింది. ఆ తర్వాత ఈ నాయకులిద్దరూ కలుసుకోవడం మళ్ళీ ఇదే మొదటిసారి.అధ్యక్ష ఎన్నికల ప్రచార సమయంలోనే ఉక్రేన్‌లో యుద్ధాన్ని పరిష్కరిస్తానని, అంతర్జాతీయంగా శాంతి సాధిస్తానని అమెరికా ప్రజలకు తన ప్రసంగాల్లో ట్రంప్ ఊదరగొట్టారు. చివరకు యూరప్‌ను కూడా కాదనుకుని పూర్తిగా రష్యా పక్షాన ఆయన వాదిస్తున్నప్పటికీ యూరప్ నాయకత్వ వైఖరి కారణంగా వ్లాదిమిర్ పుతిన్‌కు ట్రంప్ నమ్మకం ఇవ్వలేకపోతున్నారు. 2022 ఫిబ్రవరి నుండి ఇప్పటివరకూ ఉక్రేన్‌లో జరిగిన పూర్తిస్థాయీ యుద్ధంలో 20 శాతం భూభాగాన్ని రష్యా స్వాధీనం చేసుకుంది. ముఖ్యంగా రష్యాతో వేలసంవత్సరాల చారిత్రక, సాంస్కృతిక భాషానుబంధం గల క్రిమియా ప్రాంతాన్ని రష్యా భూభాగంగా గుర్తించాలని ఇటీవలికాలంలో జెలెన్‌స్కీపై ట్రంప్ ఒత్తిడి తెస్తున్నారు. అందుకు జెలెన్‌స్కీ నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. వాటికన్‌సిటీలో జరిగిన ప్రైవేటు చర్చల్లో ఇటీవల కీవ్‌పై రష్యా చేసిన హింసాత్మకదాడి, రష్యా మొండితనం, ఉద్దేశపూర్వకంగా శాంతి చర్చలను జాప్యం చేయడం వంటి అంశాలను ట్రంప్ దృష్టికి జెలెన్‌స్కీ తెచ్చే అవకాశమే ఎక్కువ. అదేవిధంగా ట్రంప్ కూడా ఉక్రేన్‌లో ఖనిజ వనరుల ఒప్పందం గురించి, రష్యాతో శాంతి చర్చల గురించి, క్రిమియాను రష్యాకు వదులుకునే విషయం గురించీ ప్రస్తావించే అవకాశం ఉంది.కీవ్‌పై జరిగిన దాడులను ట్రంప్ కూడా తీవ్రంగా ఖండించారు. ఇటీవలికాలంలో రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ట్రంప్ ప్రత్యేక దూత స్టీవ్ విట్‌కాఫ్ నాలుగుసార్లు సమావేశమయ్యారు. చివరిసారి శుక్రవారంనాడు మాస్కోలో వారిద్దరిమధ్య సమావేశం సందర్భంగానే రష్యా ఉన్నతస్థాయీ సైనిక జనరల్ కారు బాంబు పేలుడులో హతుడయ్యారు. ఈ హత్యకు ఉక్రేన్ ప్రభుత్వమే కారణమని రష్యా ప్రభుత్వం ఆరోపించింది. ఈ విషయంకూడా ట్రంప్, జెలెన్‌స్కీ చర్చల్లో చోటుచేసుకునే అవకాశం ఉంది.

# మనసులమధ్య వంతెనలు నిర్మిద్దాం

### వాటికన్‌సిటీలో మానవతా ప్రతిధ్వనులు
### ప్రపంచ నేతల సమక్షంలో పోప్ ఫ్రాన్సిస్ ఖననం



**వాటికన్‌సిటీ :** రోమన్ క్యాథలిక్ మతగురువు పోప్ ఫ్రాన్సిస్ (1936–2025) శనివారం మధ్యాహ్నం శాశ్వత సమాధికిలోకి వెళ్ళారు. శాంతా మారియా మొగ్గియోర్ చర్చ్ వరకూ ఊరేగింపుగా ఆయన భౌతిక కాయాన్ని తీసుకువెళ్ళి అక్కడే ఖననం చేశారు. ఫ్రాన్సిస్ ముందుగా తన మరణ వీలునామాలో కోరిన ప్రకారమే ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. మట్టల ఆదివారం మరునాడు ఈనెల 21వ తేదీన గుండెపోటుతో 88వ యేట వాటికన్‌సిటీలో మరణించారు పోప్ ఫ్రాన్సిస్. ప్రపంచ దేశాల నాయకులు, రాజులు, రెండున్నర లక్షమంది ప్రజల సమక్షంలో రోమ్‌లోని ఒక చర్చిలో ఫ్రాన్సిస్‌ను ఖననం చేశారు. డీన్ ఆఫ్ కాలేజ్ ఆఫ్ కార్డినల్ గియోవన్నీ బాటిస్టా రే పోప్ ఫ్రాన్సిస్ ఆత్మను దేవునికి అంకితం చేశారు. మొత్తం ఖనన కార్యక్రమానికి ఆయన సారథ్యం వహించారు. దేవుడు నిర్మించిన పరలోక ప్రపంచ పౌరసత్వాన్ని పోప్ ఫ్రాన్సిస్ స్వీకరించారని ప్రకటించారు. మనుషులమధ్య, మనసులమధ్య వంతెనలు నిర్మించాలి తప్ప గోడలు కట్టకూడదని ఫ్రాన్సిస్ తన జీవితకాలంలో గొప్ప మానవతా సందేశాన్ని ఇచ్చారని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. ఆయన కోరిక ప్రకారం మనసులమధ్య, మనుషులమధ్య వంతెనలు నిర్మిద్దామని ఆయన పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమం పూర్తయిన తర్వాత సెయింట్ పీటర్స్ స్క్వేర్ గంటల ధ్వనులతో మారుమోగిపోయింది. దీంతో గురువులు, ప్రపంచనేతలు అక్కడి నుండి నిష్క్రమించారు. సమాధి అనంతరం గియోవన్నీ బాటిస్టా రే, లాటిన్ భాషలో దేవుణ్ణి ప్రార్థిస్తూ, ''ఓ దేవా! ఆత్మలకు విశ్వసనీయమైన ప్రతిఫలమిచ్చువాడా! ఈ భూమిమీద పీటర్ వారసుడుగా, ఎంతో విశ్వసనీయతతో నీ చర్చికి కాపరిగా బాధ్యతలు నిర్వహించి నిష్క్రమించిన ఫ్రాన్సిస్ పరలోక స్వర్గంలో నీ సమక్షంలో నీ కృప, కరుణలతో శాశ్వతంగా ఆనందించనివ్వండి'' అని తుదిప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోప్ పదవిలో ఫ్రాన్సిస్ మానవాళికి చేసిన అసాధారణ సేవలను, ఆయన మానవత, కరుణాదృష్టి ఆలోచనా విధానాలను గుర్తుచేసుకున్నారు. వాటికన్ సిటీలో ఆయన చేసిన సంస్కరణలను గుర్తుచేసుకున్నారు. క్రైస్తవులకు వాటికన్ సిటీని మాతృకగా, మూల కుటుంబంగా ఆయన భావించారు. అన్ని ఆలోచనా ధోరణలకు చెందిన క్రైస్తవ సంఘాలన్నీ భూమ్మీద దేవుని కార్యంకోసం సమైక్యం కావాలని ఫ్రాన్సిస్ తన ప్రసంగాల్లో తరచు పిలుపు ఇచ్చేవారు. తన మరణానికి ముందు పామ్ సండేనాడు వాటికన్‌సిటీలో ప్రజలకు దర్శనమిచ్చారు. గాజాలో యుద్ధాన్ని విరమించాలని, ఆకలిగొన్న పాలస్తినా ప్రజల ఆకలి తీర్చాలని ఆయన పిలుపు ఇచ్చారు. కాగా కొత్త పోప్ ఎంపిక ప్రక్రియకు కొద్ది సమయం పడుతుంది. రహస్య ఓటింగ్ పద్ధతిలో కార్డినల్స్ కొత్త పోప్‌ను ఎన్నుకుంటారు. పొగగొట్టం ద్వారా తెల్లపొగ వస్తే పోప్ ఎంపిక ప్రక్రియ పూర్తయిందని అందరూ అర్థం చేసుకుంటారు. నల్లపొగ వస్తే ఇంకా ఆ ప్రక్రియ పూర్తికాలేదని అర్థం చేసుకుంటారు. సెయింట్ పీటర్స్ స్క్వేర్ వద్ద జరిగిన కార్యక్రమంలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, బ్రిటన్ రాజ దంపతులు ఛార్లెస్, కెమెల్లా, బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్‌మర్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్, ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ, లాటిన్ అమెరికా దేశాల నాయకులు లులా డసిల్వా, గ్జేవియర్ మిలై తదితరులు ఈ అంత్యక్రియల కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఇరాన్ పోర్టులో పేలుడు

### నలుగురు మృతి,516 మందికి గాయాలు



**టెహ్రాన్ :** ఇరాన్ రేవు పట్టణం బాందర్ అబ్బాస్‌లో శనివారంనాడు భారీ పే లుడు సంభవించింది. ఈ పేలుడులో నలుగురు మృతి చెందగా 516 మంది గాయపడ్డారు. రాజధాని టెహ్రాన్‌కు వెయ్యి కి.మీ దూరంలో ఈ రేవు పట్టణం ఉంది. పోర్ట్స్ అండ్ మారిటైమ్ ఆర్గనైజేషన్‌కు చెందిన సినా కంటైనర్ యార్డ్ లో ఈ భారీ పేలుడు ఘటన జరిగిందని అధికారులు చెప్పారు. అత్యంత ప్రమాదకరమైన, త్వరగా మంటలకు గురయ్యే పేలిపోయే వస్తువులను భద్రపరచడంలో తీవ్ర నిర్లక్ష్యం కారణంగా ఈ పేలుడు సంభవించిందని ప్రాథమి క సమాచారం ద్వారా వెల్లడైందని అధికారులు చెప్పారు. ఈ ఘటన తర్వాత ఇరానియన్ పెట్రోలియం రిఫైనింగ్, డిస్ట్రిబ్యూటింగ్ కంపెనీ ఒక ప్రకటన చేస్తూ, ఈ ప్రాంతంలో తమ నిల్వలకు ఎలాంటి నష్టం వాటిల్లలేదని పేర్కొం ది. ఈ పేలుడు ఘటనతో ఆ ప్రాంతంలో భారీగా నల్లటి పొగ మేఘాలు కమ్ముకున్నాయి. అనేక వాహనాలు ధ్వంసమయ్యాయి.


## క్షమించరానిది (మొదటి పేజీ తరువాయి)

అమాయక పర్యాటకులను లక్ష్యంగా చేసుకుని కనీస మానవత్వం లేకుండా అత్యంత దారుణంగా ఉగ్రవాదులు జరిపిన ఈ మానవ హననం క్షమించరాని నేరమని, ఇందుకు పాల్పడిన వారిపై ఈ దాడులకు పాల్పడిన పాక్ ప్రేరేపిత ఉగ్రవాద సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. పుల్వామా సంఘటన జరిగిన సమయంలోనే ఉగ్రవాదుల పట్ల కేంద్రప్రభుత్వం కఠినంగా వ్యవహరించి ఉండే ఇప్పుడు పహల్గాం ఘటన జరిగేదే కాదనిఆయన పేర్కొన్నారు. బిజెపి ప్రభుత్వం ప్రజలు, సైనికుల ప్రాణాలను పణంగా పెట్టి అడుతున్న ఓట్ల రాజకీయం ఇప్పకైనా మానుకోవాలని హితువు పలికారు.ఉగ్రవాదులు జరిపిన ఈ దాడిని ప్రజలందరూ ఖండిస్తూ ముందుకు రావటం మన ఐక్యతకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. అయితే సంఘ పరివార్ శక్తులు ఉద్దేశపూర్వకంగా ముస్లిం మతానికి సంబంధించిన సమూహం పట్ల విద్వేషాలు రెచ్చగొడుతూ సోషల్ మీడియాలో ప్రకటనలు గుప్పిస్తూ ప్రజలను చీల్చే ప్రయత్నం సరైంది కాదని, ఈ అంశంలో యావత్ భారత సమాజమంతా చైతన్యంతో మెలగాలని విజ్ఞప్తి చేశారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈటి నరసింహ మాట్లాడుతూ పహల్గాం ఘటనకు బాధ్యత వహిస్తూ కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దాడిలో మరణించిన కుటుంబాలలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగము కల్పించి వారినీ ఆదుకోవాలని, క్షతగాత్రులకు మెరుగైన వైద్య సదుపాయము కల్పించాలని విజ్ఞప్తి చేశారు. విఎస్‌బోస్ మాట్లాడుతూ కాశ్మీర్ లో సాధారణ పరిస్థితి నెలకొల్పాలంటే అక్కడి ప్రజల మన్ననలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను పొందాల్సిన అవసరముందని, ఇందుకు వారికి ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. ఈ సమయంలో భావోద్వేగ ప్రకటనలకు భారత ప్రభుత్వం దూరంగా ఉండి సమస్య పరిష్కారం కోసం ప్రపంచ వ్యాప్తంగా ఉన్న దేశాలతో ఒత్తిడి తీసుకొచ్చి ఈ ఉగ్రవాద నిర్మూలనకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి కమతం యాదగిరి స్టాలిన్, సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు చందు ,జిల్లా కార్యవర్గ సభ్యులు నేర్లకంటి శ్రీకాంత్, సలీం ఖాన్ ఉమర్ ఖాన్, ఇన్సాఫ్ రాష్ట్ర కార్యదర్శి మునీర్ పటేల్,డి హెచ్ పి ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్, డి హెచ్ పి ఎస్ జిల్లా అధ్యక్షులు ఆరుట్ల రాజ్ కుమార్, జిల్లా కౌన్సిల్ సభ్యులు మహమూద్,నరసింహ, కళ్యాణ్,అనిల్, లతీఫ్, ఎఐవైఎఫ్ నాయకులు హేమంత్, ఎఐటియుసి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కూంబింగ్ ఆపండి (మొదటి పేజీ తరువాయి)

మావోయిస్టులను నిర్మూలించడమే లక్ష్యంగా మారణహోమం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. అణచివేత ఒక్కటే మార్గం కాదని వాటిని చర్చల ద్వారా పరిష్కరించాలని కోరారు. మావోయిస్టులు తాము శాంతి చర్చలకు సిద్ధమని మరోసారి చేసిన ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం పెడచెవిన పెట్టడం శ్రేయస్కరం కాదని సూచించారు. ఇప్పటికే మావోయిస్టులు పదుల సంఖ్యలో హతమైయ్యారని, అలాగే పదుల సంఖ్యలో సాయుధ బలగాలు వడదెబ్బకు గురైనట్లు సమాచారం వస్తున్న నేపథ్యంలో వీటన్నింటిని పరిగణలోకి తీసుకుని తక్షణమే కూంబింగ్‌ను నిలిపివేయాలన్నారు.

**కాల్పులు నిలిపివేయాలి : ప్రొఫెసర్ హరగోపాల్**



ములుగు జిల్లా కర్రెగుట్టలపై కాల్పులను కేంద్ర ప్రభుత్వం నిలిపివేయాలని ప్రొఫెసర్ హరగోపాల్ డిమాండ్ చేశారు. పౌర హక్కుల సంఘం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో హనుమకొండలోని వరంగల్ ప్రెస్ క్లబ్ లో ప్రొఫెసర్ హరగోపాల్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ ఛత్తీస్ ఘడ్ తెలంగాణ సరిహద్దులలోని కర్రేగుట్ట లో కాల్పులను కేంద్రం ప్రభుత్వం తక్షణమే నిలిపి వేసి, శాంతియుత వాతావరణం పునరుద్ధరించాలని అన్నారు. బ్రిటిష్ కాలం నుంచి మావోయిస్టు పార్టీ ఉన్నదని, ఆదివాసి ప్రజలు భయానక వాతావరణం లో ఉన్నారని, స్మశానంలో చర్చలు జరపాలని కేంద్రం అనుకుంటున్నదని, పోరాటం చేస్తున్న వారి తో శాంతి చర్చలు జరపాలని అన్నారు.

# నెరవేర్చడమే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

రైతు రుణ మాఫీ ద్వారా 25.50 లక్షల మంది రైతులను పూర్తిగా రుణ విముక్తులను చేశామని వివరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఎన్నో సంక్షేమ పథకాలను తీసుకువచ్చామని, అభివృద్ధి పనులను చేపట్టామని వివరించారు. రైతు భరోసా కింద రూ. 12 వేలు ఇస్తున్నామని, వరికి మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ ఇస్తున్నామని అన్నారు. నిరుద్యోగ యువత కోసం రాజీవ్ యువ వికాసం పథకాన్ని తీసుకువచ్చామని అన్నారు. ప్రజలకు ఏ సమయంలో ఏం కావాలో కాంగ్రెస్ ప్రభుత్వానికి బాగా తెలుసనని, ప్రజోపయోగ విధానాలను రూపొందించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదన్నారు. భారత తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ నీటి పారుదల, విద్యపై దృష్టి సారించారని, ఇందిరాగాంధీ గారు రోటీ, కపడా ఔర్ మకాన్ అనే నినాదంతో పేదరిక నిర్మూలనకు కృషి చేశారని, ఆ తర్వాత వచ్చినముగ్గురు కాంగ్రెస్ ప్రధానులు రాజీవ్ గాంధీ, పి.వి.నరసింహారావు, డాక్టర్ మన్మోహన్ సింగ్ ఆధునికీకరణ, అభివృద్ధి, టెలికామ్, సాఫ్ట్ వేర్ వంటి ప్రపంచ సాంకేతిక విప్లవాలపై దృష్టి సారించారని, వారి కృషి వల్లే భారత్ ప్రపంచంలో 5వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని వివరించారు. రాష్ట్రంలో విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలకు కాంగ్రెస్ ప్రభుత్వంలో తొలి ప్రాధాన్యతను ఇస్తుందని, తమ ప్రభుత్వానికి మహిళలు, రైతులు, యువతే ప్రధాన భాగస్వాములన్నారు. దావోస్, అమెరికా, దక్షిణ కొరియా, జపాన్, సింగపూర్ లలో జరిగిన పెట్టుబడుల సదస్సులకు తెలంగాణ ప్రతినిధి బృందం హాజరైందని, ప్రైవేటు రంగంలో యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు రూ.2.5 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయన్నారు. రాష్ట్రంలో అద్భుతమైన మహిళా పారిశ్రామికవేత్తలు ఉన్నారన్నారు. ప్రజల జీవితాలను మార్చేందుకు కాంగ్రెస్ చేపట్టిన మిషన్‌లో చేరాలని భారత్ సమ్మిట్ ప్రతినిధులందరినీ ఆహ్వానిస్తున్నామని, మీ అనుభవం, పరిజ్ఞానం, నైపుణ్యాలను తమతో పంచుకోవాలని సిఎం కోరారు. ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుంచే ప్రజలు కేంద్రం గా అనేక కార్యక్రమాలు చేపట్టామన్నారు. ప్రజలే కేంద్రంగా పరిపాలన సాగిస్తున్నామని, అణగారిన, పేద వర్గాల కోసం అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన కార్యక్రమాలు చెప్పుకునేందుకు భారత సమ్మిట్ ఒక వేదిక మాత్రమే కాదని, అనేక విషయాలు నేర్చుకునేందుకు ఉపయోగపడిందన్నారు. అహింస, స్వతంత్రం, శాంతి వంటి అంశాలను గ్రహించామన్నారు. ఇప్పటికే వీటిని కొనసాగిస్తున్నామని, భవిష్యత్తులో తమ ప్రభుత్వ విధానాలు, పథకాలు, ఆలోచనల అమలులో వీటిని మరింత సమర్థవంతంగా కొనసాగిస్తామని ఆయన చెప్పారు.

## అగ్గికి ఆహుతి (మొదటి పేజీ తరువాయి)

ఎలాంటి ప్రాణహాని సంభవించలేదు. అయితే గుడిసెల్లో ఉంటున్న వారి నిత్యావసర సరుకులతో పాటు విద్యార్థుల పుస్తకాలు, సర్టిఫికెట్లు పూర్తిగా కాలిపోయాయి. అప్పటికే స్థానికులు ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో ఫైర్ సిబ్బంది మంటలను అదుపులో తీసుకొచ్చారు. అప్పటికే గుడిసెలు పూర్తిగా దగ్ధం అయ్యాయి. ఎంటు తోచని పరిస్థితిలో అయోమయానికి గురయ్యారు. ఒకవైపు విద్యార్థుల బతుకులు అగ్నిలో కలిసిపోయినట్టుగా సర్టిఫికెట్లు పూర్తి కాలిపోవడంతో పాటు నివాసం ఉంటున్న గుడిసె వాసుల నిత్యవసర సరుకులు బియ్యం, మంచాలు, టీవీలు, ఫ్రీడ్జులు, కూలర్లు పూర్తిగా కాలిపోయాయి. ఆదుకునే పరిస్థితి ఎవరు లేకుండా ఉందని వారు వాపోయ్యారు. ఎంతో కాలంగా ఆశగా ఎదురుచూస్తున్న గుడిసె వాసులు తమ గోడు గుడు కోసం గుడిసె వెసుకుంటే ప్రభుత్వం పట్టాలు మంజూరు చేస్తుందని ఎంతో ఆశగా ఉన్నారు. అనుమానస్పదంగా మంటలు రావడంతో గుడిసెలు పూర్తిగా కాలిపోవడం జరిగింది.

**గుడిసెవాసులను ప్రభుత్వం ఆదుకోవాలి:**

**చాడా వెంకట్‌రెడ్డి సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు**

సిపిఐ పార్టీ చెపట్టిన భూ పోరాటంలో భాగంగా దాదాపు 1000పై చిలుకు గుడిసెలు అబ్దుల్లాపూర్ మెట్ మండలంలోని కుంట్లూరు గ్రామ సమీపంలో రావి నారాయణరెడ్డి కాలనీ ఫేస్3లో గుడిసెలు ఏర్పాటు చేశారు. గుడిసెలు వేసి దాదాపు మూడు సంవత్సరాలు కావస్తున్న ప్రభుత్వం పేదోడి కోసం 40 గజాలు ఇవ్వలేని పరిస్థితి ఉందని ఆరోపించారు. నష్టపోయిన గుడిసె వాసులను తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం అదుకోవాలని డిమాండ్ చేశారు. దాదాపు 10 కోట్ల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు స్థానికులు తెలిపినట్లు వారు తెలిపారు. విద్యార్థులు వారి సర్టిఫికెట్లు పూర్తిగా అగ్నిలో ఆహుతి కావడంతో వారిని వారి చదువుతున్న పాఠశాలలో తిరిగి సర్టిఫికెట్లు విప్పించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శివర్గ సభ్యులు ఈటీ నరసింహ, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్రచారి, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల యాదిరెడ్డి, మారుపాక అనిల్ కుమార్, సిపిఐ నాయకులు పబ్బతి లక్ష్మ ణ్, బాతరాజు నరసింహ, ప్రసాద్, వేణు, హరిసింగ్ నాయక్, సక్రు నాయక్ తదితరులు ఉన్నారు.

# ఎరుపెక్కుతున్నాయ్

(మొదటి పేజీ తరువాయి)

తలదాచుకునేందుకే తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు ప్రస్తుత పరిస్థితులు చెప్పకనే చెబుతున్నాయి. అడవిని జల్లెడపడుతున్న సిఆర్‌పిఎఫ్, జీఆర్‌జి, బస్తర్ ఫైటర్స్ అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ తూటాల వర్షం కురిపిస్తున్నాయి. ప్రస్తుతం మావోయిస్టులకు కర్రెగుట్టలు మాత్రమే షెల్టర్ జోన్‌గా మిగిలాయనే వాదన వినపిస్తోంది. ఈ గుట్టలపైనే మావోయిస్టు పార్టీ మోస్‌వాంటెడ్ హిడ్మా తోపాటు మరికొంత మంది బంకర్లో తలదాచుకున్నారని బలగాలు అనుమానిస్తున్నాయి. ఇక్కడ జరిగబోయే యుద్ధంలో బలగాలు విజయం సాధిస్తే ఆపరేషన్ కగార్ ఛత్తీస్‌గఢ్‌లో ముగిసినట్లే అంటూ పలువురు విప్లవోద్యమ విశ్లేషకులు భావిస్తున్నారు.

**గుట్టలపై మావోయిస్టులు**

తెలంగాణఛత్తీస్‌గఢ్ సరిహద్దులను ఆవరింతి ఉన్న కర్రెగుట్టల్లో మావోయిస్టు పార్టీ ఉన్నట్లు పక్కా సమాచారం మేరకు సుమారు 10 వేల మంది భద్రతా బలగాలు ఆ గుట్టను మూడు వైపులా చుట్టుముట్టాయి. వారి ఆచూకి కనుగునేందుకు ఇప్పటికే కేంద్ర, ఆ రాష్ట్ర ప్రభుత్వం నాలుగు హెలీకాప్టర్లతో గగన తలం నుండి వీక్షిస్తోంది. మరో ప్రక్క అత్యాధునికమైన డ్రోన్లు సైతం ఛాయ చిత్రీలా సేకరించేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఆ గుట్టలపై వారి ఆచూకి లభ్యమైనట్లు ఇప్పటికే ఛత్తీస్‌గడ్ రాష్ట్ర ఐజి ప్రకటించిన విషయం విధితమే. ఆ గట్టను మూడువైపులా ఇప్పటికే చుట్టుముట్టిన బలగాలు నెమ్మదిగా ఎక్కేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఈ క్రమంలో జవాన్ల తీవ్ర అస్తవస్థకు గురవుతున్నారు. ఎండ వేడిమి కూడా అధికంగా ఉండటంతో జవాన్లు వడదెబ్బ భారినపడుతున్నారు. సుమారు 40 డిగ్రీలకు పై బడిన ఉష్ణోగ్రతలు నమోదవుతున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా సోమవారం సాయంత్ర గుట్ట అంచులకు చేరుకున్న బలగాలు మంగళవారం జరిగిన ఎదురు కాల్పుల్లో ముగ్గురు మహిళా మావోయిస్టులు చనిపోయినట్లు, వారి వద్ద నుండి ఆయుధాలు స్వాదీనం చేసుకున్నట్లు ప్రకటించారు. కానీ ఇప్పటి వరకు కూడా వారి మృతదేహాలను బహిర్గతం కాలేదు. ఇప్పటి ఆరు రోజుల నుండి భద్రతా బలగాలు కర్రెగుట్టలను చుట్టుముట్టి పైకి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నాయి. కర్రెగుట్టలపైకి బలగాలు చేరితే పెద్ద ఎత్తున యుద్ధం చోటు చేసుకునే అవకాశం ఉన్నట్లు అనుమానిస్తున్నారు. ఇప్పటికే ఒక జవాన్‌కు ఐఇడి పేలి తీవ్ర గాయాలపాలయ్యాడు. గుట్ట చుట్టు మావోయిస్టులు ఐఇడిలు అమర్చారనే అనుమానంతో పూర్తిస్థాయిలో సోదాలు నిర్వహిస్తూ ఒక్కొక్క మెట్టుకు ఎక్కుతున్నట్లు జవాన్లు గుట్టను ఎక్కుతున్నారు. ఇదిలా ఉండగా ఆ రాష్ట్రముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా సాగుతున్న అతి పెద్ద ఆపరేషన్ ఇది అంటూ చెప్పుకొచ్చారు.మరో ప్రక్క కేంద్రప్రభుత్వ సమాచార ప్రసార శాఖ మీడియాకు సూచనలు చేసింది. యుద్ధవాతావరణానికి సంధించిన సమాచారం విషయంలో తగు జాగ్రత్తలతో ముందుకు సాగాలని సూచించింది. అందుకు సంబంధించి లేఖను సైతం విడుదల చేశారు. శాంతి చర్చలకు తాము సిద్ధమే అంటూ మావోయిస్టు పార్టీ మూడో సారి శుక్రవారం ప్రకటించినప్పటికీ కర్రెగుట్టల ఆపరేషన్ మాత్రం ఆరు రోజు కూడా కొనసాగుతోంది. మావోయిస్టు పార్టీ ఆవిర్భావం నుండి చూస్తే ఇంత వరకు శాంతిచర్చలకు తాము సిద్ధంగా ఉన్నాం, మా అభ్యర్థనను ప్రభుత్వం పరిగణలోనికి తీసుకోవాలంటూ వరుస లేఖలు విడుదల చేయడం అదే తొలిసారి అంటూ చర్చసాగుతోంది. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి మావోయిస్టులను చర్చలకు పిలిచారు. కానీ ఆచర్చలు సఫలం కాలేదు. ఇప్పుడు ఆపరేషన్ కగార్‌లో భాగంగా సాగుతున్న కర్రెగుట్టల కథ ఎటువైపు దారితీస్తుందో అంటూ అంతా ఉత్కంఠతతో ఉండగా శాంతిచర్చలకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరుకుంటున్నారు.

## రాజకీయాలు మారాయ్

(మొదటి పేజీ తరువాయి)

కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు భారత్ జోడో పాదయాత్ర నిర్వహించినట్లు తెలిపారు. ఈ పాదయాత్ర ద్వారా తాను ముఖ్యంగా రెండు విషయాలు నేర్చుకున్నానన్నారు. 'ప్రపంచవ్యాప్తంగా మా ప్రత్యర్థులు కోపం, భయం, ద్వేషంపై గుత్తాధిపత్యం కలిగి ఉన్నారు. ఆ విషయంలో వారితో పోటీ పడటం మా వల్ల కాదు. కోపం, భయం, ద్వేషం విషయంలో వారు ప్రతిసారీ మమ్మల్ని అధిగమిస్తారు, ఓడిస్తారు' అని రాహుల్ గాంధీ అన్నారు. ఈ నేపథ్యంలో తాము ఎక్కడ, ఎలా పని చేయాలనే అంశాలపై దృష్టి సారించినట్లు చెప్పారు. తమను తాము నిర్మించుకునే అవకాశం ఎక్కడ ఉందో ఆలోచించామని అన్నారు. ఉగ్రదాడి మృతులకు రాహుల్ గాంధీ నివాళులు అర్పించారు.

## రజతోత్సవం (మొదటి పేజీ తరువాయి)

శనివారం మాజీ మంత్రి టి.హరీష్ రావు ఎల్కతుర్తిలోని బీఆర్ఎస్ బహిరంగ సభ స్థలాన్ని సందర్శించారు.ఆయన వెంట జిల్లాకు చెందిన ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. బిఆర్ఎస్ సభ విజయవంతం అవుతుందని, ఇప్పటికే అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామని, అనేక ప్రాంతాల నుండి సభకు వచ్చేందుకు ఎడ్లబండ్ల పై తరలి వస్తున్నారని తెలిపారు.

**ఒక్క అడుగుతో మొదలైన ప్రస్థానం:** ఒక్క అడుగుతో మొదలైన టీఆర్ఎస్ ప్రభంజనంగా మారి.. ప్రత్యేక రాష్ట్ర కాంక్షను నిజం చేసింది. ఒక్కో అడుగు వేస్తూ.. ఇప్పుడు 25 ఏండ్ల పండుగకు సిద్ధమవడం సంబురంగా ఉందని.. ఈ ఘనత రాష్ట్ర ప్రజలందరిదని ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్ భాస్కర్ పెద్ది సుదర్శన్ రెడ్డి అన్నారు. 14ఏళ్లు ఉద్యమ పార్టీగా..10ఏళ్లు అధికార పార్టీగా.. ఏడాదిన్నర ప్రతిపక్ష పార్టీగా ప్రజల కోసం గులాబీ జెండా. కొట్లాడుతోందన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఒక క ఉద్యమ ఉద్యమ సంస్థగా ఏర్పడి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రవచించిన బోధించు, సమీకరించు.. పోరాడు అనే లక్ష్యంతో ప్రజాస్వామ్య పద్ధతిలో.. తెలంగాణను సాధించేందుకు టీఆర్ఎస్ ముందుకు సాగిందన్నారు.

**చరిత్రలో నిలిచిపోయేలా రజతోత్సవ సభ :** ఈనెల 27న హనుమకొండ జిల్లా ఎలుకతుర్తిలో జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ప్రతి పల్లె నుంచి దండుగా కదిలి రావాలని మాజీ మంత్రి హరీష్ రావు,ఎర్రబెల్లి దయాకర్ రావు, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్ భాస్కర్ పెద్ది సుదర్శన్ రెడ్డి పిలుపునిచ్చారు. దండిగా కదలాలి.. దండుగా రావాలి.. తెలంగాణలోని ప్రతి పల్లె మురవాలే.. పదవులు కాదు.. పాలన కాదు. ప్రజలే అంతిమం.. వారు ఏమిచ్చినా తీసుకుంటాం.. ఏం చేయమన్నా చేసి తీరుతాం.. కొట్లాడి తెచ్చుకున్న రాష్ట్రం.... ప్రాణ త్యాగం చేసి సాధించుకున్న చరిత్ర... అంతటి ఘనతకు కేరాఫ్ గా నిలిచిన కేసీఆర్ నేతృత్వంలోని పార్టీకి ప్రజల గుండెల్లో పదిలమైన స్థానం ఉందన్నారు. మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ సర్కార్ పై ప్రజలకు నమ్మకం సన్నగిల్లిందని ఆరోపించారు. రేవంత్ రెడ్డి పరిపాలనను చూసి తాము మోసపోయామని ప్రజలు బాధపడుతున్నారన్నారు. కేసీఆర్ పాలనను, నేటి పాలనను చూసి అర్థం అర్థం చేసుకున్న ప్రజలు మళ్లీ కేసీఆర్ రావాలంటూ స్వచ్ఛందంగా సభకు తరలివచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని వారు వెల్లడించారు. ప్రత్యేక రాష్ట్రం సాధించిన నేతగా, దశాబ్ద కాలం రాష్ట్రాన్ని అభివృద్ధి చేసిన నాయకుడిగా కేసీఆర్ మాటలు వినేందుకు ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారని వారు పేర్కొన్నారు. నాలుగు కోట్ల ప్రజలున్న తెలంగాణలో నిర్వహిస్తున్న ఈ సభచారిత్రాత్మకంగా నిలుస్తుందని ఇలాంటి సభలు కేవలం కేసీఆర్ తోనే సాధ్యమని వారు తెలిపారు. ఎల్కతుర్తి రజతోత్సవ సభ సువర్ణాక్షరాలతో లిఖించబడుతుందని పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, దాస్యం వినయ్ భాస్కర్, పెద్ది సుదర్శన్ రెడ్డి అన్నారు. పార్టీ శ్రేణులతో పాటు ప్రజలు లక్షలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

# ప్రపంచ సుందరి పోటీలను వెంటనే రద్దు చేయాలి

### మహిళా, యువజన, విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రపంచం మార్కెట్ విస్తరణ కోసం నిర్వహిస్తున్న ప్రపంచ సుందరి పోటీలను వెంటనే రద్దు చేయాలని ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. మహిళా, యువజన, విద్యార్థి తదితర 27 సంఘాల ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుండి ఇందిరా పార్కు వరకు వందలాది మందితో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎన్ఎఫ్ఐడబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి, పిఒడబ్ల్యు నాయకురాలు సంధ్య, అరుణోదయ నాయకురాలు విమలక్క, ఐద్వ నాయకురాలు మల్లు లక్ష్మి, పిఒడబ్ల్యు ఝాన్సీ, అనసూయ మాట్లాడుతూ మిస్ ఇండియా కాదు, మిస్ వరల్డ్ కాదు, మిస్సింగ్ మహిళా కేసులను సత్వరమే తేల్చి వారి కుటుంబాలకు అందజేయాలని పేర్కొన్నారు. 120 దేశాల యువతులు అందాలు ఆరబోసి అలరించితే ప్రపంచ ప్రజలతోపాటు తెలంగాణ ప్రజలు చూసి తరించాలంటున్నారన్నారు. మహిళల భద్రత, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన చేయలేని పాలకులు అందాల పోటీలకు రూ.200 కోట్లు కేటాయించడం వారి భూస్వామ్య మనస్తత్వానికి నిదర్శనమని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.




అంతర్ సౌందర్యాన్ని గుర్తించలేని బూర్జువా భూస్వామ్య పెట్టుబడిదారి మనస్తత్వం కలిగిన వారే బాహ్య సౌందర్యాన్ని వీక్షించడం, కిరీటాలకు ఎంపిక చేయడం వ్యాపార వర్గాల వస్తువుల్ని వ్యాపారాలని పెంచుకోవడం కొరకే తప్ప మరొకటి కాదన్నారు. బహుళ జాతి కంపెనీల నియంత్రణ ఆదేశాల మేరకే కిరీటాల ఎంపిక జరగడం విచారకరమని వారు పేర్కొన్నారు. తినడానికి తిండి లేక, రోగం వస్తే వైద్యం చేయించుకోలేక, ప్రసవ సౌకర్యాలు లేక అణగారిన వర్గాలకు చెందిన మహిళలు జబ్బుల పాలవుతుంటే, తింటే అరగని వాళ్లు కొందరు సౌందర్యాత్మక హింసకు బలవుతున్నారని, స్త్రీల అందాలకు, మేధస్సుకు కొలమానాలు, కొలతలు సృష్టించి సౌందర్యాత్మక ప్రపంచంలో ఆమెను బందీని చేస్తున్నారని ధ్వజమెత్తారు. స్త్రీని అమ్మకపు వస్తువుగా చూసే సామ్రాజ్యవాద విష సంస్కృతి నశించాలని, అందుకు మహిళా ఉద్యమాలను తీవ్రతరం చేస్తామన్నారు. అందాల పోటీలను అడ్డుకుని తీరుతామని వారు స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఐడబ్ల్యు రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.డి.ఫైమీద, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రొయ్యల గిరిజ, ఉజ్జిని హైమావతి, దేవమ్మ, లావణ్య, బాలమణి, లక్ష్మి, లావణ్య డప్పు కళాకారులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో హైఅలర్ట్

### నలుగురు పాకిస్తానీయులకు నోటీసులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా కఠిన నిర్ణయాలు తీసుకున్న విషయం తెలిసిందే. ఈమేరకు భారత్‌లో ఉన్న పాక్ పౌరులు వెంటనే దేశం విడిచి వెళ్లిపోవాలని భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా అన్ని రాష్ట్రాల సిఎంలకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రత్యేకంగా ఫోన్ చేసి రాష్ట్రంలో ఉన్న పాకిస్తానీలను వెంటనే గుర్తించి వెనక్కి పంపాలని ఆదేశించారు. అదేవిధంగా డేటా పంపితే వీసాలు రద్దుచేస్తామన్నారు.

## 'వాతావరణ విద్యకు'
# యువత ప్రాధాన్యత

### మంత్రి కొండా సురేఖ ఉద్బోధ




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వాతావరణ విద్యకు మన యువత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని, తాను బలంగా నమ్ముతున్నానని పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. భారత్ సమ్మిట్ ప్యానెల్ డిస్కషన్‌లో కొండా సురేఖ ప్రసంగిస్తూ చరిత్రాత్మకమైన హైదరాబాద్ నడిబొడ్డున జరుగుతున్న భారత్ సమ్మిట్‌లో ప్రసంగించడం సంతోషంగా ఉందన్నారు. వాతావరణ న్యాయాన్ని వేగవంతం చేయడం ప్రభుత్వాల పని మాత్రమే కాదని, దీనికి విద్యావేత్తలు, పరిశ్రమలు, యువత, పౌర సమాజం క్షేత్రస్థాయిలోని సంఘాల భాగస్వామ్యం అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ సెషన్ యొక్క థీమ్ 'వాతావరణ న్యాయాన్ని వేగవంతం చేయడం' ఇది మన దేశానికి, ప్రపంచానికి చాలా అత్యవసరం... సందర్భోచితం, ఇది ఇకపై సైద్ధాంతిక ఆలోచన మాత్రమే కాదు. ఇది ఒక సజీవ వాస్తవికత అని అన్నారు. పర్యావరణ సవాళ్లను ఎదుర్కొంటూ ప్రపంచవ్యాప్తంగా భారతదేశంలో కూడా వాతావరణ మార్పులు పెరుగుతుండటాన్ని మనం చూస్తున్నామన్నారు. అస్థిర వర్షపాతం, రికార్డు స్థాయిలో వేడిగాలులు, వరదలు, జీవవైవిధ్యం కోల్పోవడం జరుగుతున్నాయని తెలిపారు. ఈ సంక్షోభం ప్రపంచ వ్యాప్తంగా ఉన్నప్పటికీ, దాని ప్రభావాలు మన అందరికీ స్థానికంగా కూడా ఉంటాయనీ అన్నారు. రైతులు, గిరిజనలు, మహిళలు, పిల్లలు, పట్టణ మురికివాడల నివాసితులు కార్బన్ ఉద్గారాలకు అతి తక్కువ కారణం అని పేర్కొన్నారు. అయినప్పటికీ, వారు ఎక్కువగా బాధితులు అవుతున్నారని అన్నారు. ఈ విషయంలో మనం వేగంగా... న్యాయంగా వ్యవహరించాలి. లేకపోతే చాలా నష్టపోతామని తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే ఈ మార్గంలో వెళ్తుందన్నారు.వనమహోత్సవం వంటి కార్యక్రమాల ద్వారా తెలంగాణలో పచ్చదనం జీవవైవిధ్యాన్ని పునరుద్ధరించడానికి ప్రభుత్వం 273 కోట్లకు పైగా మొక్కలను నాటిందన్నారు. అడవుల్లో ఉండే గిరిజనలకు స్థిరమైన వనరుల నిర్వహణలో సమాజ హక్కులు, శిక్షణ ఇస్తున్నామని తెలిపారు.




# భూభారతి చట్టం రైతులకు గొప్పవరం

### రైతుల భూ భారతి అవగాహనా సదస్సులో కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని

**ప్రజాపక్షం/సుజాతనగర్ :** భూ భారతి చట్టంతో రైతులకు ఉపయోగం ఉంటుందని, రైతులకు ఇబ్బంది లేకుండా అధికారులు పనులు నిర్వహించాలని కొత్తగూడెం శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావు తెలిపారు. శనివారం రైతులకు ఏర్పాటు చేసిన భూ భారతి అవగాహనా సదస్సులో కూనంనేని మాట్లాడుతూ రైతులకు అనుభవదారు కాలంను ఇందులో పొందుపరచలేదని, ప్రభుత్వం పరిశీలించాలని కోరారు. గ్రామాలలో సర్వే నెంబర్ ఆధారంగా సమస్యలున్నా భూములను పరిశీలించి పరిష్కరించాలన్నారు. అనంతరం కలెక్టర్ జితేష్ వి.పటేల్ మాట్లాడుతూ భూ భారతి చట్టంతో రైతులు భూమి హక్కులు రికార్డుల గురించి తెలిపారు. హక్కుల రికార్డులలో తప్పుల సవరణకు అవకాశం ఉంటుందన్నారు. పెండింగ్ సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారం ఉంటుందని, పాస్ పుస్తకాలలో భూమి పటం, ఇంటి స్థలంకు అబాది వ్యవసాయేతర భూములకు హక్కుల రికార్డు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సాబీర్ పాషా, ఆర్డీఒ డి. మధు, పిఎసిఎస్ చైర్మన్ మండే హనుమంతరావు, టిపిసిసి సభ్యులు నాగా సీతారాములు, తహశీల్దార్ శిరీష, డిటి నాగరాజు, ఎఒ నర్మద, అధికారులు, రాజకీయ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వాలు

### ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలి
### ప్రభుత్వ విశ్వ విద్యాలయాన్ని ఏర్పాటుచేయాలి
### విద్యారంగానికి బడ్జెట్‌లో 30 శాతం నిధులు కేటాయించాలి
### ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మణికంఠ రెడ్డి, లక్ష్మణ్




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్నాయని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్టా లక్ష్మణ్‌లు తెలిపారు. ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేసి పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను తక్షణమే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. శనివారం ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో ఎఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మణికంఠ రెడ్డి, లక్ష్మణ్‌లు మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఖమ్మం కేంద్రంగా యూనివర్సిటీని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిందని తక్షణమే దానిని ఏర్పాటు చేసేందుకు జిల్లాలోని మంత్రులు చొరవ తీసుకోవాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో యూనివర్సిటీలు ఉన్నాయని ఖమ్మం జిల్లాకు మాత్రమే లేదన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం కాక ముందే ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలు ఫీజుల దోపిడీకి పాల్పడుతున్నాయన్నారు. ఫీజుల దోపిడీ జరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు వెంటనే ప్రభుత్వం విడుదల చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న సమీకృత గురుకులాలను ఆహ్వానిస్తున్నామని అదే సమయంలో ప్రస్తుతం ప్రభుత్వం నడుపుతున్న మిగిలిన గురుకులాల పరిస్థితి ఏమిటని వారు ప్రశ్నించారు. ఎస్సి, ఎస్టి, బిసి, మైనార్టీ గురుకులాలకు సొంత భవనాలు నిర్మించకుండా సమీకృత గురుకులాలకు ఎలా నిర్మిస్తారన్నారు. జమ్ము కశ్మీర్‌లోని పహల్గాంలో తీవ్రవాదుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఎఐఎస్ఎఫ్ఎ మతానికి వ్యతిరేకం కాదని మతం పేరుతో జరిగే ఉన్మాదానికి, మూఢత్వానికి వ్యతిరేకమన్నారు. మతోన్మాదుల దాడిలో మరణించిన అమరవీరులకు అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర సమితి తరుపున సంతాపం, సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటికాల రామకృష్ణ, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్, రాష్ట్ర సమితి సభ్యులు ఎండి అన్వర్, మాగం లోకేష్, జిల్లా సహాయ కార్యదర్శులు నాగులమీరా, మధు, శివ నాయక్, జిల్లా కార్యవర్గ సభ్యులు మనోజ్, గోపి, ప్రతాప్, రాకేష్, గణేష్, ఉస్మాన్ పాల్గొన్నారు.

## బ్యాంక్ ఉద్యోగులతో సమానంగా..
# గోల్డ్ అప్రైజర్స్‌కు గౌరవం ఇవ్వాలి

### ఎఐబిఎ జాతీయ కార్యదర్శి బి.ఎస్.రాంబాబు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బ్యాంకు ఉద్యోగులతో సమానంగా గోల్డ్ అప్రైజర్స్‌కు గౌరవం ఇవ్వాలని అఖిల భారత బ్యాంక్ ఉద్యోగుల సంఘం (ఎఐబిఎ) జాతీయ కార్యదర్శి బి.ఎస్.రాంబాబు అన్నారు. హైదరాబాద్‌లో శనివారం తెలంగాణ ఆల్ బ్యాంక్స్ గోల్డ్ అప్రైజర్స్ ఫెడరేషన్ ప్రథమ మహాసభ ఘనంగా జరిగింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షుడు టి.రవీందర్‌నాథ్ అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలకు బి.ఎస్.రాంబాబు ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ బ్యాంకుల ఆర్థిక వృద్ధిలో కీలక భూమిక పోషిస్తున్న అప్రైజర్స్ అన్ని సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా వారికి ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయడంతో పాటు అప్రైజర్స్‌కు వారి కుటుంబ సభ్యులకు ఆరోగ్య కార్డులను అందజేయాలన్నారు. వారికి కమిషన్‌ను వేతనం రూపంలో అందజేసి గౌరవ ప్రదమైన జీవితాన్ని కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల రిజర్వు బ్యాంక్ విడుదల చేసిన మార్గదర్శకాలు అప్రైజర్స్‌కు పూర్తిగా వ్యతిరేకంగా ఉన్నాయని, వాటిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సుదీర్ఘ పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని, ఇందుకు అప్రైజర్స్ సంసిద్ధంగా ఉండాలని నాయకులు దిశా నిర్దేశనం చేశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సంయుక్త కార్యదర్శులు పి.వి.కృష్ణరావు, నల్లపరెడ్డి, ఉప ప్రధాన కార్యదర్శులు సమద్ ఖాన్, అజయ్ కుమార్, మధు సూదన్, తెలంగాణ ఆల్ బ్యాంక్స్ గోల్డ్ అప్రైజర్స్ ఫెడరేషన్ అధ్యక్షులు ఆర్రోజు రాఘవ చారి, ఆంధ్రప్రదేశ్ ఆల్ బ్యాంక్స్ గోల్డ్ అప్రైజర్స్ ఫెడరేషన్ అధ్యక్షులు ఇ.శ్రీనివాస్ పాల్గొన్నారు.

# గిగ్ వర్కర్ల కోసం నూతన చట్టం

### మంత్రి జూపల్లి కృష్ణారావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో పనిచేస్తున్న గిగ్, ప్లాట్ ఫాం వర్కర్లకు సంక్షేమం, సామాజిక భద్రత, బీమా తదితర సదుపాయాలు కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం త్వరలోనే నూతన చట్టాన్ని తీసుకురాబోతుందని దేశానికే ఆదర్శంగా ఉండేలా దీన్ని తీర్చిదిద్దుతున్నామని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. హైటెక్స్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ (హెచ్ఐసిసి)లో భారత్ సమ్మిట్ 2025లో తెలంగాణ గిగ్ వర్కర్ల ముసాయిదా బిల్లుపై చర్చా గోష్టి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరయ్యారు. గిగ్ వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలు, సామాజిక భద్రత, కనీస వేతనాలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. ఫుడ్ డెలివరీ, క్యాబ్ సర్వీస్, నిత్యావసర సరుకుల రవాణా, అర్బన్ క్లాప్ వంటి సేవలతో మన నిత్య జీవితంలో భాగమయ్యాయని అన్నారు. భారత్ జోడో యాత్రలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో పర్యటించిన సందర్భంలో గిగ్ వర్కర్ల సాధికారత, సామాజిక భద్రత కోసం చర్యలు తీసుకుంటామని రాహుల్ గాంధీ మాట ఇచ్చారని అన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి సిఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వం గిగ్ వర్కర్ల సంక్షేమం కోసం ముసాయిదా బిల్లును రూపొందించిందని తెలిపారు. రాజస్థాన్, కర్నాటక రాష్ట్రాలను ఆదర్శంగా తీసుకొని వాటి కంటే ఉత్తమమైన విధానాన్ని తీసువస్తున్నామని చెప్పారు. ముసాయిదా బిల్లుపై కార్మిక శాఖ స్పెషల్ సిఎస్ సంజయ్ కుమార్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రభుత్వం రూపొందించిన ముసాయిదా బిల్లు అద్భుతంగా ఉందని దేశీయ, అంతర్జాతీయ ప్రతినిధులు అభినందించారు. రాజస్థాన్, కర్ణాటక రాష్ట్రాల కంటే మెరుగ్గా ఉందని అభిప్రాయపడ్డారు. ఈ చర్చా గోష్టిలో కొలంబియా, బ్రెజిల్, ఈక్వెడార్, తదితర దేశాలకు చెందిన ప్రతినిధులు, ఎఐసిసి బిసి, ఎస్‌సి, ఒబిసి, మైనార్టీ, అండ్ ఆదివాసీ విభాగ కోఆర్డినేటర్, మాజీ ఐఎఎస్ అధికారి కొప్పుల రాజు, అల్ ఇండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్ చైర్మన్ ప్రవీణ్ చక్రవర్తి, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతినిధులు, తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్ ఫాం వర్కర్స్ యూనియన్ కార్యదర్శి షేక్ సలావుద్దీన్, మజ్దూర్ కిషన్ శక్తి సంఘటన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్‌లో
# గిరిజన ఉద్యోగులకు అన్యాయం

### తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య నాయక్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్‌లో రూల్స్ ప్రకారం గిరిజన ఉద్యోగులకు రూల్స్ ప్రకారం దక్కాల్సిన పదోన్నతులు దక్కకుండా నేటికి కూడ తీవ్ర అన్యాయం జరుగుతూనే ఉందని, దీనిని తక్షణమే సరిదిద్దాలని తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్య నాయక్ డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రం సిద్ధిస్తే తమ కొలువులు తమకు తమ నిధులు తమకని తెగించి పోరాడి తెలంగాణను సాధించుకున్నామని, కాని తెలంగాణలో నేటికీ కూడా వివిధ రంగాల్లో స్థానికులకు అన్యాయం జరుగుతూనే ఉదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో రిటైర్డ్ అయిన ఉద్యోగులు ప్రావీణ్యత కలిగిన ఇంజనీర్లు ఉన్నప్పటికీ వారిని కాదని, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ రమేష్ రెడ్డి స్థానికేతరుడైన 70 ఏళ్ల దాటిన ఆర్‌సి కుమార్ అవుట్‌సోర్సింగ్ విధానంలోఫైనాన్స్ అడ్వైజర్‌గా నియమించుకొని ఆ పేరుతో నెల రూ.2.50లక్షలు వేతనం చెల్లించడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు అవుట్ సోర్సింగ్ వారిని తొలగించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశాలు ఇస్తే, తొలగించినట్లు చూపించి హౌసింగ్ కార్పొరేషన్‌లో లోపాయి కారిగా చేసి అక్రమంగా ఆర్‌సి కుమార్‌నే కొనసాగించడంతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మరో ఉద్యోగినిని లీగల్ అడ్వైజర్‌గా కూడా రూ.1.50లక్షల జీతం ఇస్తూ నియమించారని తెలిపారు. వెంటనే వారిని తొలగించి ప్రమోషన్ ప్రకారం వారి స్థానంలో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ అయినటువంటి తెలంగాణకు చెందిన స్థానిక డిప్యూటీ ప్రాజెక్ట్ ఇంజనీర్లను నియమించాలని పోలీస్‌హౌసింగ్ కార్పొరేషన్ ఎండికి అంజయ్య నాయక్ విజ్ఞప్తి చేశారు.


**మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయం**
అమర్చింత మునిసిపాలిటీ, వనపర్తి జిల్లా. (TS)

ఇ-ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ నోటీసు

'ఇ' ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారంలో **2 పనులకు** టెండర్ ఆహ్వానించడమైనది. **బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభం తేది:** 28.04.2025న ఉ.10:30 గం.లకు, **బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ముగింపు తేది:** 01.05.2025న సా.4:30 గం.ల వరకు. మరిన్ని వివరాలను ఆహ్వానించే బిడ్లను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అనగా https://tender.telangana.gov.inలో చూడవచ్చు. కమిషనర్ కార్యాలయం, అమర్చింత మునిసిపాలిటీ, తెలంగాణ రాష్ట్రం. ఫోన్: 8340817917, 7330690290.

సం/- కమిషనర్, అమర్చింత మునిసిపాలిటీ

DIPR R.O. No. : 875-PP/CL/ADVT/1/2025-26, Date: 26-04-2025

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్ నెం.6

NIT No.01/EE-6/CRZ/GHMC/2025-26 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ నోటీసు తేది:26.04.2025

**పని స్వభావం:** సిసి రోడ్లు మరియు డెయిన్ బాక్సు పనులు, **అంచనా విలువ:** రూ.443.10లక్షలు, **బిడ్ల స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం:** *డౌన్‌లోడ్ ప్రారంభ తేది:* 26.04.2025న మ.02.00గం.ల నుండి, **బిడ్ల స్వీకరణకు ఆఖరి** *తేది:* 01.05.2025న మ.02.00గం.ల వరకు. **అధికారి పేరు & చిరునామా:** శ్రీ ఎం.పీర్ సింగ్, ఇఇ, డివిజన్-6, సిఆర్‌జెడ్, జిహెచ్ఎంసి, హైదరాబాద్. ఫోన్ నం. 9154960551. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా www.tender.eprocurement.gov.inలో చూడవచ్చు. గమనిక: టెండర్ నోటీసు తేదీ తరువాత 1% ఇఎండి పొందాలి.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్ నెం.6, చార్మినార్ జోన్, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్.

DIPR R.O. No. : 905-PP/CL/ADVT/1/2025-26, Date: 26-04-2025



**తెలంగాణ ప్రభుత్వము**
**రెవెన్యూ (భూసేకరణ) శాఖ**
**ఫారం-VII**
**(డిక్లరేషన్ / రూఢి ప్రకటన)**

(భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం, 2013, కేంద్ర చట్టం 30/2013) యొక్క సెక్షన్ 19(1) మరియు రాష్ట్ర రూలు 25(1) ను అనుసరించి)

**కలెక్టర్ గారి కార్యాలయం ఫైల్ నెం. G3/1991/2024** **తేది: 24/04/2025**
**రెవెన్యూ డివిజనల్ అధికారి, హుస్నాబాద్ ఫైల్ నెం. D/1367/2024** **తేది: 17/04/2025**
**గెజిట్ నెంబరు: 38/2025** **తేది: 24/04/2025**

తెలంగాణ ప్రభుత్వం / జిల్లా కలెక్టర్ సిద్దిపేట గారి ఆదేశానుసారం దిగువ నిర్దిష్ట పరిచిన సిద్దిపేట జిల్లా అక్కన్నపేట్ మండలము మల్లంపల్లి, జనగాం మరియు రేగొండ గ్రామంలో ఉన్న భూమి విస్తీర్ణం **ఎకరములు 13.09 గుంటలు** ప్రజా ప్రయోజన నిమిత్తం అనగా గౌరవెల్లి కుడి వైపు ప్రధాన కాలువపై డిస్ట్రిబ్యూటరీల మైనర్లు నిర్మాణ నిమిత్తము కొరకు ఈ దిగువ చూపిన భూమి అవసరం అయి ఉన్నదని భావించినందున సేకరించుటకు నిర్ణయించినారు.
కావున సిద్దిపేట జిల్లా అక్కన్నపేట్ మండలము మల్లంపల్లి, జనగాం మరియు రేగొండ గ్రామంలో ఉన్న భూమి విస్తీర్ణం **ఎకరములు 13.09 గుంటలు** గల భూమి ప్రయోజన నిమిత్తం అనగా గౌరవెల్లి కుడి వైపు ప్రధాన కాలువపై డిస్ట్రిబ్యూటరీల మైనర్లు నిర్మాణ నిమిత్తము కొరకు భూసేకరణ ప్రామాణిక కొలతలు గల భూమికై దిగువ వివరించిన విధముగా రూఢి ప్రకట (డిక్లరేషన్) చేయబడుచున్నాము.

**షెడ్యూల్**

| క్ర. సం. | సర్వే నెం. | [illegible] | [illegible] | పట్టాదారు పేరు & అనుభవదారు పేరు | నిర్మాణాలు (చెట్లు, బోర్లు, బావులు, కట్టడములు మరియు ఇతరములు) |
|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 |
| గ్రామము: మల్లంపల్లి మండలము: అక్కన్నపేట జిల్లా: సిద్దిపేట | | | | | |
| for excavation of Minor - 1R of D3 on Gouravelly Right side Main Canal from KM 0.343 to KM 1.400 | | | | | |
| 1 | 529 | మెట్ట/పట్టా | 0.30 | పంజా రమ భర్త యాదగిరిస్వామి (0.08) | |
| | | | | కాశాబోయిన సమ్మయ్య తండ్రి పెద్దాపురం (0.08) | |
| | | | | కాశాబోయిన శ్రీనివాస్ తండ్రి పెద్దాపురం (0.08) | |
| | | | | తెలు హరీష్ తండ్రి అంజయ్య (0.06) | |
| 2 | 537 | మెట్ట/పట్టా | 0.22 | ఆళ్ళ చంద్రయ్య తండ్రి రామయ్య (0.06) | |
| | | | | కాశాబోయిన శ్రీనివాస్ తండ్రి పెద్దాపురం | |
| | | | | పంజ రవళి భర్త రాజు (0.15) | |
| | | | | రోడ్ (0.01) | |
| 3 | 538 | మెట్ట/పట్టా | 1.04 | గాజుల కౌసల్య భర్త కొమురయ్య (0.14) | |
| | | | | గాజుల మహేందర్ తండ్రి కొమురయ్య (0.1450) | |
| | | | | గాజుల సంపత్ తండ్రి కొమురయ్య (0.1450) | |
| | | | | రోడ్డు (0.01) | |
| 4 | 540 | మెట్ట/పట్టా | 0.15 | తిగుళ్ళ చంద్రయ్య తండ్రి హన్మంతు (0.15) | |
| 5 | 539 | మెట్ట/పట్టా | 0.27 | తిగుళ్ళ సంపత్ తండ్రి హన్మంతు (0.14) | |
| | | | | తిగుళ్ళ రాజయ్య తండ్రి హన్మంతు (0.13) | |
| 6 | 522 | మెట్ట/పట్టా | 1.20 | పబ్బ సదానందం తండ్రి మొండయ్య (0.19) | |
| | | | | మల్లం శ్రీకాంత్ తండ్రి నర్సయ్య (0.24) | |
| | | | | మాచర్ల శ్రీనివాస్ తండ్రి వెంకటయ్య (0.02) | |
| | | | | మాచర్ల మొండయ్య తండ్రి మల్లయ్య (0.08) | |
| | | | | మాచర్ల సంపత్ తండ్రి మల్లయ్య (0.06) | |
| | | | | రోడ్డు (0.01) | |
| 7 | 511 | మెట్ట/పట్టా | 0.20 | మార్క యాదయ్య తండ్రి రాజయ్య (0.02) | |
| | | | | మాచర్ల శ్రీనివాస్ తండ్రి వెంకటయ్య (0.17) | |
| | | | | రోడ్డు (0.01) | |
| | | విస్తీర్ణం: | 5.18 | | |
| గ్రామము: జనగాం మండలము: అక్కన్నపేట జిల్లా: సిద్దిపేట | | | | | |
| for excavation of Minor - 3R of D1 on Gouravelly Right side Main Canal from KM 0.000 to KM 0.250 | | | | | |
| 1 | 403 | మెట్ట/పట్టా | 0.08 | కొడముంజ రామస్వామి తండ్రి మల్లయ్య (0.05) | |
| | | | | వద్దిరాల కట్కూరి సాయిమల్లయ్య తండ్రి రాజయ్య(0.03) | |
| 2 | 408 | మెట్ట/పట్టా | 0.01 | కొమ్మెర శ్రీకాంత్ రెడ్డి తండ్రి వీరారెడ్డి (0.01) | |
| 3 | 409 | మెట్ట/పట్టా | 0.10 | ఓద్దిరాల కొంరయ్య తండ్రి సాయన్న (0.04) | |
| | | | | కోడముంజ పోచయ్య తండ్రి రాజయ్య (0.06) | |
| 4 | 410 | మెట్ట/పట్టా | 0.14 | కొమ్మెర శ్రీకాంత్ రెడ్డి తండ్రి వీరారెడ్డి (0.10) | |
| | | | | మౌటం భగత్ తండ్రి రాజయ్య (0.04) | |
| | | విస్తీర్ణం: | 0.33 | | |
| గ్రామము: జనగాం మండలము: అక్కన్నపేట జిల్లా: సిద్దిపేట | | | | | |
| for excavation of Minor - 4TE of D1 on Gouravelly Right side Main Canal from KM 0.000 to KM 0.300 | | | | | |
| 1 | 621 | మెట్ట/పట్టా | 0.01 | పోగుల నవీన్ తండ్రి రాజేశం (0.01) | |
| 2 | 622 | మెట్ట/పట్టా | 0.10 | కోండం సరోజన భర్త హరికిషన్ రెడ్డి (0.10) | |
| 3 | 623 | మెట్ట/పట్టా | 0.01 | కోండం సరోజన భర్త హరికిషన్ రెడ్డి (0.01) | |
| 4 | 628 | మెట్ట/పట్టా | 0.15 | గోపు గీత రెడ్డి భర్త రాంరెడ్డి (0.14) | |
| | | | | దారి (0.01) | |
| 5 | 629 | మెట్ట/పట్టా | 0.01 | గోపు గీత రెడ్డి భర్త రాంరెడ్డి (0.01) | |
| 6 | 808 | మెట్ట/పట్టా | 0.05 | వడియాల ప్రభాకర్ రెడ్డి తండ్రి మాధవరెడ్డి (0.0450) | |
| | | | | దారి (0.0050) | |
| | | విస్తీర్ణం: | 0.33 | | |
| గ్రామము: రేగొండ మండలము: అక్కన్నపేట జిల్లా: సిద్దిపేట | | | | | |
| for excavation of Minor - 1R of D2 on Gouravelly Left side Main Canal from KM 0.000 to KM 1.150 & KM 1.500 to KM 2.100 | | | | | |
| 1 | 941 | మెట్ట/పట్టా | 0.13 | బైరి వెంకటస్వామి తండ్రి ఐలయ్య (0.13) | |
| 2 | 937 | మెట్ట/పట్టా | 0.31 | నెల్లి శ్రీమతి భర్త రాజు (0.29) | |
| | | | | మేడబోయిన వెంకటయ్య (0.02) | |
| 3 | 936 | మెట్ట/పట్టా | 0.03 | చెల్పూరి రాజిరెడ్డి తండ్రి లక్ష్మారెడ్డి (0.03) | |
| 4 | 935 | మెట్ట/పట్టా | 0.08 | కూన లక్ష్మి భర్త శ్రీనివాస్ (0.08) | |
| 5 | 934 | మెట్ట/పట్టా | 0.05 | మాంకాళి ఎల్లయ్య తండ్రి పోచయ్య | |
| | | | | మేడబోయిన వెంకటయ్య తండ్రి కొమురయ్య (0.05) | |
| 6 | 894 | మెట్ట/పట్టా | 0.09 | జోడు రాజిత భర్త శ్రీనివాస్ (0.09) | |
| 7 | 893 | మెట్ట/పట్టా | 1.09 | పెండ్యాల పోచయ్య తండ్రి వెంకటయ్య (0.21) | |
| | | | | గంగం వినోద భర్త రాజిరెడ్డి (0.18) | |
| | | | | మడమడకల మధుసూదన్ రెడ్డి తండ్రి దుర్గారెడ్డి (0.10) | |
| 8 | 892 | మెట్ట/పట్టా | 0.31 | కర్నె లచవ్వ భర్త లింగయ్య (0.06) | |
| | | | | గంగారపు ఎల్లమ్మ భర్త మల్లయ్య (0.17) | 1-పైప్ లైన్, 30 - టేకు చెట్లు |
| | | | | రెండ్ల సంపత్ తండ్రి చంద్రయ్య (0.08) | |
| 9 | 887 | మెట్ట/పట్టా | 0.12 | అందే లచావ్వ భర్త మల్లయ్య (0.12) | |
| 10 | 888 | మెట్ట/పట్టా | 0.08 | జీడి రేణుక భర్త మల్లయ్య (0.02) | |
| | | | | తాడూరి ప్రసాద్ తండ్రి ఎల్లయ్య (0.06) | |
| 11 | 886 | మెట్ట/పట్టా | 0.21 | గంగారపు ఎల్లమ్మ భర్త వెంకటమల్లు (0.07) | 1-పైప్ లైన్, 15 - మామిడి చెట్లు |
| | | | | జీడి రాజమ్మ భర్త కొమురయ్య (0.04) | |
| | | | | రెండ్ల జయవ్వ భర్త మల్లయ్య (0.10) | |
| 12 | 885 | మెట్ట/పట్టా | 0.39 | బద్దం రాజిరెడ్డి తండ్రి బాలరెడ్డి (0.16) | |
| | | | | మధునాల పుష్పలత భర్త వెంకటేశం (0.23) | |
| 13 | రోడ్ | | 0.03 | రోడ్ (0.03) | |
| 14 | 843 | మెట్ట/పట్టా | 0.13 | ఎర్రబెల్లి రాజకొమురయ్య తండ్రి కొమురయ్య (0.13) | |
| | | విస్తీర్ణం: | 6.05 | | |
| | | మొతం విస్తీర్ణం: | 13.09 | | |

ఇట్టి ప్రకటన భూసేకరణ సంబంధించి గతములో జారీచేసిన ప్రాథమిక నోటిఫికేషన్ పై సెక్షన్ (15) క్రింద నిర్ణీత గడువులో ఎలాంటి అభ్యంతరాలను రానందున, ఇట్టి రూఢి ప్రకటన (డిక్లరేషన్) జారీ చేయబడుచున్నది. ఈ భూసేకరణ గౌరవెల్లి కుడి వైపు ప్రధాన కాలువపై డిస్ట్రిబ్యూటరీల మైనర్లు నిర్మాణ నిమిత్తము కొరకు మాత్రమే అయినందున గ్రామములో ఎవరు కూడా నిర్వాసితులు కానందున పునరావాస ప్రశ్న ఉత్పన్నము కాదు.
ప్రాజెక్ట్ కొరకు భూమి సేకరించబడుచున్నందున నిర్మాణ దశలో ఉన్న సదరు భూమి లేదా సదరు భూమి యొక్క ఏదని భాగం, ఇతర భాగాలలో ఉండే గనులు, ఖనిజాలను త్రవ్వ సమయములో బొగ్గు, ఇనుము రాయి, నాపరాయి లేదా ఇతర ఖనిజాల గనులున నుండి వచ్చే ఖనిజాలు అవసరం లేదు.
ఇట్టి భూమి యొక్క ప్లానును భూసేకరణ అధికారి మరియు రెవెన్యూ డివిజనల్ అధికారి, హుస్నాబాద్ గారి కార్యాలయములో ఏదేని పని దినమున పని వేళలో తనిఖీ చేసుకోవచ్చును.

సం/- భూసేకరణ అధికారి & రెవెన్యూ డివిజనల్ అధికారి. హుస్నాబాద్.
సం/- అదనపు కలెక్టర్, సిద్దిపేట.
సం/- జిల్లా కలెక్టర్, సిద్దిపేట.

DIPR RO NO. 55/LA/PP/Advt/Pub/2025-26

# పాప్‌కార్న్

## రోబోల పరుగులు!






మనుషులతో పోటీపడుతూ రోబోలు కూడా పరుగులు తీసే రోజులు ఎంతో దూరంలో లేవు. చైనా రాజధాని బీజింగ్‌లో ఇటీవల జరిగిన ఓ హాఫ్ మారథాన్‌లో మానవ రూపంతో ఉన్న రోబో లు పాల్గొన్నాయి. స్కై ప్రాజెక్ట్ అల్ట్రా రూపొందించిన 'తియెన్ కుంగ్ అల్ట్రా' అనే హ్యూమనాయిడ్ రోబో 13.1మైళ్లు (21.1 కిలోమీటర్లు) దూరాన్ని 2 గంటలా, 40 నిమిషాల, 42 సెకెన్లలో పూర్తి చేసి, నాన్ హ్యూమన్ విభాగంలో అగ్రస్థానాన్ని ఆక్రమించింది. భవిష్యత్తులో రోబోలు కూడా మనుషులతో సమానంగా క్రీడా పోటీల్లో పాల్గొనే అవకాశాలు ఉన్నాయని చైనాలో జరిగిన హాఫ్ మారథాన్ స్పష్టం చేసింది.

## మురికి వర్షం..



వర్షంలో తడవడం చాలా మందికి ఇష్టం. అందుకేనేమో లెక్కలేనన్ని సినిమాల్లో వర్షం పాటలు ఉన్నాయి. కానీ, అమెరికాలోని కన్‌కార్డ్‌లో కురిసిన వర్షాన్ని చూసి స్థానికులు నిర్ఘాంతపోయా రు. శాస్త్రవేత్తలు పరిశోధనలు చేశారు. అక్కడ కురిసింది మామూలు వర్షం కాదు.. కార్లను కప్పే వసంత పుప్పొడి వర్షం అంతకంటే కాదు. అది 'మురికి వర్షం'. మురుగునీటితో కూడిన వర్షం కురవడంతో, ధూళి న్యూ ఇంగ్లాండ్ ప్రాంతాన్ని ముంచెత్తింది. మైనేలోని పోర్ట్‌ల్యాండ్‌లో డబ్లుజిఎంఇటివికి చెందిన వాతావరణ శాస్త్రవేత్త క్రిస్టియన్ బ్రిడ్జెస్ ఉపగ్రహ చిత్రాలను తనిఖీ చేస్తూ, ఈ విషయాన్ని గుర్తించి కలవరపడ్డాడు. ధూళిని మోసుకొచ్చిన మురికివర్షాన్ని ఎన్నడూ చూడలేద ని, కనీసం వినలేదని వ్యాఖ్యానించాడు. ఈనెల 17వ తేదీ ఉదయం మురికి వర్షం కురవడానికి, అంతకు రెండు రోజుల ముందు వచ్చిన తుఫాను ప్రధాన కారణమని శాస్త్రవేత్తలు అంటున్నారు. తుఫాన్ వ్యవస్థ ద్వారా పొందిన సమాచారం మేరకు న్యూ మెక్సికోలో దట్టమైన దుమ్ము పైకి లేచింది. అది ఉత్తర దిశగా ప్రయాణించి, చివరికి న్యూ ఇంగ్లాండ్ చేరుకుంది. అదే సమయంలో వర్షం కురవడంతో, దుమ్ము, ధూళితో కూడిన జల్లులు పడ్డాయి. బలమైన గాలి కారణంగా దుమ్ము ధూళి వర్షపు మేఘాల స్థాయి కంటే 10,000 అడుగుల (3,000 మీటర్లు) ఎత్తుకు చేరుకుందని శాస్త్రవేత్తల అభిప్రాయం. ఈ దుమ్ము దేశంలో సుమారు 2,000 మైళ్ళు (3,200 కిలోమీటర్లు) ప్రయాణించడం గమనార్హం. విస్కాన్సిన్, మిచిగాన్. ఉత్తర గ్రేట్ లేక్స్ ప్రాంతంలోని కొన్ని ప్రాంతాలలో కూడా మైనే, న్యూ హాంప్‌షైర్, మసాచుసెట్స్‌లను తాకేముందు మురికి వరం నమోదైనట్టు అమెరికా వాతావరణ శాఖ ప్రకటించింది. ఇటువంటి వర్షం అసాధారణమైనదనిగానీ, అపూర్వమైనది కాదని, పశ్చిమ అటవీ మంటల నుండి వచ్చే పొగ తూర్పువైపుకు వచ్చే విధానాన్ని పోలి ఉంటుందని బ్రిడ్జెస్ అభిప్రాయం. ఏదిఏమైనా అకేడియా నేషనల్ పార్క్ ఉన్న స్వచ్ఛమైన మైనేలోనూ దుమ్ముతో కూడిన మురికి వర్షం కురవడం ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశమైంది.

## బొగ్గు బస్తాలతో పరుగు

ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో సంప్రదాయ క్రీడలు ఉన్నాయి. వీటిలో కొన్ని విచిత్రంగానూ, మరికొన్ని అద్భుతంగానూ కనిపిస్తాయి. ఇంగ్లాండ్‌లోని వెస్ట్ యార్క్‌షైర్‌లోని ఒసెట్‌లో జరిగిన 'బొగ్గు బస్తాతో పరుగు' ఇలాంటి చిత్రమైన పోటీల్లో ఒకటి. ఈ నెల 21న జరిగిన బొగ్గు మోసే ప్రపంచ చాంపియన్‌షిప్ సోషల్ మీడియాలో లక్షలాది వ్యూలను సంపాదించుకుంది. ఇందులో పాల్గొన్న వారు 50 కిలోల బరువుగల బొగ్గు బస్తాతో 1.1కిలోమీటర్లు పరుగు తీశారు. ఆడ మగ అనే తేడా లేకుండా ఎక్కువమంది ఈ పోటీలో పాల్గొన్నారు. ఇది పోటీ మాదిరి కాకుండా సరదా ఈవెంట్‌గా కొనసాగింది. పోటీదారులు బొగ్గు బస్తాలు ఎత్తుకొని రోడ్లపై పరుగులు తీస్తున్న సమయంలోనే చిరు జల్లు లు పడడంతో, అంతా కేరింతలు కొట్టారు. రేసు ఎవరు గెలిచారు అనేది అక్కడ ప్రధానంగా కనిపించలేదు. పోటీదారులంతా సరదాగా, ఒకరినొకరు ప్రోత్సహించుకుంటూ ముందుకు కదలడం కనిపించింది. వలంటీర్లు, ప్రేక్షకులు వీరిని ఉత్సాహపరుస్తూ, మంచినీటిని అందిస్తూ, చాంపియన్‌షిప్‌లో తాము కూడా భాగస్వాములయ్యారు.

## అత్యుత్సాహంతో కటకటాల్లోకి..



అమెరికాకు చెందిన 24 ఏళ్ల ఒక యూట్యూబర్ అత్యుత్సాహాన్ని ప్రదర్శించి, భారత దేశంలో అరెస్టయ్యాడు. మైఖైలో విక్టోరోవిచ్ పాలియాకోవ్ అనే యూట్యూబర్ భారత్ పర్యటనకు వచ్చాడు. తన చానెల్ కోసం వీడియోలు తీసుకున్నాడు. ఎవరూ సాహసించని రీతిలో, హిందూ మహాసముద్రంలోని నిషిద్ధ ప్రాంతానికి వెళ్లి, అక్కడ ఒంటరిగా జీవిస్తున్న గిరిజన తెగకు సంబంధించిన వీడియోను తీసేందుకు ప్రయత్నించి, చిక్కుల్లో పడ్డాడు. అతనిని ఈనెల 29న అండమాన్ మరియు నికోబార్ దీవుల రాజధాని పోర్ట్ బ్లెయిర్‌లోని స్థానిక కోర్టు ముందు పోలీసులు హాజరుపరచనున్నారు. అరిజోనాలోని స్కాట్స్‌డేల్‌కు చెందిన పాలియాకోవ్ అరెస్టును భారత అధికారులు ధ్రువీకరించారు. నిషిద్ధ ప్రాంతానికి వెళ్లి, అక్కడ కోక్, కొబ్బరి బోండాలను పారేయడమే గాక, కొన్ని ప్రాంతాలను తన కెమెరాలో చిత్రీకరించారు. తన పడవ వద్దకు చేరుకునే ముందు ఇసుక నమూనాలను కూడా సేకరించాడు. బయటి వ్యక్తులు సెంటినెలీస్‌ను కలవడం ఆ తెగ మనుగడకు ప్రమాదం కలిగిస్తుంది కాబట్టి వారు ఉంటున్న ప్రాంతానికి వెళ్లడాన్ని భారత ప్రభుత్వం నిషేధించింది. ఈ చట్టాన్ని ఉల్లంఘించిన వారికి ఐదు సంవత్సరాల వరకు జైలు శిక్ష లేదా జరిమానా లేదా ఈ రెండూ విధించే అవకాశాలు ఉంటాయి. ఇలావుంటే, హిందూ మహాసముద్రంలో, వేల సంవత్సరాలుగా ప్రపంచంలోని ఇతర ప్రాంతాల నుండి దూరంగా ఉత్తర సెంటినెల్ ద్వీపం ఉంది. ఈ జనాభా ఉన్న ద్వీపానికి 3 మైళ్ల దూరానికి మాత్రమే సందర్శకులను అనుమతిస్తారు. అంతకు మించి ముందుకు వెళ్లడానికి వీల్లేదు. చిన్న, దట్టమైన అడవులతో కూడిన ద్వీపంలో సంచరించే జంతువులను వేటాడేందుకు నివాసితులు ఈటెలు, విల్లు, బాణాలను ఉపయోగిస్తారు. బయటి వ్యక్తులపై తీవ్ర అనుమానంతో, వారు తమ బీచ్‌లలో దిగే ఎవరినైనా దాడి చేస్తారు. 2018లో, బీచ్‌లో చట్టవిరుద్ధంగా దిగిన ఒక అమెరికన్ మిషనరీని ఉత్తర సెంటినెలీస్ ద్వీపవాసులు చంపారు. వారు అతనిని బాణాలతో కాల్చి, ఆపై అతని మృతదేహాన్ని బీచ్‌లో పాతిపెట్టారు. 2006లో, అనుకోకుండా ఒడ్డుకు చేరుకున్న ఇద్దరు మత్స్యకారులను సెంటినెలీస్ హతమార్చారు. ఇలాంటి సంఘటనపు పునరావృతం కాకుండా అధికారులు అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అయినప్పటికీ కొంత మంది భద్రతా బలగాల కన్నుగప్పి, సెంటినెల్ గిరిజన తెగను కలిసే ప్రయత్నం చేస్తున్నారు.పాలియాకోవ్ అదే ప్రయత్నం చేసి కటకటాలపాలయ్యాడు.

## దురదృష్టంలోనూ అదృష్టం!



కొన్నిసార్లు దురదృష్టం కూడా ఎంతో కొంత అదృష్టాన్ని వెంట తీసుకొస్తుందని అంటారు. ఈ నానుడి 17 ఏళ్ల బ్లూమ్ కెర్మోడ్ విషయంలో నిజమైంది. ఈ నెల 25వ తేదీ, శుక్రవా రం రోజున ఆస్ట్రేలియాలోని క్వీన్స్‌ల్యాండ్‌కు చెందిన కెర్మోడ్ మంచంపై పడుకొని, ఫోన్‌లో టిట్‌టాక్ చూసున్నది. బయట ఉరుములతో కూడిన భారీ వర్షం కురుస్తున్న విషయాన్ని పట్టించుకోకుండా, ఫోన్‌లో లీనమైంది. అయితే, హఠాత్తుగా పిడుగుపాటుకు పైకప్పు కొంత భాగం ధ్వంసమై, విద్యుత్ ఆమె శరీరంగుండా వెళ్లింది. ఇంట్లో ఉన్నప్పుడు పిడుగుపాటు దురదృష్టం అనుకుంటే, అంతపెద్ద ప్రమాదం నుంచి పెద్దగా గాయాలు ఏవీ లేకుండా బయటపడడం కెర్మోడ్ అదృష్టం. 'పెద్ద శబ్దం వినిపించింది. ఏం జరిగిందో తెలుసుకునేలోపే నా చేతిలో ఉంచి విద్యుత్ ప్రవహించింది. కొంతసేపు చెయ్యి మొత్తం పక్షవాతం వచ్చినట్టు చచ్చుబడిపోయింది. భయంతో ఇంటి బయటకు పరుగులు తీశాను. కొంతసేపటికి పరిస్థితి మెరుగుపడింది. మళ్లీ ఇంట్లోకి వచ్చి చూస్తే, భారీ విధ్వంసం ఏదో జరిగినట్టు గదిలో వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి' అని 10 న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కెర్మోడ్ చెప్పుకొచ్చింది.

**బిఎస్ఎస్ మైత్రేయి**

# టెర్రర్ అంతం ఒక్కటే మార్గం

ఈ నెల 22న అనంతనాగ్ జిల్లాలోని పహల్గాం లోని బైసారన్ లోయలో 26 మంది టూరిస్టులను తుపాకీ తూటాలకు ఎరజేసిన టెర్రరిస్టు ముష్కర దాడి – 40 మంది సిఆర్‌పిఎఫ్ జవాన్‌లను బలిగొన్న 2019 నాటి పుల్వామా ఘోరకృత్యాన్ని గుర్తుకు తెస్తుంది. దేశం నివ్వెరపోయింది. ఇప్పుడూ – అప్పుడూ నేరస్థులు పాకిస్థాన్ ప్రేరేపిత టెర్రరిస్టులు. ఇప్పుడూ–అప్పుడూ భారత గూఢచారి యంత్రాంగం భద్రతా వైఫల్యం స్పష్టం. పాకిస్థాన్ నుంచి ఎదుర్కొంటున్న సీమాంతర ఉగ్రవాదం బాధితురాలిగా భారత్ ప్రపంచ వేదికలపై పాకిస్థాన్‌ను ఎండగడుతూనే ఉంది. అంతర్జాతీయ బెడదగా ఉన్న టెర్రరిజంపై అందరం కలసికట్టుగా పోరాటంచేసి ఓడించాలని ప్రధాని నరేంద్రమోదీ చాలాసార్లు అంతర్జాతీ య వేదికలపై ప్రతిపాదించారు. మానవాళికి శత్రువులైన టెర్రరిస్టుల్లో మంచి–చెడులు ఎంచరాదన్నారు. కాని అమెరికా, పశ్చిమ దేశాలు ఎక్కడైన టెర్రరిస్టుదాడి జరిగినపుడు దాన్ని ఖండించటం మినహా కలసికట్టుగా చేసిందేమీలేదు. ఎందుకంటే తమ 'దేశ ప్రయోజనాల'ంటూ ఏ దేశంపైనైనా దాడి చేసే హక్కును తమ విదేశాంగ విధానంలో భాగం గా ఉంచుకున్న అమెరికా సామ్రాజ్యవాదులు టెర్రరిజాన్ని అందుకు 'ఆయుధం'గా ఉపయోగించారు.

భారత ఉపఖండంలో కశ్మీర్ సమస్య దేశ విభజన–స్వాతంత్ర్యం నాటినుండీ ఉన్నదే. 1980వ దశకంలో, అఫ్ఘానిస్థాన్‌లో సోవియట్ సైన్యాలు ప్రవేశించాక, అక్కడ కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని అంతం చేసేందుకు అమెరికా పాకిస్థాన్‌ను పావుగా ఉపయోగించుకుని టెర్రరిజాన్ని ప్రేరేపించింది. పాకిస్థాన్‌కు అధునాతన ఆయుధాలు, పుష్కలంగా ధనం అందజేసింది. కాబూల్ లో కొన్నేళ్లపాటు పోరాటంలో టెర్రరిజం నెగ్గింది. ఆ తర్వాత మన దేశంపైకి సీమాంతర ఉగ్రవా దం పెరిగింది. ఎన్నోసార్లు దాడులకు పాల్పడ్డారు. భారత్ సైన్యం విజయవంతంగా తిప్పికొట్టింది. భారత్–పాకిస్థాన్ ల మధ్య సయోధ్యకోసం, సమస్యల పరిష్కారం కోసం పలు దఫాలు శాంతిచర్చలు జరిగాయి. ప్రభుత్వా ల మధ్య సానుకూల అంగీకారాలు జరిగినప్పుడల్లా పాకిస్థాన్ సైన్యం ఉద్రిక్తతలు పెంచేందుకు టెర్రరిస్టులను ప్రయోగిస్తున్నది. కార్గిల్ యుద్ధం సహా మూడు యుద్ధాల్లో పాకిస్థాన్ ఓడినప్పటికీ అది తన వంకర బుద్ధి మానుకోలేదు. పాకిస్థాన్ నుండి బంగ్లాదేశ్ విముక్తిలో భారత సైన్యం జాతీయవాదులకు తోడ్పడింది. పాకిస్థాన్ సైన్యం చిత్తుగా ఓడింది. ఇప్పుడు బెలూచిస్థాన్‌లో వేర్పాటువాద ఉద్యమం తీవ్రమైన సవాలు విసురుతోంది. ఆడలేక మద్దెల ఓడన్నట్లు దానికి భారత్ తోడ్పాటు ఉందని పాక్ ప్రభుత్వం ఆరోపిస్తోంది.

**ప్రజాపక్షం**
**27-04-2025, ఆదివారం**

ఈ పరిణామాలన్నిటినీ తరచి చూస్తే ఇరు దేశాల మధ్య సమస్యల పరిష్కారం, శాంతియుత సహజీవనం పాకిస్థాన్ ఎస్టాబ్లిష్‌మెంట్‌కు, వారు పోషించే టెర్రరిస్టులకు ఇష్టం లేదు. టెర్రరిస్టులు తమ భూభాగాన్ని స్థావరాలకు, శిక్షణకు, భారత్‌పై దాడులకు ఉపయోగించుకోవటాన్ని అనుమతించబోమని, టెర్రరిస్టు శిబిరాలను ధ్వంసం చేస్తామని పాక్ పాలకులు అంతర్జాతీయ సమాజానికి ఎన్నిసార్లు హామీ ఇవ్వలేదు. ఇప్పటికీ అవి కొనసాగుతూనే ఉండటాన్ని ఏమనాలి? ఇరుదేశాల మధ్య సమస్యలు చర్చల ద్వారా పరిష్కరించుకోవటమా లేక టెర్రరిస్టు దాడులతో ఉద్రిక్త వాతావరణంలో బతకటమా? దారితప్పిన కొందరు చేసే రాక్షసకృత్యాలవల్ల ఇరుదేశాలలోని అమాయక ప్రజలు బాధలుపడటమా? ఇది ప్రధాన సమస్య. దీనికి సానుకూల సమాధానం కావాలంటే టెర్రరిజం అంతానికి ముందుగా ఒప్పందం కుదరాలి. అంతేగాక రెండు ఇరుగుపొరుగు దేశాల ప్రజల ప్రయోజనాల రీత్యా అనేక సంవత్సరాల పాటు ఎందరి కృషివల్లనో కుదిరిన సింధు జల సంధి, సిమ్లా ఒప్పందం వంటి మైలురాయి ఒప్పందాలను రద్దు చేసుకుంటే నష్టపోయేది సామాన్య ప్రజలు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తాజా పరిణామాల్లో జోక్యానికి నిరాకరించారు. "భారత్–పాకిస్థాన్ సమీప దేశాలు. సమస్యను పరిష్కరించుకోవలసింది వారే. కశ్మీర్ సమస్య వారి మధ్య 1500 ఏళ్లుగా ఉంది" అన్నారు. సర్వకాల సర్వావస్థలో అమెరికాకు పాకిస్థాన్ అత్యంత మిత్రదేశం అని మరిచిపోరాదు. ఇప్పుడు ఉభయ దేశాల్లో వినిపిస్తున్న యుద్ధ ప్రేలాపనలు తాత్కాలిక ఆవేశ వ్యక్తీకరణలే కావాలి. యుద్ధం ఇరుపక్షాలకు చేటుచేస్తుందని నేతలకు తెలియంది కాదు. తామూ టెర్రరిజం బాధితులమేనని పాకిస్థాన్ అంటూ ఉంటుంది. మరి ఎందుకు ఉపేక్షిస్తోంది?

# కార్మిక హక్కుల రక్షణకై మే డే ప్రతిన




అంతర్జాతీయ కార్మిక సంఘీభావ దినంగా మే 1న మే దినోత్స వం జరుపుకునేందుకు ప్రపంచవ్యాప్తంగా కార్మికులు, యువత సిద్ధమవుతున్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రపంచ సంక్షోభం విస్తరిస్తున్న సందర్భంలో మన ఉమ్మడి లక్ష్యాలను మదింపు చేసుకోవటం అవస రం. వందేళ్లకు పైగా గతించిన కాలం పొడవునా అసంఖ్యాకమైన వ్యక్తులు పీడనను, యుద్ధాన్ని, దారిద్ర్యాన్ని నిర్మూలిస్తామన్న తమ సంకల్పాన్ని ఎలుగెత్తి చాటారు. 1917 అక్టోబర్‌లో రష్యన్ కార్మికవర్గ విజయం సమాజ సోషలిస్టు పరివర్తనకోసం పోరాటంలో గణనీయమైన పురోగతి తెచ్చింది. అది కార్మికులను అంతర్జాతీయంగా ఉత్తేజితం చేసింది.

అంతర్జాతీయతకు నేడు మరింత ప్రాసంగికత ఉంది. ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ తన దోపిడీ క్షేత్రాలను విస్తరిస్తున్నందున, కార్మికులు కూడా తమ హక్కుల రక్షణకై ప్రపంచమంతటా సంఘటితం కావటం తప్పనిసరి అవుతోంది. ప్రపంచంలోని వివిధ భాగాల్లో – అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాలు రెండింటిలోనూ స్టాక్ మార్కె ట్లు తరచూ పతనం చెందటం ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థను పీడిస్తున్న సంక్షోభానికి ప్రతిబింబం. సంక్షోభం తీవ్రతరమవుతున్నందు న, కార్మికుల అవసరాలు, ఆకాంక్షలతో కూడిన కార్యక్రమంతో వారు సన్నద్ధం కావలసిన అవసరం పెరుగుతున్నది. ఈ క్రమంలో మే డే పోరాట వారసత్వాన్ని వారు తిరిగి పొందాలి.

1880ల్లో అమెరికాలో 8 గంటల పనిదినంకోసం పోరాటం అంతర్జాతీయ కార్మికదినంగా మే డే ఆవిర్భవించటానికి నాంది. 1884లో, ఆర్గనైజ్డ్ ట్రేడ్స్ ఫెడరేషన్ (సంఘటిత వృత్తుల సమాఖ్య) ఆమోదించిన తీర్మానం కీలకమైన పాత్ర వహించింది – 1886 మే 1 నుంచి, ఆ తదుపరి 8 గంటలు చట్టబద్ధంగా పనిదినం కావాలని ఆ తీర్మానం డిమాండ్ చేసింది. అది కార్మికవర్గ పోరాటాలకు కాగడా అయింది. ఈ డిమాండ్‌ను కార్మికోద్యమం ఆలింగనం చేసుకుంది. 8 గంటల లీగ్ ఏర్పాటుకు అది దారితీసింది. అవి యజమానులనుంచి గణనీయమైన రాయితీలను విజయవంతంగా రాబట్టాయి. ట్రేడ్ యూనియన్ సభ్యత్వం రెట్టింపు అయింది.

చికాగోలో (షికాగో) 25,000 మందితో మే డే ర్యాలీ చరిత్రాత్మక క్షణానికి ప్రతీక అయింది. ఉత్సాహంతో ఉరకలు వేస్తున్న కార్మికోద్యమాన్ని క్రూరంగా అణిచివేయటానికి యజమానులు సన్నద్ధమయ్యారు. ఈ అణచివేత రెండ్రోజుల్లో తీవ్రతరమై సమ్మెచేస్తున్న కార్మికులపై పోలీసు కాల్పులకు దారితీసింది. ఆ తర్వాత ఒక ఏజెంట్ కవ్వింపుదారు విసిరినట్లు చెప్పబడుతున్న బాంబుదాడిలో ఏడుగురు పోలీసు అధికారులు మృతిచెందటం కార్మికులపై మరింత పాశవికమైన ప్రతీకారదాడికి దారితీసింది; కాల్పుల్లో వందలాదిమంది గాయపడ్డారు. తదుపరి వారాల్లో సమ్మెదారులపై, ట్రేడ్ యూనియనిస్టులపై పోలీసులు ఒక పద్ధతి ప్రకారం దాడులు చేశారు. వారి సమావేశాలను హింసాయుతంగా విచ్ఛిన్నం చేశారు. కార్మిక నాయకులపై తప్పుడు ఆరోపణలు మోపి, మరణశిక్ష విధించారు. ఆ శిక్షను ఆ తర్వాత జీవిత ఖైదుకు తగ్గించారు.

చికాగోలో 1886 మే నెలలో వరుసగా జరిగిన విషాద సంఘటనలు అంతర్జాతీయ కార్మికదినం పుట్టుకగా చరిత్రకెక్కాయి. 1889లో కార్మికవర్గ అంతర్జాతీయత ఆదర్శంతో కార్మిక ప్రతినిధులు రెండవ ఇంటర్నేషనల్ నెలకొల్పారు. ఈ సంస్థ తీర్మానంలోని ప్రధాన పిలుపు – ప్రతి మే డే రోజున ప్రతిదేశంలోని కార్మికులు 8 గంటల పనిదినం డిమాండ్ చేస్తూ సమ్మెలు, ప్రదర్శనలు జరపాలి.

కార్యాచరణ పిలుపు విస్తృతంగా ప్రతిధ్వనించింది. 1890 మే 1న యూరప్ అంతటా కార్మికులు సమీకృతమైనారు; బార్సిలోనాలో లక్షమంది ప్రదర్శన జరిపారు. స్టాక్‌హోంలో 1,20,000మంది, వార్సాలో 8000మంది ప్రదర్శనల్లో పాల్గొన్నారు. ఆస్ట్రియా, హంగరీలో ప్రదర్శనలపై నిషేధం ఉన్నప్పటికీ వేలాది కార్మికులు ఇళ్లలోనే ఉండి తమ నిరసన వ్యక్తం చేశారు. ఇటలీ, ఫ్రాన్స్‌లకు కూడా సమ్మెలు విస్తరించాయి. ఉత్తర ఫ్రాన్స్‌లో 10మంది కార్మికులు మరణించిన విషాదం సంభవించింది. 8 గంటల పనిదినంకోసం పోరాటాల్లో ఆనాటినుంచి అనేకమంది కార్మికులు ప్రాణాలర్పించారు. కార్మికవర్గ పోరాటం, ప్రతిఘటన సాగిన ఆ దీర్ఘ సంవత్సరాలను మనం హక్కుగా జరుపుకుంటున్నాం. అయితే వేడుకగా జరుపుకోవటం సరిపోదు.

కార్మికవర్గం, దురదృష్టవశాత్తు, ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ సంకెళ్లలో బందీగా ఉంది. సమాజాన్ని ప్రాథమికంగా మార్చేందుకు కార్మికులు అనేకసార్లు చేసిన ప్రయత్నాలకు ప్రతిసారీ అవరోధాలు ఏర్పడ్డాయి. లేబర్‌ను, కార్మికోద్యమాన్ని (టియు ఉద్యమం) పునరుజ్జీవింపజేసే కీలకమైన కర్తవ్యం సోషలిస్టు విధానాలకోసం జరిపే పోరాటాల నుంచి విడదీయరానిది. పెట్టుబడిదారీ విధానాలకు స్పష్టమైన ప్రత్యామ్నాయాన్ని కార్మికోద్యమం లోపల ఎప్పటికప్పుడు ప్రతిపాదించటం తప్పనిసరి.

భారతదేశంలో గత 10 సంవత్సరాల్లో భారతీయ జనతాపార్టీ ప్రభుత్వం కింద కార్మికుల జీవనోపాధి, పనిపరిస్థితులు అవిరామం గా దాడికి గురవుతున్నాయి. కార్మికులు ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులను బడా కార్పొరేట్‌ల విశృంఖల దోపిడీకి వీలు కల్పించే నిమిత్తం ఈ కాలంలో కోతపెట్టే ప్రయత్నాలు జరిగా యి. నరేంద్రమోదీ ప్రభుత్వం ప్రస్తుతం అమలులో ఉన్న కార్మిక చట్టాలను నాలుగు సంహిత (కోడ్)లుగా కుదించింది. అవి – వేతనాలపై కోడ్, పారిశ్రామిక సంబంధాలపై కోడ్, సామాజిక భద్రతపై కోడ్, వృత్తిపరమైన భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితులపై కోడ్. వాటిని ఇంకనూ నోటిఫై చేయలేదు. కొత్త కోడ్‌లు కార్మిక చట్టాలను సరళతరం చేస్తాయి, ఆధునికీకరిస్తాయి అని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, అసలు వాస్తవం ఏమంటే, కార్మికవర్గం పోరాటాల ద్వారా సాధించుకున్న సదుపాయాలన్నిటినీ అవి హరిస్తున్నాయి.

ఉదాహరణకు, వేతనాలపై కోడ్‌ను తీసుకుందాం. అది సార్వజనీన కనీస వేతనం నిర్ణయించలేదు. వేర్వేరు ప్రాంతాల్లో వేర్వేరు ప్రాతిపదికలు వర్తింపజేశారు. వృత్తిపరమైన భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితులపై కోడ్ పనిదినాన్ని 12 గంటలకు పెంపుచేసే వీలు కల్పిస్తున్నది. వలస కార్మికులకు కొద్దోగొప్పో రక్షణ కల్పిస్తున్న అంతరాష్ట్ర వలస కార్మికుల చట్టాన్ని అందులో కలిపివేసినందున కాంట్రాక్టు, వలస కార్మికులు దారుణంగా నష్టపోతారు. అలాగే, పారిశ్రామిక సంబంధాలపై కోడ్ కార్మికులు సంఘటితమయ్యేందుకు, ఉమ్మడి కార్యాచరణ చేపట్టేందుకు ప్రాథమిక హక్కును తొలగిస్తున్నది. ఈ కోడ్ ట్రేడ్ యూనియన్‌ల రిజిస్ట్రేషన్‌ను మరింత కష్టతరం చేస్తుంది. సామాజిక భద్రతపై కోడ్ కార్మికుల పెద్ద భాగానికి ప్రస్తుతమున్న సోషల్ సెక్యూరిటీ హక్కుల ఏర్పాట్లను అస్థిరం చేస్తుంది. ఆ కోడ్‌లో నిర్దిష్టమైన సామాజిక భద్రత స్కీం లేదు, అందుకవసరమైన నిధులకు ఏర్పాటూ లేదు. ఈ లేబర్ కోడ్‌ల ఉద్దేశం బడా కార్పొరేట్‌ల కోసం "వ్యాపార నిర్వహణను సులభతరం చేయటం". కార్మికులు అనేక పోరాటాల ద్వారా సాధించుకుని అనుభవిస్తున్న హక్కులపై దాడి చేయటం ద్వారా, కార్పొరేట్‌ల విశృంఖల దోపిడీకి వీలు కల్పించేందుకు ఈ కోడ్‌లు తీసుకువచ్చారు.

నిజమైన పోరాట ప్రత్యామ్నాయాన్ని సృష్టించేందుకు మనం కృషి చేయాలి. ఇందుకుగాను మే దినోత్సవం జరుపుకోవటంలో నిగూఢంగా ఉన్న గతాన్ని మనం ఉపయోగించుకోవాలి. మే డే మన రోజు. కమ్యూనిస్టు మ్యానిఫెస్టోలోని పదాల ప్రకారం "ప్రపంచ కార్మికులారా ఏకం కండు."

**"న్యూ ఏజ్" సంపాదకీయం**

# రాజకీయాలకు రాహుల్ కొత్త మార్గం!



హైదరాబాద్ నగరం వేదికగా జరిగిన భారత్ సమ్మిట్‌లో కాంగ్రెస్ అగ్రనాయకుడు, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన క్లుప్త ప్రసంగంలో కొత్త రాజకీయాలకు ఇచ్చిన భాష్యం ఆసక్తి కలిగించింది. ఆధునిక రాజకీయాలలో నవతరం నాయకుడంటే ఎలా ఉండాలో ఆయన సూటిగా రెండు మాటల్లో చెప్పారు. ఆయన చెప్పిన దాని ప్రకారం నాయకుడంటే ప్రజల మాటలు వినాలి... ప్రజలను ప్రేమించాలి. "ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్య రాజకీయాలు మారిపోయాయి. పదేళ్ల క్రితం పనిచేసిన రాజకీయాలు ఇప్పుడు పనిచేయవు. సంపద పోగుబడడం, ఆధునిక మీడియా, ఆధునిక సోషల్ మీడియా గురించి అప్పుడు తెలియదు. పాత నాయకుడు నిర్జీవి అయ్యాడు. కొత్త నాయకుడిని నిర్మించాలి" అని మారిన రాజకీయ పోకడలను వివరించాడు రాహుల్ గాంధీ. దానిని అందుకోలేక ఒకానొక దశలో కాంగ్రెస్ ఒంటరి అయిందని, తిరిగి తమను తాము ఆవిష్కరించుకునేందుకు చరిత్ర చూపిన మార్గంలో పాదయాత్రల్లోనే తనకు ప్రజల చెప్పేది వినాలి, ద్వేషాన్ని ప్రేమతో ఎదుర్కోవాలని అర్థమైందన్నాడు.

నిజమే రాహుల్ గాంధీ హైదరాబాద్‌లో చెప్పినట్లుగా ఇప్పుడు రాజకీయాలంటే ద్వేషం, భయం, ఆగ్రహం. పై నుంచి పంపే సమాచారాన్ని కింద స్థాయిలో వినడమే మార్గం. ఒక వర్గాన్నో, మతాన్నో, కులాన్నో, వ్యక్తినో, సమూహాన్నో శత్రువుగా చూపి, ఆ అంశంపై ఉన్నది లేనిది చూపిస్తూ, కల్పిత కథలను సృష్టిస్తూ సోషల్ మీడియాలో పైనుంచి కిందకు సమాచారాన్ని పంపడం ద్వారా కింద సమూహాన్ని నియంత్రిస్తున్నారు. ఒకప్పుడు రాజకీయ పార్టీలు ఏదైనా అంశంపై ప్రజలకు తమ వైఖరిని వివరించాలనుకుంటే, తమ అభిప్రాయాలను వ్యక్తీకరించుకోవాలనుకుంటే, ప్రజలను పోరాటాలకు సమాయత్తం చేయాలనుకుంటే అదొక సుదీర్ఘ ప్రక్రియగా ఉండేది. బహిరంగసభలను నిర్వహించడం, అందుకు కార్యకర్తల ద్వారా ప్రచారం చేయడం, జనాలను సభకు సమీకరించడం, అక్కడ నాయకుడు చెప్పడం.. ఇలా సాగేది. సభలో నాయకుడు చెప్పిన మాట ప్రజల మనస్సులోకి వెళ్ళాక, వాటిని స్మృతిపథంలో ఉంచేందుకు కరపత్రాల ప్రచారమో, పాటలు, సాంస్కృతిక దళాల ప్రచారమో వంటివి ఉండేవి. కానీ పదేళ్ళలో రాజకీయాలు పూర్తిగా మారిపోయాయి. సోషల్ మీడియా వ్యాప్తితో పార్టీకి, కింద ప్రజలకు సోషల్ మీడియా వారధిగా మారిపోయింది. కొన్ని పార్టీలు వాటి ఆలంబనగానే ఎన్నికల విజయాలు కూడా సాధించాయి. రాజకీయ ప్రచారమనేది ఒకప్పుడు దీర్ఘకాలం జరిగే ప్రక్రియ అయితే, నేడు సోషల్ మీడియాలో ప్రతిరోజు ప్రచారమే కొనసాగుతోంది. తమ పార్టీని ఏదో రకంగా ప్రజల్లో నాన్చేందుకు ప్రతి రోజు ఏదో ఒక ఎజెండాను ముందుకు తీసుకుపోయి, అందుకు సంబంధించిన వీడియోలను, వాస్తవాలనో, అవాస్తవాలనో సోషల్ మీడియాలో వదలడం ద్వారా ఆయా పార్టీలు నిత్యప్రచారంలో ఉండేలా చూసుకుంటున్నాయి. ఇందులో తమ విధానాల ప్రచారం కంటే ప్రత్యర్థి వ్యక్తిత్వ హననానికే ప్రాధాన్యత ఇవ్వడం ద్యోతకమవుతూనే ఉంది. దీనిని అర్థం చేసుకునేందుకు విధానాలే కాకుండా, ఆధునిక ప్రచార, మీడియా స్వభావాన్ని కూడా అర్థం చేసుకోవాలి. అందుకే ఇప్పుడు పార్టీ విధానాలకు కట్టుబడి, పద్ధతిగా సిద్ధాంత ప్రచారం చేసే క్రమశిక్షణ కలిగిన సంప్రదాయ కార్యకర్తలకు కాలం చెల్లింది. వారి స్థానాలలో రాజకీయ పార్టీలు సోషల్ మీడియా కార్యకర్తలకు ప్రాధాన్యతనిస్తున్నాయి. వారిని యుద్ధవీరులుగా చూస్తూ 'సోషల్ మీడియా వారియర్'లని ముద్దుగా పిలుచుకుంటూ, రాజకీయాలను కథనరంగంగా మార్చేసాయి. ప్రతి బూతుకు సోషల్ మీడియా కమిటీలు వేస్తూ వారి ద్వారానే నిత్యం ప్రజల మెదళ్ళలోకి తాము చెప్పాలనుకునే విషయాలను జొప్పిస్తున్నాయి. ఇక్కడ సమాచారాన్ని పై నుంచి పంపడం తప్ప కింద నుంచి స్వీకరణ లేదు. రాజకీయాలలో ఈ మార్పు ప్రపంచమంతా కనపడుతోంది. ముఖ్యంగా మితవాద రాజకీయ పార్టీలకు సోషల్ మీడియా అస్త్రంగా మారింది. కేవలం ఉపన్యాసాలివ్వడానికే పరిమితం కాకుండా ప్రజలు తమ మనసులోని మాటలను వినే ప్రక్రియ ఎంత శక్తివంతమైందో, వారు అనుసంధానమయ్యేందుకు ఎంత కీలకమైనదో అనే విషయం పాదయాత్రలో అర్థం చేసుకున్నట్లు వెల్లడించారు రాహుల్‌గాంధీ. ఇక అదే కోవలో వర్తమానంలో సాగుతున్న ద్వేష రాజకీయాలకు విరుగుడు ప్రేమేనని వక్కాణించారు. ఈ రెండు విషయాలు కొత్తేమి కాదు. భారతీయతత్వంలో ఉన్నదే. ప్రేమ, సహనశీలత, దయ భావనలో ఇందులో శతాబ్దాలుగా పరిఢవిల్లుతున్నవే. వాటి ద్వారానే ఆధునిక రాజకీయాల ప్రక్షాళన అనే రాహుల్ ఆలోచన ఆచరణయోగ్యమే. ముఖ్యంగా కాంగ్రెస్ నాయకులు వాటిని అమలులో చూపాలి.

### రాజధాని సందడి

**– బొమ్మగాని కిరణ్‌కుమార్**

### గుజరాత్ మోడల్ డిసిసి ప్రయోగం

ఇటీవల రాష్ట్ర కాంగ్రెస్‌లో జరిగిన మరో కీలక పరిణామం. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడి ఎంపికకు గుజరాత్ మోడల్‌ను అనుసరించాలనే నిర్ణయం. ఇది కాంగ్రెస్ రాజకీయాలకు కొత్తరకం అనుభవమే. ఇప్పటి వరకు ఎఐసిసి ప్రతినిధులను, ఎఐసిసి అధ్యక్షుడిని ఎన్నుకునే ప్రక్రియ ఉండేది. ప్రస్తుత కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే చాలాకాలం తరువాత ఎన్నికల ద్వారా మరో కాంగ్రెస్ నేత శశిథరూర్‌పై గెలుపొందారు. పిసిసి, డిసిసి అధ్యక్షులను, కమిటీలను నియమించే సర్వాధికారం ఎఐసిసి అధ్యక్షుడికి కట్టబెట్టడం ఆనవాయితీ. అదే పద్ధతిలో ప్రస్తుత పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌ను ఎఐసిసి నియమించగా, పిసిసి కమిటీ, డిసిసిలను వేయాల్సి ఉంది. ఇటీవల అహ్మదాబాద్‌లో జరిగిన ఎఐసిసి సమావేశంలో డిసిసిలను బలోపేతం చేయాలనే నిర్ణయం జరిగింది. పైగా ఈసారి ఎన్నికల టిక్కెట్ల కేటాయింపులో కూడా డిసిసి అధ్యక్షుడి పాత్ర ఉంటుందని స్పష్టం చేసింది. కింది స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడమే దీని వెనుక ఉద్దేశ్యం. కానీ, ఏళ్ళుగా వర్గ రాజకీయాలలో కూరుకుపోయిన కాంగ్రెస్‌కు ఇది సాధ్యమా? అలాగే గత కొన్నేళ్ళుగా ఎన్ఎస్‌యుఐ, యూత్ కాంగ్రెస్‌కు ఎన్నికల ద్వారానే అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శిని ఎన్నుకుంటున్న పద్ధతి పెద్దగా సత్ఫలితాలను ఇవ్వడం లేదనే గుసగుసలు కాంగ్రెస్ నేతల నోటినుంచి వినిపిస్తుంటాయి. డిసిసి అధ్యక్షుడి ఎంపికను ఎఐసిసి సమావేశానికి ముందే ప్రయోగాత్మకంగా గుజరాత్ రాష్ట్రంలో ప్రారంభించారు. ఎఐసిసి నుంచి కొంత మంది అబ్జర్వర్‌లను, పిసిసి నుంచి కొందరిని పరిశీలకులుగా నియమిస్తారు. వారు జిల్లాల్లో రెండు వారాలు పర్యటించి, కార్యకర్తలతో మాట్లాడి, ఆసక్తి ఉన్న వారి నుంచి డిసిసి అధ్యక్షుడి కోసం ఆశావహుల నుంచి దరఖాస్తులు తీసుకుంటారు. కార్యకర్తల అభిప్రాయాన్ని క్రోడీకరించి, దరఖాస్తుదారుల్లో ఐదుగురిని షార్ట్ లిస్ట్ చేసి, వారి నుంచి డిసిసి అధ్యక్షుడిని నియమిస్తారు. ఇది కాంగ్రెస్‌ను క్షేత్రస్థాయిలో ప్రజాస్వామీకరణ చేయడమే. అయితే ఎంతవరకు సాధ్యమైనది ప్రశ్న? గతంలో 'శక్తి'యాప్ పేరుతో బూత్ స్థాయి నుంచి ప్రతి ఒక్క కార్యకర్త వివరాలను సేకరించి, కంప్యూటరీకరించి, సంస్థాగత నిర్మాణం కోసం ఒక ప్రయత్నం జరిగినా ఆశించిన ఫలితాలు దక్కలేదు. రాహుల్ గాంధీ ఆలోచనల ప్రకారం డిసిసిల నియామకాలు, అలాగే ఆయన మాటలు అమల్లోకి వస్తే కొత్త కాంగ్రెస్‌ను చూసే అవకాశం లభిస్తుందనడంలో సందేహం లేదు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## రాహుల్‌కు పుణె కోర్టు సమన్లు

**పుణె :** కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిప క్ష నేత రాహుల్ గాం ధీకి పుణె కోర్టు శనివారం సమన్లు జారీ చేసింది. లండన్ పర్యటన సమయంలో స్వాతంత్ర్య సమరయోధుడు వినాయక్ దామోదర్ సావర్కర్‌ను ఉద్దేశిస్తూ రాహుల్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఈ సమన్లు అందాయి. లండన్ పర్యటన సమయంలో రాహుల్ సావర్కర్‌ను ఉద్దేశిస్తూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలో సావర్కర్ మనవడు సత్యకి సావర్కర్ రాహుల్‌పై పరువునష్టం దావా దాఖలు చేశా రు. ఈ కేసుకు సంబంధించి ప్రాథమిక ఆధారాలు ఉన్నట్లు పోలీసులు గతంలో తేల్చారు. దీనిపై తాజాగా విచార ణ జరిపిన న్యాయస్థానం మే9న తమముందు హాజరుకావాలని కోరుతూ స మన్లు జారీ చేసింది. భారత్ జోడో యాత్ర సమయంలో వీర్ సావర్కర్‌పై రా హుల్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. దీనిపై అలహాబాద్ హైకోర్టులో పిటిషన్ దాఖలు కాగా.. ఇటీవల హైకోర్టు రాహుల్‌కు సమన్లు జారీ చేసింది. వాటిని సవాలు చేస్తూ ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయి ంచారు. దీనిపై శుక్రవారం విచారణ జరగ్గా.. సుప్రీం రాహుల్‌పై ఆగ్ర హం వ్యక్తంచేసింది.ఆయన వ్యాఖ్యలు బాధ్యాతారహితమైనవిగా పేర్కొంది. రా హుల్ వ్యాఖ్యలను మందలిస్తూనే.. ఆయనపై క్రిమినల్ చర్యలను నిలిపివేసింది.

## ఉపాధి అవకాశాలు పెంచేందుకు
# అన్నిచర్యలు తీసుకుంటున్నాం

### 15వ రోజ్‌గార్ మేళాలో ప్రధాని మోదీ ఉద్ఘాటన
### 51000 మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేత



**న్యూఢిల్లీ :** ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలు పెంచేందుకు తమ ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. కేంద్ర ప్రభుత్వంలోని వివిధ విభాగాలలో నియామకాలకు సంబంధించి 51,000కి పైగా నియామక లేఖలను పంపిణీ చేసిన తర్వాత 15వ రోజ్‌గార్ మేళాను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. యువతకు ఇది అపూర్వమైన అవకాశాల సమయం అని అన్నారు. వర్చువల్‌గా పాల్గొని ఆయన మాట్లాడుతూ భారతదేశం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా ఉండనుందని అంతర్జాతీయ ద్రవ్య నిధి చెప్పిందని, ప్రతి రంగంలో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని మోదీ అన్నారు. ఆటోమొబైల్, పాదరక్షల పరిశ్రమలలో ఉత్పత్తి, ఎగుమతి కొత్త రికార్డులను తాకిందని, పెద్ద సంఖ్యలో ఉపాధిని సృష్టించాయన్నారు. తన ప్రభుత్వం చేసిన వ్యత్యాసాన్ని ఉదహరిస్తూ, 2014కి ముందు 18 మిలియ న్ టన్నులుగా ఉన్న లోతట్టు జలమార్గాల ద్వా రా నిర్వహించబడుతున్న సరుకు రవాణా పారదర్శకంగా 145 మిలియన్ టన్నులకు పెరిగిందని, జాతీయ జలమార్గాలు ఐదు నుండి 110కి పెరిగాయని, వాటి పొడవు 2,700 కి.మీ నుండి 5,000 కి.మీ.కు పెరి గిందని ప్రధాన మంత్రి పేర్కొన్నారు. వృద్ధి అతిపెద్ద అంశమని, ప్రతి రంగంలో మహిళల భాగస్వామ్యం పెరిగిందని ఆయన చెప్పారు. ఈ సంవత్సరం యుపిఎస్‌సి పరీక్షలో అగ్రస్థానంలో నిలిచిన ఐదుగురిలో ముగ్గురు మహిళలే ఉన్నారని, 90లక్షలకు పైగా స్వయం సహాయక బృందాలలో 10 కోట్లకు పైగా మహిళలు పనిచేస్తున్నార న్నారు. శక్తి అధికార యంత్రాంగం నుండి అంతరిక్షం, సైన్స్ వంటి రంగాలలో భారతదేశ మహిళా సరికొత్త హద్దులను తాకిందని, ప్రభుత్వం గ్రామీణ మహిళలను శక్తివంతం చేయడంపై కూడా దృష్టి సారిస్తోందని చెప్పారు. ఈ దశాబ్దంలో యువత సాంకేతికత, డేటా , ఆవిష్కరణలలో భారత వృద్ధికి శక్తినిచ్చిందని, దేశం రియల్‌టైమ్ డిజిటల్ లావాదేవీలలో ముందుందని మోదీ పేర్కొన్నారు. యువత జాతి నిర్మాణంలో చురుకుగా సహకరించినప్పుడు, దేశంవేగవంతమైన అభివృద్ధిని సాధిస్తుందని, ప్రపంచ వేదికపై గుర్తింపు పొందుతుందని ఉద్ఘాటించారు. దేశ యువతకు ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలు పెరుగుతూనే ఉండేలా తమ ప్రభు త్వం ప్రతి సందర్భంలోనూ హామీ ఇస్తోందని మోదీ స్పష్టం చేశారు. స్కిల్ ఇండియా, స్టార్టప్ ఇండియా, డిజిటల్ ఇండియా వంటి కార్యక్రమాలను ప్రస్తావిస్తూ, అవి యువతకు కొత్త అవకాశాలను సృష్టిస్తున్నాయని, వారి ప్రతిభను ప్రదర్శించడానికి బహిరంగ వేదికను అందిస్తున్నాయని ప్రధానమంత్రి అన్నారు. భారతదేశ యువత తమ అంకితభావం, ఆవిష్కరణల ద్వారా దేశంలో ఉన్న అపారమైన సామర్థ్యాన్ని ప్రపంచానికి ప్రదర్శిస్తున్నారని ప్రశంసించారు.ముంబైలోజరగనున్న వరల్డ్ ఆడియో విజువల్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్ (వేవ్స్) యువతకు ప్రపంచ వేదికపై తమ నైపుణ్యాలను ప్రదర్శించడానికి ఒక పెద్ద అవకాశంగా ఉంటుందని మోదీ అన్నారు. ఈ బడ్జెట్‌లో 'మేక్‌ఇన్ ఇండియా' చొరవను ప్రో త్సహించడం, దేశయువతకు ప్రపంచ ప్రమాణాల ఉత్పత్తులను సృష్టించే అవకాశాన్ని కల్పించడం లక్ష్యంగా ప్రభుత్వం 'తయారీ మిషన్'ను ప్రకటించిందని ప్రధాన మ ంత్రి అన్నారు. తయారీ మిషన్ దేశవ్యాప్తంగా లక్షలాది ఎంఎస్ఎంయులు, చిన్న తరహా వ్యాపారులకు మద్దతు ఇవ్వడమే కాకుండా దేశవ్యాప్తంగాకొత్తఉపాధిమార్గాలకుదారి చూపుతుందన్నారు.

# ఐదుగురు ఉగ్రవాదుల ఇళ్లు పేల్చివేత

### పహల్గామ్ దాడి నేపథ్యంలో ముష్కరుల కోసం ముమ్మర గాలింపు
### వారి ఇళ్లు వెతికి బాంబులతో ధ్వంసం చేస్తున్న భద్రతా బలగాలు



**శ్రీనగర్ :** కశ్మీర్ లోయలో ముగ్గురు అనుమానిత ఉగ్రవాదుల ఇళ్లను అధికారులు కూల్చివేశారు. 26 మందిని బలిగొన్న దారుణమైన పహల్గామ్ దాడి తరువాత ఉగ్రవాదంపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు పలువురు భావిస్తున్నారు. శుక్రవారం రాత్రి దక్షిణ కశ్మీర్‌లోని పుల్వామా, షోపియన్, కుల్గామ్ జిల్లాల్లో అనుమానిత ఉగ్రవాదుల ఇళ్లను కూల్చివేశామని అధికారులు శనివారం తెలిపారు. అంతకు ముందు గురువారం, శుక్రవారం మధ్య రాత్రి నిల్వ ఉంచినట్లు భావిస్తున్న పేలుడు పదార్థాలు పేలి పహల్గామ్ ఉగ్రవాద దాడి ప్రధాన నిందితుడితో సహా ఇద్దరు లష్కరే తోయిబా ఉగ్రవాదుల ఇళ్లు ధ్వంసమయ్యాయి. శుక్రవారం రాత్రి, పుల్వామా జిల్లాలోని మురాన్ ప్రాంతంలో ఉన్న అహ్సాన్ ఉల్ హక్ షేక్ ఇంటిని కూల్చివేశారని, అతను 2018లో పాకిస్తాన్‌లో శిక్షణ పొంది ఇటీవల లోయలోకి చొరబడినట్లు అధికారులు తెలిపారు. షోపియన్ జిల్లాలోని చోటిపోరాలో జరిగిన ఇలాంటి చర్యల్లో లష్కరే తోయిబా (ఎల్ఇటి) కమాండర్ షాహిద్ అహ్మద్ కుట్టాయ్ ఇంటిని ధ్వంసం చేసినట్లు వారు తెలిపారు. గత మూడు, నాలుగు సంవత్సరాలుగా చురుకుగా ఉన్న కుట్టాయ్ అనేక దేశ వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొన్నట్లు అధికారులు పేర్కొన్నారు. కుల్గాం జిల్లాలోని మతల్హామా ప్రాంతంలో, 2023 నుండి చురుకుగా పనిచేస్తూ పలు ఉగ్రవాద సంబంధిత కార్యకలాపాలలో పాల్గొన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న జకీర్ అహ్మద్ గనీ నివాసాన్ని కూడా రాత్రిపూట కూల్చివేశారని వారు తెలిపారు. దీంతో ఉగ్రవాదులుగా అనుమానిస్తున్న ఐదు నివాసాలను ధ్వంసం చేశారు. శుక్రవారం, పహల్గాం మారణహోమాన్ని అమలు చేయడంలో సహాయం చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆదిల్ హుస్సే న్ థోకర్, దాడిలో పాల్గొన్నట్లు భావిస్తున్న ఆసిఫ్ షేక్ ఇళ్లను భద్రతా దళాలు సోదా చేస్తున్నప్పుడు, పేలుడు కారణంగా బిజ్‌బెహారా, ట్రాల్‌లలో నిర్మాణాలు దెబ్బతిన్నాయి. సోదాలు నిర్వహిస్తున్న సమయంలో ఆ ప్రాంగణంలో పేలుడు పదార్థాలు దొరికాయని, దీంతో భద్రతా దళాలు ఇళ్లలోని నివాసితులను, పొరుగువారిని కూడా సురక్షితంగా ఖాళీ చేయించాయి.

## పికప్ వాహనం ఢీకొని ఆరుగురు కార్మికులు మృతి

**గురుగ్రామ్ :** పికప్ వాహనం ఢీకొనడంతో ఆరుగురు పారిశుధ్య కార్మికులు మరణించగా, మరో ఐదుగురు గాయపడ్డారని పోలీసులు తెలిపారు. శనివారం ఉదయం నుహ్ జిల్లాలోని ఫిరోజ్‌పూర్ ఝిర్కా పోలీస్ స్టేషన్ పరిధిలోని ఢిల్లీముంబై ఎక్స్‌ప్రెస్‌వేలోని ఇబ్రహీంబాస్ సమీపంలో ప్రమాదం చోటుచేసుకుంది. క్షతగాత్రులను చికి త్స కోసం ఆసుపత్రిలో చేర్చగా, వారి పరిస్థితి విషమంగా ఉందన్నారు. ఉదయం 10 గంటల ప్రాంతంలో 11 మంది పారిశుధ్య కార్మికులు ఎక్స్‌ప్రెస్‌వేను శుభ్రం చేస్తుండగా ఈ ప్ర మాదం జరిగింది. అకస్మాత్తుగా వేగంగా వచ్చిన పికప్ వాహనం కార్మికులను ఢీకొట్టడంతో వారు అక్కడికక్కడే మరణించారని వారు తెలిపారు. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చి, గాయపడిన వారిని ఆసుపత్రికి తీసుకెళ్లడంలో సహాయపడ్డారని వారు తెలిపారు. మృ తులను ఇంకా గుర్తించలేదని సీనియర్ పోలీసు అధికారి తెలిపారు.వారు ఖేరి కలాన్ గ్రామ నివాసితులుగా, ఒకరు జిమ్రావత్ గ్రామానికి చెందినవారని చెబుతున్నారు. ప్రమాదానికి గల కారణాన్ని దర్యాప్తు చేస్తున్నారు. పికప్ డ్రైవర్‌పై చర్యలు చేపట్టారు. 'సీసీటీవీ ఫుటేజ్ , ఇతర ఆధారాల సహాయంతో ప్రమాదం పరిస్థితులు నిర్ధారించబడతాయి. గాయపడినవారు ఆసుపత్రిలో చికిత్స పొందు తున్నా రని, అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని అధికారి తెలిపారు.

## గుజరాత్‌లో వెయ్యికిపైగా వలసదారులు

**అహ్మదాబాద్ :** జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రదాడి నేపథ్యంలో అన్ని రాష్ట్రాలు అప్రమత్తమయ్యాయి. వలసదారులపై ప్రత్యేక నిఘా పెట్టాయి. ఈ క్రమంలోనే గుజరాత్‌లో చేపట్టిన భారీ ఆపరేషన్‌లో 1000 మందికిపైగా బంగ్లాదేశీ అక్రమ వలసదారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరంతా తప్పుడు ధ్రువపత్రాలతో రాష్ట్రంలోకి ప్రవేశించినట్లు గుజరాత్ హోంమంత్రి హర్ష్ సంఘవి వెల్లడించారు. శనివారం తెల్లవారుజామున 3 గంటల నుంచి రాష్ట్రంలోని పలు నగరాల్లో పోలీసులు పెద్ద ఎత్తున తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగానే అహ్మదాబాద్‌లో 890 మందిని, సూరత్‌లో 134 మందిని అదుపులోకి తీసుకున్నట్లు హోంమంత్రి తెలిపారు. వీరంతా పశ్చిమ బెంగాల్‌లో సరిహద్దులు దాటి భారత్‌లోకి ప్రవేశించినట్లు పేర్కొన్నారు. అక్కడ ఫోర్జరీ ప్రతాలు పొంది దేశంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లినట్లు తెలిపారు. వీరిలో చాలా మంది డ్రగ్స్, మానవ అక్రమ రవాణా వంటి నేరాల్లో అనుమానితులుగా ఉన్నారు. ఇటీవల నలుగురు బంగ్లాదేశీయులను అరెస్టు చేయగా.. వారిలో ఇద్దరు అల్‌ఖైదా స్లీపర్ సెల్స్‌తో కలిసి పనిచేస్తున్నట్లుగా గుర్తించాం. ఈ క్రమంలోనే తాజాగా భారీ ఆపరేషన్ చేపట్టాం. వీరందరి పత్రాలను పరిశీలించిన తర్వాత.. త్వరలోనే దేశం నుంచి పంపిస్తాం అని హర్ష్ సంఘవి వెల్లడించారు. ఇక, రాష్ట్రంలో పాక్ జాతీయులు ఎవరైనా ఉంటే.. కేంద్రం తీసుకున్న నిబంధనల ప్రకారం వారు కూడా వెంటనే గుజరాత్‌ను వీడాలని స్పష్టం చేశారు. చట్ట వ్యతిరేకంగా దేశంలో ఉండే వారిపై న్యాయపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమ వలసదారులు వెంటనే పోలీసులకు లొంగిపోవాలని సూచించారు.

# ఉగ్రవాదుల కిరాతకచర్యకు..సాధారణ ప్రజలకు శిక్షా?

### పాకిస్థానీయుల ఆవేదనా స్వరం
### నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్
### గాయపడ్డ హృదయాలతో హఠాత్తుగా భారత్‌ను వీడుతున్నామని వెల్లడి



ఛండీగఢ్ : పహల్గామ్ ఉగ్రదాడి నిందితులను కఠినంగా శిక్షించాలి కానీ వారి మూలాన సాధారణ ప్రజలు గాయపడ్డ హృదయాలతో వెళ్లకూడదని పాకిస్థానీ సందర్శకులు దాదాపు ముక్తకంఠంతో తమ ఆవేదనా స్వరాన్ని వినిపించారు. స్వల్పకాల పరిమితి విధింపు కారణంగా అత్యవసరంగా భారతదేశాన్ని వీడి వెళుతోన్న పాకిస్థానీ సందర్శకులు శనివారం వారి మనోవేదనను అట్టారీవాఘా సరిహద్దు మార్గంలో వ్యక్తం చేశారు.పాకిస్థానీ జాతీయులకు చెందిన జారీ చేసిన అన్ని వీసాలు ఏప్రిల్ 27నుంచి రద్దు చేయబడతాయని భారత్ ప్రకటించిన విషయం తెలిసిందే. పాకిస్థాన్ నుంచి ఇండియన్లు త్వరగా స్వదేశానికి తిరిగిరావాలని కూడా భారత ప్రభుత్వం సూచించింది. ఈ నేపథ్యంలో ఇరు దేశాల మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పహల్గామ్ ఉగ్రదాడిలో 26మంది, వారిలో అధికసంఖ్యలో పర్యాటకులు మరణించారు.పాకిస్థానీ జాతీయులకు జారీ చేసిన మెడికల్ వీసాల గడువు ఏప్రిల్ 29వరకు చెల్లుబాటు అవుతాయి. చాలామంది పాకిస్థానీ పౌరులు తమ బంధువులను కలుసుకోవడానికి ఇండియాకు వచ్చినట్లు 'పిటిఐ'కి తెలిపారు. కొంతమంది భారత్‌లో పెండ్లి కార్యక్రమాలకు హాజరయ్యేందుకు ఇక్కడికి వచ్చినప్పటికీ ఆ శుభ కార్యక్రమాలకు హాజరుకాకుండానే వెళ్లిపోవాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తంచేశారు.'ఈ రోజు నా మేనకోడలు వివాహం ఉంది. నేను 10సంవత్సరాల తర్వాత ఇక్కడికి వచ్చాను, అయినప్పటికీ నేను ఆ కార్యక్రమానికి హాజరుకాకుండానే వెనుతిరిగి పోవాల్సి వస్తోంది' అని కరాచీకి చెందిన బస్కరి చెప్పారు. కంటిచూపు స్పష్టంగా లేని ఆమె తన భర్తతో కలిసి ఉత్తర్ ప్రదేశ్‌లోని సహరాన్‌పూర్‌కు వచ్చారు. ఆమె భర్త మహమ్మద్ రషీద్ మాట్లాడుతూ తాము భారత్‌కు ఏప్రిల్ 10న 45 రోజుల వీసాపై ఇక్కడికి చేరుకున్నామని చెప్పారు. 'నా భార్య ఇండియాలోనే పుట్టింది. మా అత్తమామలు ఇక్కడే నివసిస్తున్నారు. శనివారం (ఈరోజు) సహరాన్‌పూర్‌లో పెండ్లి జరుగుతోంది. పోలీసులు మా బంధువల ఇంటికి వచ్చి వెంటనే ఇక్కడి నుంచి వెళ్లిపోవాలి' అని వారు హుకుం జారీ చేశారు అని రషీద్ వివరించారు. 'పెండ్లి రోజునే ఇక్కడి నుండి వెళ్లి పోవాల్సి రావడం విషాదకరం. రెండు దేశాల మధ్య శాంతి నెలకొనాలని నేను కోరుకుంటున్నాను' అని బస్కరి చెప్పారు. 'ఏదిఏమైనప్పటికీ పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి చాలా తప్పు. నిందితులను కఠినంగా శిక్షించాల్సిందే. కానీ ఆ గాయాలను సాధారణ ప్రజలు మోసుకెళ్లాల్సిందేనా?. మతం పేరుతో ఇలాంటి చర్యలకు పాల్పడటం సరైనది కాదు.ప్రజలు మాత్రం ఇరువైపులా ఒకరినొకరు ప్రేమించుకుంటుంటారు. ఆ వాతావరణాన్ని ఉగ్రవాదులు చెడగొట్టారు' అని రషీద్ తెలిపారు. మరో పాకిస్థాన్ జాతీయుడు మాట్లాడుతూ తాను భారత్‌లో తన తల్లి చికిత్స కోసం ఉంటున్నానని, అదృష్టవశాత్తు కొద్దిరోజుల క్రితం పూర్తి కావడంతో తిరిగి పాకిస్థాన్‌కు వెళ్లిపోతున్నానని చెప్పారు. పాకిస్థాన్‌లోని ఉత్తర సింధ్ ప్రాంతంలోని ఘోట్కీ నుంచి వచ్చిన బలి రామ్ మాట్లాడుతూ తాను రాయ్‌పూర్‌లో ఉంటున్న తన ముగ్గురుకూతుళ్లు కోసం భారత్ సందర్శించానని , పహల్గామ్ ఉగ్రదాడి ఘటన వార్త కారణంగా భారతదేశాన్ని వీడి వెళ్లిపోతున్నానన్నారు. తాను ఏప్రిల్ 5న ఇండియాకు వచ్చినట్లు చెప్పారు. ఈ కిరాతక చర్యకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాల్సిందేనన్నారు. అమాయక టూరిస్టులు చేసిన తప్పు ఏమిటని ప్రశ్నించారు. రావల్పిండి నుంచి భారత్‌కు వచ్చిన వృద్ధుడు ముజమ్మిల్ ఏప్రిల్ 22న పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిని గట్టిగా ఖండించారు.నిందితులను ఉరి తీయాల్సిందే అన్నారు. తాను తన బంధువుల వివాహ కార్యక్రమానికి హాజరయ్యేందుకు లక్నోకు వచ్చానని, ఇప్పుడు హఠాత్తుగా ఆ ట్రిప్‌ను కుదించుకుని పాకిస్థాన్ తిరిగి వెళుతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. పాకిస్థానీయులను వెంటనే తిరిగి వారి దేశానికి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఫోన్‌కాల్స్ చేసి చెప్పడంతో శరవేగంగా చర్యలు మొదలయ్యాయి.

# టి(బి)ఆర్‌ఎస్ పాతికేళ్ల ప్రస్థాన సంబరం





**ప్రజాపక్షం/ప్రత్యేక ప్రతినిధి :** రాజకీయాల్లో బలమైన వాదం, సిద్ధాంతంతో పాటు ప్రజలను ఆకర్షించగలిగిన శక్తి అవసరమే. పార్టీల పుట్టుకలోనూ ఒక బలమైన వాదం ఉంటేనే ఆ పార్టీలు పది కాలాల పాటు మనగలుగుతాయి. నాడు తెలుగుదేశమైనా, ఆ తర్వాత తెలంగాణ రాష్ట్ర సమితియైనా రెండు ఒక బలమైన ప్రాంతీయ వాదంతో నిలబడి అధికారంలోకి వచ్చాయి. తెలుగు వారి ఆత్మగౌరవ నినాదాన్ని నాడు తెలుగుదేశం అధినేత ఎన్‌టిఆర్ అందుకుంటే తెలంగాణ వాదాన్ని కేసిఆర్ ఎత్తుకున్నారు. కాకపోతే నెలల్లోనే అధికార సాధన తెలుగుదేశానికి సాధ్యమైంది కానీ టిఆర్‌ఎస్ అధికారంలోకి రావడానికి 13 ఏళ్లు పట్టింది. కాకపోతే రాష్ట్ర సాధన, అధికారంలోకి రావడం ఒకే సారి జరిగాయి. ఒక లక్ష్య సాధన కోసం పార్టీని ఏర్పాటు చేసి ప్రజలను తన వైపుకు తిప్పుకోవడంలో సఫలీకృతుడైన నాయకుడు కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు. ఆయనకు గల ప్రజా సమ్మోహన శక్తి తెలంగాణ వ్యతిరేకులను సైతం ఆలోచింపజేసింది. వాదాన్ని ఎత్తుకోవడమే కాదు ఆ దిశగా ప్రజలను కార్యోన్ముఖులను చేయడంలోనూ కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు (కేసిఆర్) సఫలీకృతులయ్యారు. 2001లో తెలుగుదేశానికి, ఉప సభాపతి, ఎంఎల్‌ఎ పదవులకు రాజీనామా చేసి ఏప్రిల్ 27న జల దృశ్యంలో తెలంగాణ రాష్ట్ర సమితిని ఏర్పాటు చేశారు. తనదైన శైలిలో తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని ప్రజలకు వివరించడంలోనూ భావోద్వేగాలను సృష్టించడంలోనూ కేసిఆర్‌కు కేసిఆరే సాటి. 13 ఏళ్ల పాటు తెలంగాణ రాష్ట్ర సాధనకు వినూత్న కార్యక్రమాలతో వాదాన్ని నిలబెట్టడంతో పాటు ప్రజల్లో ఆశను సజీవంగా ఉంచారు. రాజకీయంగా ఆ 13 ఏళ్లలో ఎత్తు పల్లాలను చూసిన టిఆర్‌ఎస్ తెలంగాణ రాష్ట్ర సాధన ప్రకటన తర్వాత అధికారాన్ని సొంతం చేసుకోగలిగింది. 2004లో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకుని రాష్ట్ర, కేంద్ర మంత్రి వర్గంలో చేరినా ఎక్కువ కాలం ఉండలేకపోయారు. తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలో రాజీనామాల పర్వం కొనసాగింది. ఆ తర్వాత 2009లో మహా కూటమిలో చేరింది. తెలంగాణ రాష్ట్ర సాధనకు వ్యతిరేకంగా ఉన్న బలమైన నాయకుడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మరణం తర్వాత కేసిఆర్ తన పోరాటాన్ని మరింత ఉధృతం చేశారు. అమరణ దీక్షతోపాటు పలు కార్యక్రమాలు ప్రజా మద్దతుతో విజయవంతం కావడంతో అప్పటి కేంద్ర పాలకులు తెలంగాణ పట్ల సానుకూలంగా స్పందించారు. సిపిఐ తెలంగాణకు బహిరంగ మద్దతును ఇవ్వడమే కాకుండా పోరాటాల్లో పాల్గొన్నది. బిజెపి మద్దతు తెలంగాణ ఏర్పాటుకు సానుకూలంగా మారింది. 13 ఏళ్ల పాటు తెలంగాణ ప్రజలను తన సమ్మోహన శక్తితో నడిపించిన కేసిఆర్ అధికారంలోకి రాగానే, టిఆర్‌ఎస్ ఉద్యమ పార్టీ కాదని రాజకీయ పార్టీ అని ప్రకటించి కొన్ని పథకాలతో ప్రజలను ఆకట్టుకున్నారు. ముఖ్యంగా రైతుబంధు, పింఛన్ పెంపు, రైతు బీమా, రైతులకు ఉచిత విద్యుత్, 24 గంటలు కరెంటు, అంతర్గత రోడ్లకు ప్రాధాన్యత, జిల్లాల పునర్విభజన, కళ్యాణ లక్ష్మి , షాదీముబారక్ తదితర కార్యక్రమాలు, పథకాలతో ప్రజలను ఆకర్షించారు. మొదటి దఫాలోనే కొంత వ్యతిరేకత ఏర్పడినప్పటికీ కేసిఆర్ తెలంగాణ వాది తెలంగాణను సాధించిన వ్యక్తి అన్న భావన తెలంగాణ ప్రజల్లో ఉంది. కేసిఆర్ భాషను ముఖ్యమంత్రి కాక ముందు ఆస్వాదించిన తెలంగాణ ప్రజలు ఆ తర్వాత క్రమంగా తప్పుపట్టడం ప్రారంభించారు. విపక్ష కాంగ్రెస్‌ను చీల్చాడు. గెలిచిన వారిని గెలిచినట్లు తనలో చేర్చుకుని బలహీనపర్చాడు. కేసిఆర్ అధికారంలో ఉన్నన్ని రోజులు బిజెపి మిత్రపక్షమో, శత్రుపక్షమో అర్థం కాని రాజకీయాలు నడిపారు. పథకాలు, తెలంగాణ వాదం కేసిఆర్ వ్యూహాత్మక రాజకీయాలు తిరిగి రెండో సారి టిఆర్‌ఎస్‌ను అధికారంలోకి తీసుకు వచ్చాయి. రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కేసిఆర్‌లో మరింత అహంభావం పెరిగిందన్న ప్రచారంతో పాటు కుటుంబ పాలన అన్న విమర్శలకు టిఆర్‌ఎస్ సమాధానం చెప్పలేని పరిస్థితి ఏర్పడింది. పదేళ్ల అధికారం పార్టీని ప్రజలకు దూరం చేసింది. ప్రభుత్వ పథకాలు జనామోదమే అయినా నేతల తీరు వ్యతిరేకతకు కారణమైంది. అదే సమయంలో కాంగ్రెస్ చావో, రేవో అన్న రీతిలో పోరాడటం, బిఆర్‌ఎస్ వ్యతిరేక ఓటు కాంగ్రెస్‌కు మరలడం, అన్నింటికీ మించి కెసిఆర్ టిఆర్‌ఎస్ పేరును బిఆర్‌ఎస్‌గా మార్చడంతో తెలంగాణ వాదం నుంచి పార్టీ వెనుదిరిగిందన్న ప్రచారం ఓటమికి కారణమయ్యాయి. ఇప్పుడు అధికారం కోల్పోయి ఏడాదిన్నర కావస్తున్న సమయంలో పార్టీ వ్యవస్థాపక రజతోత్సవ సంబురాలు జరుపుకుంటుంది. విపక్ష పాత్రలో కెసిఆర్ సమ్మోహన శక్తి పార్టీని తిరిగి అధికార అందలమెక్కిస్తుందా? అదొక్కటే ఆశ! కేసిఆర్‌కు ఆసక్తి ఉన్నట్లు లేదు. జన బాహుళ్యంలోకి రాకపోగా శాసనసభ సమావేశాలకు హాజరు కావటంలేదు. ఇండోర్ కార్యక్రమాలకే కేసిఆర్ పరిమితమయ్యారు. అధికారం కోల్పోయిన తర్వాత ప్రాంతీయ పార్టీల మనుగడ అంత తేలిక కాదు. దేశ వ్యాప్తంగా ఓటమి తర్వాత అనేక ప్రాంతీయ పార్టీలు కనుమరుగయ్యాయి. కానీ బిఆర్‌ఎస్ కాంగ్రెస్‌ను కాస్త దీటుగానే ఎదుర్కొంటుందని చెప్పవచ్చు. కాంగ్రెస్ ప్రచార వైఫల్యం బిఆర్‌ఎస్‌కు సానుకూలంగా మారింది. హరీష్‌రావు, కేటిఆర్‌లతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా నోరు, పలుకుబడి కలిగిన నాయకులు బిఆర్‌ఎస్‌లో ఇప్పటికీ ఉండడం, బిఆర్‌ఎస్‌ను చీల్చడం లేదా రాజకీయ ఇబ్బందులకు గురి చేయడం లేదా బలహీన పర్చడానికి కాంగ్రెస్ శక్తి సరిపోకపోవడం లేదా ప్రయత్నించకపోవడం తదితర అంశాలు ఇప్పటి బిఆర్‌ఎస్ స్థితికి కారణమవుతున్నాయి. అవునన్నాకాదన్నా ప్రభుత్వంపై కాంగ్రెస్ పాజిటివ్ ప్రచారం కంటే బిఆర్‌ఎస్ నెగెటివ్ ప్రచారం ప్రజల్లోకి వెళ్తుంది. నెగెటివ్ ప్రచారం ఒక్కటే గట్టెంచకబోదు. బిఆర్‌ఎస్ నేతల ఆరాటాలు, పోరాటాలు ప్రజల మద్దతును కూడగడతాయా, కేసిఆర్ సమ్మోహన శక్తి తిరిగి బిఆర్‌ఎస్‌ను అధికారం వైపు తీసుకెళ్తుందా వంటి సందేహాలకు భవిష్యత్తే సమాధానం చెబుతుంది. నేడు వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో జరిగే రజతోత్సవ సభ తర్వాత పార్టీ ఏవిధంగా ముందుకు సాగుతుందన్నది ఆసక్తితో వేచి చూడదగిన అంశం. అయితే రెండోవైపున, వచ్చే ఎన్నికల్లో అధికారం తమదే అంటూ ప్రచారార్భాటంలో ముందున్న బిజెపి చాపకింద నీరులా బిఆర్‌ఎస్ ఓటు బ్యాంకును ఆకట్టుకుంటున్నది. పార్లమెంటు ఎన్నికల్లో బిఆర్‌ఎస్‌కు ఒక్క సీటు దక్కకపోగా, బిజెపి గెలుపొందటం బలాబలాల్లో మార్పును సూచించింది. అది మోదీ ఆకర్షణతో వచ్చిన గెలుపు అని బిఆర్‌ఎస్ నాయకులు వినిపిస్తున్న బాణీ ఆత్మసంతృప్తికి, వైఫల సమర్ధనకు తప్ప ఎందుకూ పనికి రాదు. రాష్ట్ర అభివృద్ధికి బిఆర్‌ఎస్ అడ్డుపడుతోందనే కాంగ్రెస్ వాదన పదును పెరిగితే బిఆర్‌ఎస్ పునరుజ్జీవ కృషికి తిప్పలు తప్పవు. అందువల్ల పార్టీ రజతోత్సవం సందర్భంగా, 'మేము అంతా మంచే చేశాం. కాంగ్రెస్ వాగ్దానాలకు ప్రజలు మోసపోయారు.' అనే బకాయింపు వల్ల ఫలితముండదు. ఆత్మవిమర్శ కూడా ప్రజలకు అర్థమయ్యే రీతిలో అవసరం.

# పాక్ కాల్పుల విరమణ ఒప్పందం ఉల్లంఘన

**శ్రీనగర్/న్యూఢిల్లీ :** పాకిస్థాన్ కవ్వింపు చర్యలకు పాల్పడుతోంది. నియంత్రణ రేఖా వెంబడి పాకిస్తాన్ సైన్యం విచక్షణారహితంగా కాల్పులకు పాల్పడింది. అయితే భారత దళాలు దీటుగా ఎదుర్కొన్నారని సైనిక వర్గాలు శనివారం తెలిపాయి. మంగళవారం పహల్గామ్ ఉగ్రవాద దాడిలో 26 మంది పౌరులు మరణించిన తరువాత భారత, పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తత పెరిగిన నేపథ్యంలో వరుసగా రెండవ రాత్రి కాల్పులు జరిగాయి. గు రువారం రాత్రి కూడా పాకిస్తాన్ దళాలు నియంత్రణ రేఖ (ఎల్‌ఓసి) వెంబడి భారత స్థావరాలపై కాల్పులు జరిపాయి. భారత దళాలు తగిన విధంగా స్పందించాయి. ఈనెల 25, 26 తేదీలలో రాత్రి కశ్మీర్‌లోని నియంత్రణ రేఖ వెంబడి వివిధ పాకిస్తాన్ ఆర్మీ పోస్టులు చిన్న ఆయుధాలతో కాల్పులు జరిపాయని ఒక వర్గాలు తెలిపాయి. భారత దళాలు కూడా చిన్న ఆయుధాలతో తగిన విధంగా స్పందించాయని వారు తెలిపారు. కాల్పుల్లో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదన్నారు. పహల్గామ్ దాడిలో పాల్గొన్న ఉగ్రవాదులను వే టాడతామని భారతదేశం ప్రకటించిన నేపథ్యం లో పాకిస్తాన్ సైన్యాన్ని హై అలర్ట్‌లో ఉంచారు.

### ఉగ్రవాదుల రహస్య స్థావరం ధ్వంసం

జమ్ముకశ్మీర్‌లోని కుప్వారా జిల్లాలో శనివారం ఉగ్రవాదుల రహస్య స్థావరాన్ని భద్రతా దళాలు ఛేదించారు. భారీ ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. నిఘా వర్గాల సమాచారం మేరకు, ఉత్తర కశ్మీర్ జిల్లాలోని ముష్తకాబాద్ మాచిల్ (సంషా బెహక్ అటవీ ప్రాంతం)లోని సెడోరి నాలా అటవీ ప్రాంతంలో భద్రతా దళాలు సోదాలు ప్రారంభించాయని ఒక పోలీసు అధికారి తెలిపారు. ఈ ఆపరేషన్ సమయంలో ఉగ్రవాదుల రహస్య స్థావరాన్ని విజయవంతంగా గుర్తించి ఛేదించామని ఆయన చెప్పారు. ఐదు ఎకె47 రైఫిల్స్, ఎనిమిది కెకె47 మ్యాగజైన్స్, ఒక పిస్టల్, ఒక పిస్టల్ మ్యాగజైన్, 660 రౌండ్ల ఎకె47 మందుగుండు సామగ్రి, ఒక పిస్టల్ రౌండ్, 50 రౌండ్ల ఎం4 మందుగుండు సామగ్రితో సహా గణనీయమైన ఆయుధాలు, మందుగుండు సామగ్రిని ఆ ప్రదేశం నుండి స్వాధీనం చేసుకున్నట్లు అధికారి తెలిపారు. ఈ ప్రాంతంలో శాంతిభద్రతలకు భంగం కలిగించే లక్ష్యంతో ఉగ్రవాదులు కార్యకలాపాలను నిర్వహించడానికి సిద్ధమవుతున్నారనే సంకేతాల దృష్ట్యా రహస్య స్థావరం ధ్వంసం చేయడం పెద్ద విజయమన్నారు. భద్రతా దళాలు సకాలంలో చర్య తీసుకోవడం వల్ల ఇటువంటి దుష్ట కుట్రలకు పెద్ద దెబ్బ తగిలిందని, పౌరుల ప్రాణాలకు, ప్రజా భద్రతకు ముప్పు తప్పిందన్నారు.





# జనరల్
STATE & REGIONAL NEWS

## రీడిజైనింగ్ పేరుతో కాళేశ్వరం చేపట్టి మోసం చేశారు

మంత్రి కోమటిరెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాళేశ్వరం అసలు కథ త్వరలోనే అందరికీ తెలుస్తుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. రీడిజైనింగ్ పేరుతో కాళేశ్వరం చేపట్టి మోసం చేశారని, ''తెలివున్న వారెవరైనా అసలు కాళేశ్వరం చేపడతారా అన్ని ఆయన ప్రశ్నించారు. మేడిగడ్డ కుంగిపోవడం చిన్న విషయం అన్నట్లుగా మాట్లాడారని మేడిగడ్డ, సుందిళ్ల పనికిరావని ఎన్‌డిఎస్‌ఎ నివేదిక ఇచ్చిందని తెలిపారు. వాటిలో నీళ్లు నింపితే ఈ పాటికే మొత్తం కొట్టుకుపోయేవని కోమటిరెడ్డి పేర్కొన్నారు.
ప్రాజెక్టు నిర్మాణానికి తుమ్మిడిహట్టి సరైన ప్రాంతమని ఇంజినీర్లు చెప్పినా, ఆ ప్రాజెక్టు పూర్తయితే కాంగ్రెసుకు పేరు వస్తుందని మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ దానిని పక్కన పెట్టి కాళేశ్వరం నిర్మించారన్నారు.

## వివిధ దేశాలతో కాంగ్రెస్ నాయకుల సత్సంబంధాలు : భట్టి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాంగ్రెస్ నాయకులు ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాలతో మంచి సంబంధాలను నెలకొల్పారని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. హెచ్ఐసిసి నొవాటెల్‌లో జరుగుతున్న 'భారత్ సమ్మిట్ 2025' 'న్యాయ పథ్' పేరుతో ఏర్పాటు చేసిన ప్రత్యేక చిత్ర ప్రదర్శనను మంత్రులు దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిలతో కలిసి భట్టి విక్రమార్క శనివారం ప్రారంభించారు. న్యాయ్ పథ ఎగ్జిబిషన్ ద్వారా భారత దేశ చరిత్రను ఆవిష్కరించిందని, ఈ సమ్మిట్‌ను అర్థం చేసుకోలేని స్థితిలో ఉన్న కొందరు ఇష్టంవచ్చినట్టుగా మాట్లాడుతున్నారని భట్టి అన్నారు. మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు మాట్లాడుతూ పదేళ్ల పాలనలో ప్రజల హక్కులను అన్ని రకాలుగా హరించిన బిఆర్ఎస్‌కు తమ నాయకులను విమర్శించే అర్హత లేదన్నారు. ఇతర దేశాలతో భారతదేశానికి ఉన్న సత్సంబంధాలు, చారిత్రక ఘటనలను నేటి తరానికి తెలియజేయాలనే సంకల్పంతోనే ఈ ప్రదర్శనను ఏర్పాటు చేశామన్నారు. ప్రపంచ ప్రగతిశీల ఉద్యమానికి మార్గ నిర్దేశం చేసేలా ఈ సదస్సును నిర్వహించామని వివరించారు. ప్రగతిశీల ఆలోచనలు, ప్రజాస్వామ్యం, ప్రపంచ శాంతి తదితర అంశాలలో పనిచేసే 100 దేశాలకు చెందిన మేధావులను ఈ ప్రక్రియలో భాగస్వామ్యం చేశామని తెలిపారు.



## డ్రగ్స్ కేసులలో శిక్షపడేలా చర్యలు : డిజిపి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** డ్రగ్స్ కేసులలో దర్యాప్తు పకడ్బందీగా చేయడం ద్వారా నేరస్తులకు శిక్షపడేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర డిజిపి డాక్టర్ జితేందర్ స్పష్టం చేశారు. డిజిపి కార్యాలయంలో శనివారం తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో విస్తృతస్థాయిలో డ్రగ్స్ పట్టుకున్న అధికారులకు రివార్డులు అందజేశారు. సమావేశంలో డిజిపి డాక్టర్ జితేందర్ మాట్లాడుతూ.... తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టాలనే దృఢ సంకల్పంతో ప్రత్యేక బ్యూరోని ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దేశంలోనే ప్రథమంగా యాంటీ నార్కోటిక్స్ బ్యూరోను ఏర్పాటు చేసిందన్నారు. డ్రగ్స్‌ను సీజ్ చేయడం, పద్ధతి ప్రకారం దర్యాప్తు చేసినట్లయితే నేరస్తులకు 10 నుండి 20 సంవత్సరాల శిక్ష పడుతుందన్నారు. తద్వారా మాదకద్రవ్యాల విషయంలో నేరస్తులు శిక్షలకు భయపడి మాదకద్రవ్యాల సరఫరా నియంత్రిస్తారని తద్వారా డ్రగ్స్ ను రాష్ట్రంలోకి రానివ్వకుండా అరికట్టాలని డిజిపి అన్నారు. సమావేశంలో శాంతి భద్రతల అడిషనల్ డిజిపి మహేష్ ఎం భగవత్ మాట్లాడుతూ.... పోలీస్ సిబ్బంది దర్యాప్తు చేసేటప్పుడు న్యాయ , సాంకేతిక అంశాలను దృష్టిలో పెట్టుకొని నేరస్తులకు శిక్ష పడేలాగా చర్యలు తీసుకోవాలన్నారు. నేరస్తులు దర్యాప్తు లోపాలను ఎత్తిచూపుతూ శిక్షల నుండి తప్పించుకునే అవకాశం ఇవ్వవద్దన్నారు. ఫాస్ట్ ట్రాక్ ప్రతిపాదికన ఈ కేసులను దర్యాప్తు చేయడం ద్వారా మాదకద్రవ్యాలను అరికట్టవచ్చు అన్నారు. అడిషనల్ డిజిపి అనిల్ కుమార్ మాట్లాడుతూ... మాదకద్రవ్యాలను ఉపయోగించడం వల్ల కొన్ని రాష్ట్రాల్లో యువత ఇప్పటికి సమస్యలు ఎదుర్కొంటున్నాయని అన్నారు. బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్య మాట్లాడుతూ... పోలీస్ సిబ్బంది సమాచారాన్ని సేకరించడం ద్వారా నేరస్తుల ఆచూకీ కనిపెట్టాలని సూచించారు. ఆయా ప్రాంతాల ప్రజలు తమకు సమాచారం ఇవ్వడం ద్వారా సరఫరాను అడ్డుకోవాలన్నారు. మాదక ద్రవ్యాల వినియోగ సమాచారాన్ని టోల్ ఫ్రీ నెంబర్ 1908కు ఫోన్ చేయడం ద్వారా తమకు అందజేయాలని తద్వారా తాము పకడ్బందీ చర్యలు చేపడతామన్నారు. బ్యూరో ఎస్పి లు రూపేష్ , అడిషనల్ ఎస్‌పి కృష్ణమూర్తి , ఎసిపి నర్సింగ్‌రావు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. విస్తృతస్థాయిలో మదకద్రవ్యాలను పట్టుకున్న పోలీసు అధికారులకు రివార్డులు, ప్రశంస పత్రాలను డిజిపి అందజేశారు.

## 25 బార్లకు 1346 దరఖాస్తులు: 29న డ్రా

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ 25 బార్లకు దరఖాస్తులు ఆహ్వానించగా 1346 దరఖాస్తులు వచ్చాయి. అదిలాబాద్‌లో మూడు బార్ల 61 దరఖాస్తులు వచ్చాయి. మంచిర్యాలలో ఒక బారుకు 15, జగిత్యాల జిల్లా కోరుట్లలో ఒక బార్‌కు 24, వరంగల్ అర్బన్‌లో నాలుగు బార్లకు 491, ఖమ్మంలో 2 బార్లకు 145, నల్లగొండలో మిర్యాలగూడలో ఒక బారుకు 226, మహబూబ్‌నగర్‌లో ఒక బార్కు 56, మహబూబ్‌గర్ మక్తల్లో ఒక బార్‌కు 15, అలంపూర్లోలో ఒక బార్‌కు 4, నాగర్ కర్నూల్ అచ్చంపేట రెండు బార్లకు 18, మెదక్‌లో ఒక బార్కు 53, నిజామాబాద్ అర్మూర్లో ఒక బార్‌కు 8, వికారాబాద్ కొడంగల్లో ఒక బార్‌కు 9 దరఖాస్తులు, సరూర్‌నగర్ మీర్‌పేట్ బార్ కు 200 దరఖాస్తులు వచ్చాయి. వచ్చిన దరఖాస్తులను డ్రా పద్ధతి ఈనెల 29న బార్ల కేటాయింపు జరుగుతుందని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. మార్చి 30న 25 బార్లకు దరఖాస్తులను ఎక్సైజ్ శాఖ ఏప్రిల్ 26 వరకు ఆహ్వానించిన విషయం విధితమే.

**బెల్లంపల్లికి ఒకే దరఖాస్తుతో గడువు పెంపు..**

మంచిర్యాల జిల్లాలో బెల్లంపల్లి బార్కు ఒకే ఒక దరఖాస్తు వచ్చింది. ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ సి. హరి కిరణ్ బెల్లంపల్లిలోని బార్కు మే 5 వరకు దరఖాస్తులు స్వీకరించాలని అధికారులను అదేశించారు. మే 5న వరకు వచ్చిన దరఖాస్తులను మే6న డ్రా ద్వారా బార్ షాపు కేటాయింపు జరుగుతుందని కమిషనర్ చెవ్వూరి హరికిరణ్ తెలిపారు.

## బిఆర్ఎస్ సభతో ఆర్‌టిసి జెఎసికి సంబంధం లేదు

టిజిఎస్ ఆర్‌టిసి జెఎసి చైర్మన్ ఈదురు వెంకన్న

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆర్‌టిసి కార్మికుల జీవన, వృత్తిపరమైన స్థితిగతులు దిగజారడానికి గత బిఆర్ఎస్ ప్రభుత్వమే కారణమని టిజిఎస్ ఆర్‌టిసి జెఎసి చైర్మన్ ఈదురు వెంకన్న అన్నారు. హైదరాబాద్ అజామాబాద్ పారిశ్రామికవాడలోని ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో ఆర్‌టిసి జెఎసి అత్యవసర సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఈదురు వెంకన్న మాట్లాడుతూ ఆర్‌టిసిని పూర్తిగా విధ్వంసం చేసి, సర్వనాశనం చేసింది కెసిఆర్ హయాంలోని ప్రభుత్వంలోనే అన్నారు. 34 మంది ఆర్‌టిసి కార్మికులను పొట్టన పెట్టుకున్న నరరూప రాక్షసుడు కెసిఆర్ అని విమర్శించారు. అందుకే ఆ పార్టీని గద్దె దింపి కాంగ్రెస్‌కు పట్టం కట్టామని తెలిపారు. వరంగల్‌లో బిఆర్ఎస్ నేడు నిర్వహించనున్న సభకు ఆర్‌టిసి జెఎసికి ఎలాంటి సబంధం లేదన్నారు. ఈ ప్రభుత్వం గత ప్రభుత్వం మాదిరిగానే నియంత పోకడలకు పోవొద్దని, చెప్పుడు మాటలు వినొద్దని సూచించారు. ఈ సమావేశంలో కోచైర్మన్ హనుమంతు ముదిరాజ్, వైస్ చైర్మన్ ఎం. థామస్ రెడ్డి, ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు అధ్యక్షులు ఎస్.బాబు, కో కన్వీనర్లు కత్తుల యాదయ్య, సుద్దాల సురేష్, బి. యాదగిరి, ఎన్. కమలాకర్ గౌడ్, ఎం.డి. ఆహమ్మద్ అలీ, వి.బాబు, కె.రాంరెడ్డి, రహిమోద్దీన్, రాంచందర్ పాల్గొన్నారు.

# శ్రామిక ప్రజల హక్కులు, ఆకాంక్షలను గౌరవించే ప్రపంచాన్ని సృష్టిద్దాం

దోపిడీ వ్యవస్థను నిర్వీర్యం చేయాలి
శాంతి, మానవభద్రత కోసం పనిచేయాలి
'భారత్ సమ్మిట్– 2025' తీర్మానం




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ''ప్రపంచవ్యాప్తంగా స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం, సంఘీభావం విలువలకు మా దృఢమైన నిబద్ధతను పునరుద్ఘాటిస్తున్నాం'' అని 'భారత్ సమ్మిట్–2025' తీర్మానించింది. ఉగ్రవాదానికి మద్దతు ఇచ్చే దేశాలతో సహా అన్ని రూపాల్లో ఉన్న ఉగ్రవాదాన్ని భారత్ సమ్మిట్ తీవ్రంగా ఖండించింది. ప్రపంచ మానవాళి ఎదుర్కొంటున్న తీవ్ర సంక్షోభాన్ని పరిష్కరించడానికి ఐక్యంగా కట్టుబడి ఉన్నామని సమ్మిట్ ప్రకటించింది. 'తీవ్రవాద నాయకులు, నిరంకుశ ప్రభుత్వాలు ప్రజాస్వామ్యాన్ని పట్టాలు తప్పిస్తున్నాయని, స్వేచ్ఛలను పరిమితం చేస్తున్నాయి. ఈ శక్తులు సంస్థలను అణగదొక్కడం, బహుపాక్షిక ఒప్పందాలను విస్మరించడం, అబద్ధాలను వ్యాప్తి చేయడం, విభజనను పెంచడం, పురోగతిపై ముఖ్యంగా లింగ సమానత్వం, పౌర హక్కులపై దాడి చేస్తున్నాయి' అని సమ్మిట్ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా హైదరాబాద్‌లో ఈ నెల 25,26 తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహించిన 'భారత్ సమ్మిట్'లో పాల్గొన్న దేశ విదేశాలకు చెందిన ప్రగతిశీల శక్తులు, సామాజిక, ప్రజాస్వామ్య, సోషలిస్ట్, కార్మిక ఉద్యమాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న 350 మంది ప్రతినిధులు ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించారు. ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం ఉన్న సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక విషయాలపై మొత్తం 44 అంశాలతో సమ్మిట్ తీర్మానాన్ని ప్రకటించింది. తీర్మానంలో పొందుపర్చిన ఆదర్శాలు, అంశాలు ప్రస్తుత, భవిష్యత్ తరాలకు, ప్రపంచ స్థిరమైన పురోగతి, శాంతికి ఆధారమని సమ్మిట్ స్పష్టం చేసింది.

''ప్రపంచవ్యాప్తంగా అణచివేయబడుతున్న ప్రగతిశీల ఉద్యమాలకు మద్దతు ఇస్తున్నాం. నిరంకుశ ప్రభుత్వాలు విమర్శకులను లక్ష్యంగా చేసుకోవడానికి చట్టాన్ని దుర్వినియోగం చేస్తున్నాయి. సామాజిక, సాంప్రదాయ మీడియాను తారుమారు చేస్తున్నారు. భిన్నాభిప్రాయులపై చౌరబాటు నిఘా ఉపయోగిస్తున్నారు. చట్టబద్ధమైన పాలన, ప్రజా జవాబుదారీతనం అణగదొక్కడం వల్ల అదుపులేని అధికారం, అవినీతికి అనుకూలమైన వాతావరణం ఏర్పడుతుంది. ప్రజాస్వామ్యంపై పెరుగుతున్న ఈ దాడులు, సంప్రదాయవాద, తీవ్ర మితవాద శక్తులతో అధికార కేంద్రీకరణ అంతర్జాతీయ సంబంధాలకు తీవ్ర ముప్పును కలిగిస్తాయి. నిరంతర అన్యాయాలను, ముఖ్యంగా ప్రపంచ దక్షిణాదిని ప్రభావితం చేసే వాటిని గుర్తించాం. సమానమైన, సమ్మిళితమైన, ప్రతిస్పందనాత్మకమైన ప్రపంచ క్రమాన్ని పునర్నిర్మించడానికి కట్టుబడి ఉన్నాం'' అని తీర్మానంలో స్పష్టం చేశారు.

'' అంతర్జాతీయ సంస్థలను సంస్కరించడం, దోపిడీ వ్యవస్థలను నిర్వీర్యం చేయడం, ప్రగతిశీల విధానాలను అమలు చేయడం ద్వారా మన సమిష్టి ఉనికిలోని ప్రతి రంగంలోనూ ప్రజలకు న్యాయం అందించగలం. ఇందు కోసం శాంతి, మానవ భద్రత కోసం పనిచేయాలి. ప్రజలందరి హక్కులను రక్షించే విధానాలకు కట్టుబడి ఉండాలి. సంఘర్షణల మధ్య మానవ భద్రతను ప్రోత్సహించాలి. దౌత్యం, సంఘర్షణ మధ్యవర్తిత్వం, పరివర్తన న్యాయం, యుద్ధానంతర పునర్నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వాలి. అన్ని రకాల హింసల నుండి శాంతి, రక్షణ కోసం ప్రజల హక్కును గుర్తించండి. ప్రాదేశిక దురాక్రమణ, విస్తరణవాదాన్ని ఖండించండి. చారిత్రక, కొనసాగుతున్న అన్యాయాలను పరిష్కరించడానికి ప్రాసిక్యూటోరియల్ అధికారం, నష్టపరిహార యంత్రాంగాలతో అధికారం పొందిన సత్యం, సయోధ్య కమిషన్లకు మద్దతు ఇవ్వండి'' అని సమ్మిట్ ప్రపంచ దేశాలను కోరింది.

''ప్రపంచ సంస్థలను సంస్కరించండి. ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిని సంస్కరించడం, అంతర్జాతీయ చట్టానికి పూర్తిగా అనుగుణంగా యుఎన్ వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా బహుపాక్షిక సంస్థలను ప్రజాస్వామ్యీకరించండి. ప్రపంచ శక్తి సమతుల్యతను పునరుద్ధరించే, ప్రపంచ దక్షిణ, అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలకు న్యాయమైన ప్రాతినిధ్యాన్ని అందించే అంతర్జాతీయ సహకారం కోసం ఒక కొత్త చట్రాన్ని రూపొందించండి. ప్రపంచ పాలన వ్యవస్థలు ప్రస్తుత వాస్తవాలను పరిష్కరించడానికి తగినవని నిర్ధారించే భవిష్యత్తు కోసం ఒక ఒప్పందానికి మద్దతు ఇవ్వండి. ముఖ్యంగా స్థిరమైన అభివృద్ధి, శాంతి, భద్రత, ఆవిష్కరణ కోసం ముందుకు రావాలి. ప్రపంచ ప్రజాస్వామ్య వ్యతిరేక, ప్రతిచర్యాత్మక ఉద్యమం అంతర్జాతీయ పరిణామాలను చురుకుగా దుర్భాషలాడుతోందనిజాతీయ ప్రయోజనాలకు, ఆర్థిక అభివృద్ధికి అడ్డంకిగా చిత్రీకరిస్తోందని ప్రగతిశీల శక్తులు గుర్తించాయి. ఈ నేపథ్యంలో ప్రగతిశీల శక్తులు, సామాజిక, ప్రజాస్వామ్య, సోషలిస్ట్, కార్మిక ఉద్యమాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న వారి నిబద్ధతలను గౌరవించడం ద్వారా స్థానిక, ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్య ప్రధాన స్రవంతి, పరివర్తన సంస్థలను పునరుజ్జీవింపజేయడానికి, సమిష్టి సామర్థ్యాన్ని బలోపేతం చేస్తాం. ప్రపంచ న్యాయం కోసం జరిగే అన్వేషణలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రగతిశీల శక్తులు, పార్టీలు, యూనియన్లు, పౌర సమాజ సంస్థలు, కార్యకర్తలతో ఐక్యంగా నిలబడతాం. ఐక్యంగా అన్యాయాలను ఎదుర్కొంటాం. పరివర్తనతో కూడిన కొత్త యుగాన్ని ఏర్పరుస్తాం. శ్రామిక ప్రజల హక్కులు, ఆకాంక్షలను గౌరవించే ప్రపంచాన్ని సృష్టిస్తాం. అందరికీ సంపూర్ణ స్వేచ్ఛాయుత జీవితాన్ని నిర్ధారిస్తాం' అని భారత్ సమ్మిట్ –2025 సవివరమైన తీర్మానం చేసింది.

## ఆకట్టుకున్న 'భారత్ సమ్మిట్ – 2025'




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 'భారత్ సమ్మిట్ 2025' ప్రపంచ దేశాల ప్రతినిధులను ఆకట్టుకున్నది. రెండురోజుల పాటు జరిగిన సమ్మిట్‌లో ప్రపంచ సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక పరిణామాలపైన ప్రతినిధులు విస్తృతంగా చర్చించారు. హైదరాబాద్‌లో రెండు రోజుల పాటు జరిగిన 'భారత్ సమ్మిట్ 2025' సమావేశాలు శనివారం ముగిశాయి. భారత్ సమ్మిట్‌కు సుమారు వంద దేశాల నుంచి 350కి పైగా ప్రతినిధులు హాజరయ్యారు. ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాలకు చెందిన రాజకీయ పార్టీల నాయకులు, మాజీ మంత్రులు, ప్రగతిశీల శక్తుల ప్రతినిధులు పాల్గొన్నారు. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో ముందుగా నిర్ణయించుకున్న తెలంగాణ సాంస్కృతిక కార్యక్రమాలు, అతిథులకు ప్రభుత్వ ఆతిథ్యం లాంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలను రద్దు చేశారు. ''ప్రపంచవ్యాప్తంగా స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం, సంఘీభావం విలువలకు మా దృఢమైన నిబద్ధతను పునరుద్ఘాటిస్తున్నాం'' అని 'హైదరాబాద్ తీర్మానం' చేసింది. ఈ సమ్మిట్‌లో మొత్తంగా ఈక్వాలిటీ హాల్, లిబర్టీ హాల్, జస్టిస్ హాల్, ఫ్రెటర్నిటీ హాల్ పేరుతో నాలుగు హాల్స్‌లలో ఎనిమిది అంశాలపై చర్చలు జరిగాయి. ఈ సమ్మిట్ ద్వారా తెలంగాణ రాష్ట్ర ప్రత్యేకతలు, ప్రభుత్వ విధానాలు, వాతావరణ పరిస్థితులు, సానుకూల వాతావరణం, భద్రత, తెలంగాణలో ఉన్న వనరులు, తదితర అంశాలను వివిధ దేశాల ప్రతినిధులకు ప్రభుత్వం వివరించేందుకు అధిక ప్రాధాన్యతను కల్పించింది. ప్రధానంగా పెట్టుబడులను ఆకర్షించేందుకు వీలుగా, తెలంగాణ రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్‌ను మరింత విస్తరించేందుకు అధిక ప్రాధాన్యతను కల్పించింది. సమ్మిట్ మొదటి రోజునే ఎఐసిసి అగ్రనాయకులు రాహుల్‌గాంధీ రావాల్సి ఉండగా, అదే రోజు ఆయన పహల్గాం ఉగ్రదాడి బాధితులను పరామర్శించారు. దీంతో రాహుల్ గాంధీ శనివారం సమ్మిట్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా భారత్‌జోడో యాత్ర విషయాలు, ఆ యాత్ర ద్వారా తన జీవితంలో కలిగిన రాజకీయ మార్పును రాహుల్ సమ్మిట్ ప్రతినిధులకు వివరించారు. పాత రాజకీయ నాయకులు(రాజకీయం) చనిపోయారని, ఇప్పుడు కొత్త రాజకీయం కొనసాగుతోందని , అందుకు అనుగణంగా ముందుకు సాగాలని,ప్రజలతో మమేకమవ్వాలని, ప్రజల గోడును వినాలని రాహుల్ భారత్ సమ్మిట్ వేదికగా పిలుపునిచ్చారు. కాగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సమ్మిట్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పలు సంక్షేమ, అభివృద్ధి, విధానాలను వివరించారు. రైతులు, మహిళలు, యువత, విద్యార్థులకు చేపడుతన్న కార్యక్రమాలను వివరించారు.తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి మిషన్‌లో ప్రపంచ దేశాల ప్రతినిధులు భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. సమ్మిట్‌లో హాజరైన ప్రతినిధులు తమతమ దేశాలలో తెలంగాణ రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్‌ను వివరించాలని, పెట్టుబడులకు అనుకూలమైన వాతవరణాన్ని వివరించాలని సిఎం కోరారు.

**మహిళా శక్తి క్యాంటిన్‌ను సందర్శించిన విదేశీ ప్రతినిధులు**

మహిళా శక్తి పాలసీ, స్వయం సహాయక సంఘాలు నిర్వహిస్తున్న వ్యాపారాలు, మహిళా శక్తి క్యాంటీన్‌లను విదేశీ ప్రతినిధులకు మంత్రి ధనసరి అనసూయ సీతక్క వివరించారు. శిల్పకళావేదికలోని స్వయం సహాయక సంఘాలను నిర్వహిస్తున్న వ్యాపారాలను విదేశీ ప్రతినిధులు సందర్శించారు. ఈ సందర్భంగా మహిళా శక్తి పాలసీ, స్వయం సహాయక సంఘాలు నిర్వహిస్తున్న వ్యాపారాలు, మహిళా శక్తి క్యాంటీన్ విజయ గాధల లఘు చిత్ర ప్రదర్శనను నిర్వహించారు.

## గ్రామీణ విద్యార్థులు 'రామానంద తీర్థ' శిక్షణ దరఖాస్తుకు ఆహ్వానం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ తెలంగాణ ప్రభుత్వం వారి స్వామిరామానంద తీర్థ గ్రామీణ సంస్థలో తెలంగాణ రాష్ట్ర గ్రామీణ యువతీయువకుల కోసం దీన్‌దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన (డిడియుజికెవై) ఉపాధి ఆధారిత సాంకేతిక శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని స్వామి రామానంద తీర్థ రూరల్ ఇన్‌స్టిట్యూట్ చైర్మన్ డాక్టర్ ఎన్.కిశోర్ రెడ్డి తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిఉన్న గ్రామీణ ప్రాంత అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఆయన వెల్లడించారు. అడ్మిషన్ల తేదీ మే 5(సోమవారం) అని ఆయన వివరించారు. బి.కామ్ పాస్ అర్హత కలిగినవారికి మూడున్నర నెలల కాలపరిమితితో అకౌంట్స్ అసిస్టెంట్ (ట్యాలీ) శిక్షణ, ఇంటర్‌మీడియట్ పాస్ అర్హత కలిగిన వారికి మూడున్నర నెలల కాలపరిమితికి కంప్యూటర్ హార్డ్‌వేర్ అసిస్టెంట్ శిక్షణ, 10వ తరగతి పాస్ అర్హత ఉన్న అభ్యర్థులకు మూడున్నర నెలల శిక్షణ ఇస్తామని తెలియజేశారు. ఎంపికైన అభ్యర్థులకు ఉచిత శిక్షణ, భోజన వసతితో పాటు ఉద్యోగం కూడా కల్పిస్తామని కిశోర్‌రెడ్డి వివరించారు. ఈ శిక్షణకు అర్హులుగా 18 నుంచి 30సంవత్సరాల వయసు ఉన్నవారిని మాత్రమే పరిగణనలోకి తీసుకుంటామన్నారు. గ్రామీణ అభ్యర్థులై ఉండాలని, చదువు మధ్యలో ఉన్నవారు ఈ శిక్షణకు అర్హులు కారని కిశోర్‌రెడ్డి స్పష్టం చేశారు. అర్హతల ఒరిజినల్ సర్టిఫికెట్స్, జిరాక్స్ సెట్, పాస్‌పోర్ట్ ఫోటో, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు సమర్పించాల్సి ఉంటుందని ఆయన తెలియజేశారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని పోచంపల్లి మండలం జలాల్‌పూర్ గ్రామంలో ఉన్నటువంటి స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థ చిరునామాకు చేరుకునేందుకు దిల్‌సుఖ్‌నగర్ నుండి 524 నెంబర్ బస్ సౌకర్యం ఉన్నదని, బీబినగర్, భువనగిరి, సికింద్రాబాద్ సమీప రైల్వే స్టేషన్లని వివరించారు. ఇతర వివరాల కోసం 9133908000, 9133908111, 9133908222 నెంబర్లలో సంప్రదించవచ్చని వెల్లడించారు.

## ప్రజాస్వామ్య రక్షణకు ప్రగతిశీల, ప్రజాస్వామ్యవాదులు కలిసిరావాలి

మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రపంచ వ్యాప్తంగా మానవ విలువలపై దాడులు కొనసాగుతున్న ప్రస్తుత తరుణంలో ప్రజాస్వామ్యం రక్షణకు ప్రగతిశీల, ప్రజాస్వామ్య వాదులు కలిసి రావాల్సిందిగా నీటిపారుదల, పౌర సరఫరాల మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం హెచ్ఐసిసిలో జరిగిన భారత్ సమ్మిట్ 2025 ముగింపు సమావేశంలో విచ్చేసిన అతిథులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్య విలువలను నిలబెట్టడానికి దృఢంగా కట్టుబడి ఉన్న కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో భారత్ సమ్మిట్ నిర్వహించడం గర్వకారణంగా ఉందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రాథమిక స్వేచ్ఛ, రక్షణ అత్యవసరంగా మారిన సమయంలో ప్రపంచంలోని ప్రగతిశీలవాదులు, ఉదారవాదులు, ప్రజాస్వామ్యవాదులు, కార్యకర్తలు, మేధావులు, కార్యకర్తలు, ఒకే చోట సమావేశం కావడమంటూ మానవీయ శాస్త్రాలలో ఇదో ఆవిష్కర అని ఆయన అభివర్ణించారు. 'ఏ సమాజంలోనైనా, మన సమాజంలో కూడా అతిపెద్ద సమస్య అన్యాయమే' అని ఆయన అన్నారు. అన్ని రకాల అన్యాయాలకు వ్యతిరేకంగా దృఢ నిశ్చయంతో ఐక్యంగా పోరాడాల్సిన అవసరముందని ఆయన పేర్కొన్నారు. ఇందుకు భారత్ సమ్మిట్ స్ఫూర్తి నిస్తుందని ఆశిస్తున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు.

**ఏడాదిన్నరలో సాధించాం: ఉత్తమ్ కుమార్**

బిఆర్ఎస్ ప్రభుత్వ 10 ఏళ్ల హయంలో సాధించలేని ప్రాజెక్టు అనుమతులను ప్రజా కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిన్నర కాలంలో సాధించిందని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. భారత్ సమ్మిట్ వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ కెసిఆర్ ప్రభుత్వం నాసిరకం పనులతో ప్రాజెక్టులను నాశనం చేయడంతో పాటు రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందని విమర్శించారు.
కాళేశ్వరం కోసం రూ.లక్ష కోట్లు ఖర్చు చేశారని, చివరికి ఈ ప్రాజెక్టు ప్రమాదంలో పడి పనికి రాకుండ పోయే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఇంత మొత్తంలో వృథా చేస్తే ఇతర దేశాల్లో పెద్ద శిక్షలు పడేవన్నారు.కాళేశ్వరం, అన్నారం, సుందిళ్ల నిరుపయోగంగా ఉన్నా కూడా యాసంగిలో రికార్డు స్థాయిలో 127 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండిందని చెప్పారు.
సీతారామసాగర్, సీతమ్మసాగర్ ప్రాజెక్టులకు కేంద్రం అనుమతి ఇచ్చిందని, తద్వారా ఏడాదిన్నరగా తాము చేసిన కృషి ఫలించిందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణకు ఇది పెద్ద ముందడుగుడని, ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతులకు ఈ ప్రాజెక్టులు ఎంతో ప్రయోజనం చేకూరనుందని తెలిపారు. ఈ రెండు ప్రాజెక్టులు వేగవంతంగా పూర్తి చేసి సాగు నీరు అందిస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి చెప్పారు.

## ఎస్సీ ఉపకులాల వర్గీకరణ రాజ్యాంగ వ్యతిరేకం

మాలమహానాడు పిటిషన్
ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

**హైదరాబాద్ :** తెలంగాణ షెడ్యూల్ కులాల (రిజర్వేషన్ల సర్దుబాటు) చట్టం, 2025ను సవాలు చేస్తూ మాల మహానాడు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. చట్టంలో కులాల మధ్య రిజర్వేషన్ల వర్గీకరణకు ఏకసభ్య కమిషన్ ఇచ్చిన రిపోర్ట్‌కు చట్టబద్ధత లేదని పేర్కొంది. ఈ కమిషన్ రిజర్వేషన్ల వర్గీకరణకు అవసరమైన చట్టబద్ధ డేటా సేకరించలేదని తప్పుపట్టింది. 2011లో తీసుకున్న జనాభా లెక్కలను పరిగణనలోకి తీసుకోవడం చెల్లదని పేర్కొంది. ఉమ్మడి ఎపి రాష్ట్రంలో జరిగిన జనాభా లెక్కలను తెలంగాణ రాష్ట్రంలో ప్రాతిపదికగా తీసుకోవడం వల్ల తీరని అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. ఈమేరకు మాల మహానాడు దాఖలు చేసిన పిటిషన్‌ను శుక్రవారం హైకోర్టు చీఫ్ జస్టిస్ సుజయ్ పాల్, జస్టిస్ రేణుక యారాలతో కూడిన డివిజన్ బెంచ్ విచారణ చేపట్టింది. కమిషన్ రిపోర్ట్ సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలకు విరుద్ధమనే పిటిషనర్ వాదనపై కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను వేసవి సెలవుల తర్వాత చేపడతామని ప్రకటించింది. మాల మహానాడు తరఫున సీనియర్ లాయర్లు వాదిస్తూ, సుప్రీంకోర్టు చెప్పినట్లుగా కులాల మధ్య వెనుకబాటుతనానికి న్యాయం చేకూర్చే డేటాను కమిషన్ సేకరించలేదన్నారు. అశాస్త్రీయ డేటా ఆధారంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడానికి వీల్లేదన్నారు. కమిషన్ 2011 ఏడాది డేటాను పరిగణనలోకి తీసుకోవడం చెల్లదన్నారు. కులాల మధ్య రిజర్వేషన్లను సర్దుబాటు చేయడానికి సరైన డేటా లేదన్నారు. ఫలితంగా వర్గీకరణ చట్ట వ్యతిరేకం అవుతుందన్నారు. షెడ్యూల్ కులాలను ఉపవర్గీకరించడంలో, షెడ్యూల్ కులాలలో కొన్ని సమూహాల వెనుకబాటుతనాన్ని నిర్ణయించడంలో అశాస్త్రీయ విధానాలను కమిషన్ పరిగణనలోకి తీసుకుందన్నారు. ఐదో ప్రతివాదిగా ఉన్న ఏకసభ్య కమిషన్ నివేదిక ఆధారంగా 2015లో తెలంగాణ షెడ్యూల్ కులాల రిజర్వేషన్ల హేతుబద్ధీకరణ చట్టం 2025ని ప్రకటించడం చెల్లదన్నారు. ఇది ఏకపక్షమైన నిర్ణయమన్నారు. రాజ్యాంగ విరుద్ధమైనదిగా ప్రకటించాలని కోరారు. సుప్రీంకోర్టు తీర్పుకు వ్యతిరేకంగా ఉందన్నారు. రాజ్యాంగంలోని 15, 16, 338, 341 అధికరణాలకు వ్యతిరేకమన్నారు. 2015లోని చట్టాన్ని రద్దు చేసి, తెలంగాణ షెడ్యూల్ కులాల రిజర్వేషన్ల హేతుబద్ధీకరణ చట్టం 2025 తీసుకురావడం భారత రాజ్యాంగ అధికరణాలకు వ్యతిరేకంగా ఉందన్నారు. పర్యవసానంగా న్యాయ శాఖ ఈనెల 14న వెలువరించిన జీవో 9, షెడ్యూల్ కులాల శాఖ ఇచ్చిన జీవో 10, జిఎడి ఇచ్చిన జీవో 99లు చెల్లవన్నారు. ఈ నెల 14 నుంచి అమల్లోకి వచ్చే విధంగా వెలువడిన జీవోలు చట్ట వ్యతిరేకమని ప్రకటించాలని కోరారు. సుప్రీంకోర్టు తీర్పును తీవ్ర ఉల్లంఘన చేసేవిగా జీవోలు ఉన్నాయన్నారు. షెడ్యూల్ కులాలలో కొన్ని సమూహాల వెనుకబాటుతనం లేదా తగినంత ప్రాతినిధ్యం లేకపోవడం వంటి కీలక అంశాలపై ఏవిధమైన డేటా సేకరణ చేయకుండా కమిషన్ ఏకపక్షంగా నివేదిక ఇస్తే దానిని ఆధారంగా చేసుకుని ప్రభుత్వం చట్టవ్యతిరేకంగా, రాజ్యాంగ స్ఫూర్తిని నీరుగార్చేవిధంగా నిర్ణయం తీసుకుందన్నారు. వాదనల తర్వాత ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసిన హైకోర్టు తదుపరి విచారణ వేసవి సెలవుల తర్వాత చేపడతామని ప్రకటించింది.

## ఉపాధి హామీ కూలీలకు కూల్ డ్రింక్స్ అందజేత



ప్రజాపక్షం/పరిగి:పరిగి మండల పరిధిలోని జాఫర్‌పల్లి గ్రామంలో పనిచేస్తున్న ఉపాధి కూలీలకు పని చేస్తున్న స్థలం వద్దకు వేసవి దృష్ట్యా వారికి శక్తి నిచ్చే కూల్ డ్రింక్స్ అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉదయం తినకుండ ఉపాధి కూలీపనికి వస్తున్న కూలీలకు అలసిపోకుండ ఎనర్జీ డ్రింక్స్ ఇవ్వడం జరిగింది అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచు మహేష్‌కుమార్, మాజీ వార్డు మెంబర్ అమృత, ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్ రవికి డాక్టరేట్




ప్రజాపక్షం/శామీర్‌పేట : మూడుచింతలపల్లి మాజి సర్పంచ్ జాం రవికి ఆసియా ఇంటర్ నేషనల్ కల్చర్ రిసెర్చ్ యూనివర్శిటి హనోరరీ డాక్టరేట్ అవార్డును శనివారం తమిళనాడు లో ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాజి సర్పంచ్ జాం రవి మాట్లాడుతూ ప్రజలకు చేసిన ఉత్తమ సేవలను గుర్తించిన సంస్థ తనకు డాక్టరేట్‌ను ప్రదానం చేసిందన్నారు. సర్పంచ్ పదవిని బాధ్యతగా స్వీకరించి అహర్నిశలు ప్రజల సంక్షేమానికి కృషి చేసినందుకు ఈ అవార్డు దక్కడం సంతోషంగా ఉందన్నారు. రాబోయేకాలంలో మండలవ్యాప్తంగా సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ అవార్డును మా గ్రామానికి అంకితం చేస్తున్నానని చెప్పారు.



## నీటి సమస్యలను పరిష్కరించాలని కమిషనర్‌కు వినతి

ప్రజాపక్షం/దుండిగల్ : దుండిగల్ మున్సిపల్ పరిధిలోని దుండిగల్ గ్రామంలో నీటి సమస్యని పరిష్కరించాలని, వాటర్ ప్లాంట్‌లో మున్సిపల్ వాటర్, బిల్డింగ్ ఉపయోగిస్తూ అధికంగా రుసుమును వసూలు చేస్తున్నారని మున్సిపల్ కమిషనర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ కావలి గణేష్, మాజీ కౌన్సిలర్ అమరం గోపాల్ రెడ్డి , నాయకులు తురాయి, పందు గౌడ్, దొంతి మహేష్ ముదిరాజ్, జక్కుల గోపాల్ యాదవ్, ఉప్పరి కృష్ణ, ఇటూరి వేణుగోపాల్, వాపుల శ్రీనివాస్, తక్కడ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## 'విశ్వవిశ్వాని'లో ముగిసిన జాతీయ సదస్సు

ప్రజాపక్షం/శామీర్‌పేట : తూంకుంటలోని విశ్వవిశ్వానిలో రెండు రోజుల పాటు నిర్వహించిన జాతీయ సదస్సు శనివారం నాడు ముగిసింది. విశ్వవిశ్వాని ఇన్సిట్యూట్ ఆఫ్ సిస్టిమ్స్ ఆండ్ మెనెజ్‌మెంట్ (వివిఐఎస్‌ఎం) తన అనుభంధ సంస్థలతో కలిసి ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా 5.0 సస్టెనబుల్ స్ట్రాటజీస్ ఫర్ ఎమర్జింగ్ చాలెంజెస్ ఆండ్ ఆపర్చ్యునిటీస్ అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సును తూంకుంటలోని క్యాంపస్‌లో విజయవంతంగా నిర్వహించిందని సగర్వంగా ప్రకటించింది. ఈ సదస్సును హైద్రాబాద్‌లోని ఎంఎస్‌ఎంఇ మంత్రిత్వ శాఖ, ఐఇడిఎస్ విశ్రాంత సంచాలకులు ఎం. వి సుదీర్‌కుమార్ ప్రారంబించారు. ఈ సదస్సును ఐసిఎస్‌ఎస్‌ఆర్, ఎస్ఆర్‌సిలు స్పాన్సర్ చేశాయి. ఈ సందర్భంగా సుదీర్‌కుమార్ తన ప్రారంబోపన్యాసంలో స్థిరమైన పద్దతులు, డిజిటల్ పురోగతులు మధ్య ఉన్న ప్రాముఖ్యమైన సంబందాన్ని నొక్కి చెప్పారు. సమకాలీన ప్రపంచ సవాళ్లను సమర్ధవంతంగా పరిష్కరించడానికి, అభివృద్ధి చెందుతున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవడానికి సమగ్ర విధానాల ఆత్యవసర అవసరాన్ని ఉద్ఘాటించారు. సదస్సు కన్వీనర్‌లు డాక్టర్ మదనమోహన్, డాక్టర్ జాబేజ్‌లు మాట్లాడుతూ డిజిటల్ పరివర్తన మరియు స్థిరత్వం కలయికలపై కీలకమైన చర్చల్లో పాల్గొనడానికి ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రముఖుల ఆలోచనపరులు, పరిశ్రమల నిపుణులు, విద్యావేత్తలు ఆవిష్కర్తలను ఒకచోట చేర్పించదన్నారు. ఈ సదస్సులో విద్యావేత్తలు, విద్యార్థుల నుంచి 531 కంటే ఎక్కువ పరిశోధన పత్రాలు సమర్పించడంతో అనూహ్యమైన స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో వివిఐ అధ్యక్షులు, జి.ఎస్‌ఎస్ వెంకటేశ్వర్‌రావు, డైరక్టర్ అడ్మిషన్స్ రామకృష్ణ చిన్నం, ప్రొఫెసర్‌లు, విద్యావేత్తలు, విద్యార్థులు పాల్గొన్నా రు.



## పర్యావరణ పరిరక్షణకు చెరువుల పునరుద్ధరణ కీలకం

### బిఆర్ఎస్ శాసనసభ విప్ కెపి వివేకానంద

ప్రజాపక్షం/నిజాంపేట్ : పర్యావరణ పరిరక్షణకు చెరువుల పునరుద్ధరణ ఎంతో కీలకమని శాసనసభ బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని నిజాంపేట్‌లోని ఆచారి కుంట చెరువును అధికారులతో కలిసి ఎమ్మెల్యే కెపి వివేక్ సందర్శించారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతిఎక్కరి బాధ్యత అన్నారు. భూగర్భ జలాల నీటిమట్టం సమృద్ధిగా పెరిగినట్లయితే భవిష్యత్ తరాలకు నీటి ఎద్దడి ఉండదని తెలిపారు. బిఆర్ఎస్ హయాంలో మిషన్ కాకతీయ ద్వారా అనేక చెరువులను పునరుద్ధరించామని, రానున్న రోజుల్లో ఆచారి కుంట చెరువుని అభివృద్ధి చేసేందుకు ఎన్ని నిధులైనా తీసుకువస్తానని అన్నారు. చెరువు అభివృద్ధిలో భాగంగా వాకింగ్ ట్రాక్, హైమాస్ లైట్‌లు, పిల్లల ఆటవిడుపుకై పార్కు అభివృద్ధి పనులకు అవసరమైన ప్రణాళికలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం సాయిబృందావన్ ఎస్టేట్స్, వెంకట సాయి హోమ్స్, స్వాన్ లేక్ అపార్ట్‌మెంట్ కాలనీ వాసులను కలిసి సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో నిజాంపేట్ కార్పొరేషన్ కమిషనర్ సాబేర్ అలీ, నాయకులు ఆగం రాజు ముదిరాజ్ రంగరాయ ప్రసాద్, దన్‌రాజ్, రాఘవేంద్ర రావు, రవి కిరన్, సుజాత, శ్రీనివాస రావు, సాంబశివ రెడ్డి పాల్గొన్నారు.

## భూభారతి చట్టం అవగాహన కార్యక్రమంలో

# ఘర్షణ వాతావరణం

* కబ్జాదారులకు రెవెన్యూ అధికారుల వత్తాసు.. కలెక్టర్‌కు రైతుల ఫిర్యాదు
* చిన్నసమస్యల పరిష్కారానికి గ్రామ అధికారుల నియామకం

**మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతం, అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి**




ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి : వివిధ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న భూభారతి చట్టం అవగాహనా సదస్సుల్లో భాగంగా శనివారం దుండిగల్ మండలంలో స్వయంగా కలెక్టర్ గౌతం పాల్గొన్న కార్యక్రమంలో పలువురు రైతులు తమ దరఖాస్తులను ఏ మాత్రం పట్టించుకోవటం లేదని, మరి కొందరు కబ్జాదారుల మామూళ్ల మత్తులో పడి వత్తాసు పలుకుతున్నారంటూ ఫిర్యాదులు చేసారు. దీంతో కలెక్టర్ గౌతం గత ప్రభుత్వ హయాంలో కొనసాగిన ధరణి చట్టంలో ఉన్న లోపాల కారణంగా రెవెన్యూ అధికారులు చేతులు కట్టేసిన పరిస్థితి ఉండేదని, ప్రస్తుత తాజా భూభారతి చట్టంలో పలు సవరణలతో కొత్త అధికారాలు వచ్చాయని, తాను స్వీయ పర్యవేక్షణలో రైతుల సమస్యలను పరిష్కరించి న్యాయం చేకూరేలా చేస్తానని హామీ ఇచ్చారు. మరో పక్క సదస్సులో పాల్గొన్న కాంగ్రెస్ నేతలు జేమ్స్, సాధు యాదవ్, సురేష్ తదితరులు బిఆర్ఎస్ నేతలు ప్రభుత్వ భూములు కబ్జా చేసి కోట్లు కూడగట్టుకొన్నారంటూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయటంతో అక్కడే ఉన్న బిఆర్ఎస్ నేతలు అడ్డుకోవటంతో కాస్త ఘర్షణ వాతావరణం నెలకొంది. దూలపల్లి ప్రాంతానికి చెందిన ఓ మహిళ తమ భూమిని కాజేసిన కొంత మంది పోలీసులను అడ్డు పెట్టుకొని తమపై అక్రమంగా కేసులు నమోదు చేయించారంటూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా తాను పరిశీలించి న్యాయం చేస్తానని నచ్చచెప్పారు. రెవెన్యూ,ఇరిగేషన్ అధికారులతో తాను చర్చించి కబ్జాదారులపై చర్యలు తీసుకొంటామన్నారు. గండి మైసమ్మ గ్రామంలోని మేకల వెంకటయ్య పంక్షన్ హాలులో జరిగిన భూభారతి అవగాహనా సదస్సులో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడుతూ రికార్డుల్లో తప్పుల సవరణకు, పట్టాదారు పుస్తకాలు, అప్పీల్ వ్యవస్థ, పెండింగ్ సాదా బైనామా ధరఖాస్తులు, వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్, మ్యుటేషన్‌లాంటి ధరఖాస్తుల పరిష్కారానికి భూభారతి చట్టం తోడ్పడుతుందన్నారు. ధరణి చట్టంలో పరిష్కారంకాని సమస్యలు తాజా చట్టంలో పరిష్కారం అవుతాయన్నారు. రెవెన్యూలో సింగిల్ చట్టం తీసుకొని రావటానికి ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళతామన్నారు. లేని సమస్యలకు గాను రెవెన్యూ అధికారులు సరైన సలహాలిస్తారన్నారు. భూదాన్, ఇనాం చట్టాల ద్వారా కలిగే సమస్యల గురంచి ప్రత్యేకంగా సదస్సు నిర్వహించనున్నామని, 20 నుండి 25 భూచట్టాలు ఉన్న వాటన్నింటిని క్రోడీకరించి నూతన చట్టాన్ని తేనున్నామని రాష్ట్ర రెవెన్యూ మంత్రి పేర్కొన్నట్లు కలెక్టర్ చెప్పారు. రెవెన్యూ, జిహెచ్‌ఎంసి,హెచ్‌ఎండిఓ, హైడ్రా అన్ని శాఖల సమన్వయంతో కబ్జాలు, భూ ఆక్రమణల సమస్యలపై కఠిన చర్యలు తీసుకొంటామని కలెక్టర్ పేర్కొన్నారు. భూభారతి చట్టంలోనూ పరిష్కారం కాని సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకొని వెళతామన్నారు. గ్రామ పంచాయతీ అధికారులను నియమించటం ద్వారా ప్రతి గ్రామంలో ఉండే చిన్న చిన్న సమస్యలను పరిష్కరిస్తూ వారితో సాధ్యం కాని వాటిని తహసీల్దార్ ల దృష్టికి తీసుకొని వెళతారన్నారు. ఈ సదస్సులో జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ నర్సిం లు, జిల్లా గ్రంథాలయ సంస్థ కమిటి చైర్మన్ శ్రీనివాసరెడ్డి, మల్కాజిగిరి ఆర్డీవో శ్యాంప్రకాష్, దుండిగల్ తహసీల్దార్ మతిన్ తదితర అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## కలెక్టర్ ఆదేశాలతో అక్రమ రవాణాకు బ్రేక్

ప్రజాపక్షం/కొడంగల్ : కొడంగల్‌లో ఇసుక మాఫియా హల్‌చల్ అంటు శనివారం ప్రజాపక్షం దినపత్రిలో వచ్చిన వార్తా కథనానికి జిల్లా కలెక్టర్ స్పందించి కొడంగల్‌లోని అధికారులను మందలించినట్లు విశ్వసనీయ సమాచారం. అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన కొంతమంది నాయకులు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆయన సోదరుడు తిరుపతి రెడ్డి పేర్లను వాడుకుంటు అధికారులను సైతం భయభ్రాంతులకు గురిచేసి మరీ రాత్రనక, పగలు అనక ఇష్టానుసారంగా అక్రమంగా ఇసుకను కాజేస్తుండటం కొడంగల్‌లో సంచలనంగా మారిం ది. దీనిపై వచ్చిన వార్తా కథనానికి జిల్లా కలెక్టర్ ఎన్ని అనుమతులు ఇచ్చారు. ఎన్ని ట్రాక్టర్లు నడిచాయి. ఎన్ని టిప్పర్‌లు నడిచాయి. ఎక్కడ ఎక్కడ అభివృద్ధి పనులకు ఇసుకను తరలించడం జరిగింది అనే కోణంలో పూర్తి సమాచారం ఇవ్వాలని పోలీసు అధికారులను, రెవెన్యూ అధికారులకు సైతం ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తుంది. కాగా శనివారం బోంరాస్‌పేట మండలంలో ఇసుక రవాణాను అధికారు లు నిలిపివేసినట్లు సమాచారం. ఇలాంటి సమాచారం బయటికి వెళ్లకుండ అంతర్గతంగా సాగినట్లు కూడా విశ్వసనీయ సమాచారం మాత్రమే ప్రజాపక్షంకు దొరికినట్లు తెలుస్తోంది. కొడంగల్ నియోజకవర్గ కేంద్రంలో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి వేల కోట్ల నిధులను వెచ్చించిన కాంట్రాక్టర్‌లు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తూ స్థానికం గా దొరికే ఇసుకకు కక్కుర్తి పడుతున్నారని పలువురు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. ప్రభుత్వానికి డిడిలు కడితే కాళేశ్వరం నుంచి లారీలు లారీలు ఇసుక వస్తుందని అలాంటిది కాకుండా దొంగచాటుగా ఇలాంటి ఘాతుకాలకు పాల్పడటం సిగ్గుగా ఉందని కొడంగల్ ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు.



## ప్రతమ్ ఎడ్యుకేషన్, ఫౌండేషన్ సేవలు అభినందనీయం : ఎంఇఒ గోపాల్

ప్రజాపక్షం/పరిగి:పరిగి పట్టణంలో నెంబర్ వన్ ప్రభుత్వ పాఠశాలలో ప్రతమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఓపెన్ టెన్త్ విద్యార్థులకు జలక్ ఆక్టివిటీ ,అన్యువల్ డే ప్రోగ్రాంను నిర్వహించరు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా ఎంఈఓ గోపాల్ మాట్లాడుతూ ప్రతమ్ సంస్థ ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది అని అన్నారు. చదవు మనేసిన మహిళలకు ఓపెన్ పదవ తరగతి లో చేర్పించి ప్రతి రోజు క్లాసులు నిర్వహిస్తూ ట్యూషన్ ,ఎగ్జామినేషన్ ఫీజులను ప్రతమ్ సంస్థ చల్లించడం అభినందనియం అన్నారు. పదవ తరగతి పాసైన తర్వాత వారికి ఉండే అవకాశాలను గురించి ప్రతమ్ సంస్థ విద్యార్థులకు వివరించాడం జరుగుతుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో పాండు , వెంకటయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గోన్నారు.

## ఉగ్రవాదుల దాడి అమానుషం

### టిఎస్ యుటిఎఫ్ నవాబుపేట మండల అధ్యక్షులు

ప్రజాపక్షం/నవాబుపేట్: కాశ్మీర్‌లోని పహల్గాంలో యాత్రి కులపై ఉగ్రవాదులు దాడి చేసి చంపడాన్ని టిఎస్ యుటిఎఫ్ నవాబుపేట మండల అధ్యక్షులు కే.రవీందర్, ప్రధాన కార్యదర్శి పరమేష్ తీవ్రంగా ఖండించారు. దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. జమ్మూ కశ్మీర్‌లో పర్యటించడానికి, వెళ్లిన సందర్శకులని ఉగ్రవాదులు కాల్చి చంపిన ఘటన యావత్ ప్రజల్ని కలచివేసిందని ఇది హేయమైన చర్య అని అన్నారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ, అభం శుభం తెలియని పర్యటకులను నిష్కరణంగా కాల్చి చంపడం పెరిగి పందల చర్య అన్నారు. సైనిక దళాల దుస్తులు వచ్చి మొత్తం ఘటనపై సమగ్రమైన విచారణ చేయడం ద్వారా వాస్తవాలు ప్రజల ముందు పెట్టాలని అన్నారు. దోషులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించడం ద్వారా కాశ్మీర్ లో శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పాలని కోరారు. కాశ్మీర్ ఉగ్రవాదుల దాడిని ఆసరాగా చేసుకొని దేశంలో మత విద్వేషాలను సృష్టించే శక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఇలాంటి చర్యలు పునవృత్తం కాకుండా తగిన జాగ్రత్త లు తీసుకోవాలని కేంద్రాన్ని కోరారు.

## రైతుకు ఆయుధమే ప్రభుత్వ ధృవీకరణ పత్రాలు

### భూభారతిపై అవగాహన సదస్సులో కలెక్టర్ ప్రతీక్ జైన్






ప్రజాపక్షం/కొడంగల్: ఆధారంతో కూడిన ఎలాంటి ధృవపత్రం అయినా రైతులకు ఒక ఆయుధం అని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. శనివారం కొడంగల్ నియోజకవర్గంలోని దౌల్తాబాద్, దుద్యాల్ మండల కేంద్రాలలో భూభారతి చట్టంపై రైతులకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతు రైతులకు తమ భూముల విషయంలో ఉన్న అభద్రత భావానికి తావులేకుండా జవాబుదారీతనాన్ని పెంచేందుకు భూ భారతి నూతన చట్టాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. భూభారతి చట్టం ద్వారా మన భూముల విషయంలో ఉన్న సమస్యల సవరణకు అవకాశం కల్పించడం జరిగిందన్నారు. కొత్త చట్టం ద్వారా లావాదేవీల సేవలు, రిజిస్ట్రేషన్, ముటేషన్, ఆర్‌ఓఆర్ మార్పులు చేర్పులు, సాదా బైనామా వంటి సేవలు సులభతరం అవుతాయని తెలిపారు. ప్రభుత్వం ప్రజలకు సరళం గా ఉండే విధంగా గ్రామీణ ప్రజల, ప్రభుత్వ కార్యాలయాల చుట్టు తిరగకుండా గ్రామాల్లోకి రైతుల వద్దకు అధికారులు వచ్చి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని పేర్కొన్నారు. సాదా బైనామాల పరిష్కారం వేగవంతం అవడంతో పాటు వారసత్వ మ్యూటేషన్ హక్కుల సంక్రమణ ను గడువులో పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. ధరణి వ్యవస్థ ఉన్నప్పుడు ఏదైన అభ్యంతరాలు ఉంటే భూభారతి చట్టం ప్రకారం అప్పీలు చేసుకునే అవకాశం కూడా ఉందని అన్నారు. తహశీల్దార్ స్థాయిలో దరఖాస్తు చేసుకుంటు న్యాయం జరగలేదని భావిస్తే ఆర్డీవోకు అప్పీల్ చేసుకునే అవకాశం ఉందని అక్కడ న్యాయం జరగలేదని భావిస్తే కలెక్టర్‌కు అప్పీల్ చేసుకోవచ్చిన తెలిపారు. ఈ చట్టం ద్వారా భూముల రికార్డులో తప్పుల సవరణకు అవకా శం కల్పించబడిందని భూమి రిజిస్ట్రేషన్ మ్యూటేషన్‌కు ముందు తప్పనిసరిగ్గా భూమి సర్వే జరిపించి మ్యాప్ తయారు చేయాల్సి ఉంటుందన్నారు. ముందు తప్పనిసరిగ్గా భూమి సర్వే జరిపించి మ్యాప్ తయారు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. భూభారతి ద్వారా భూమికి సంబంధించిన సమస్యలు జిల్లా స్థాయిలోనే సత్వరం పరిష్కారం అవుతాయని అన్నారు.

జిల్లాలో 10 నెలల క్రితం 15 వేల భూ సమస్యల దరఖాస్తులు ఉండే పని ప్రస్తుతం 5 వేల దరఖాస్తులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని 3 మాసాల్లో రెవెన్యూ యంత్రాంగం ప్రతి సమస్యను పరిష్కారించే దిశగా పనిచేస్తున్నామని కలెక్టర్ అన్నారు. త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీ అధికారులను నియమించనున్నట్లు ప్రజల సహకారంతో భూ సమస్యల పరిష్కారాని కి నిబద్ధతతో పనిచేస్తామని వెల్లడించారు.

అనంతరం దౌల్తాబాద్ మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న జూనియర్ కళాశాల పనులు గ్రంథాలయం (మన లైబ్రేరీ)లో ఏర్పాటు చేస్తున్న వివిధ సౌకర్యాలను కలెక్టర్ పరిశీలించారు. భూభారతి కార్యక్రమంలో రైతులు వెంకట్రావు, బసప్ప రెడ్డి శ్రీనివాస్‌లు భూభారతి నూతన ఆర్‌ఓఆర్ చట్టం చాలా సరళీకృతంగా ఉందని ఈ చట్టం ద్వారా రైతులకు మేలు జరుగుతుందని వారు తమ ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, సబ్‌కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్, కడ ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, తహశీల్దార్ గాయత్రి, ఎంపిడిఓ శ్రీనివాస్, పిఎసిఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డిలతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు తదితరులు పాల్గోన్నారు.

## కోళ్లఫారం దుర్వాసన భరించలేం...

ప్రజాపక్షం/శామీర్‌పేట :ఓ కోళ్లఫారమ్ నుంచి వచ్చే దుర్వాసనను భరించలేకపోతున్నామని మూడుచింతలపల్లి మండలం లక్ష్మాపూర్ గ్రామస్థులు శనివారం కోళ్లఫామ్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. గ్రామానికి సమీపంలో ఉన్న కోళ్లఫారమ్ నుంచి భరించలేని దుర్వాసన, ఈగలు, దోమలతో గ్రామంలోని ప్రజలు అనారోగ్యం పాలౌతున్నారని ఆవేదన చెందారు. గతం లో ఈ ఫారమ్ నుంచి సమస్యలు ఎదుర్కొన్నామని కొద్ది రోజులు దుర్వాసన రాకుండా చేసిన కోళ్లఫారమ్ నిర్వాహకులు తిరిగి ఆ దిశగ చర్యలు తీసుకోవ డం లేదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కోళ్లఫారమ్ నిర్వాహకులతో మాట్లాడామని వారం రోజుల సమయంలో దుర్వాసన రాకుండా చూడాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజి ఎంపిటిసి నాగరాజు, యువ నాయకుడు క్యాతం మధుకృష్ణ, శ్రీనివాస్‌చారీ, శావుకారి, అశోక్‌చారీ, తదితరులు పాల్గొన్నారు.

## ఉగ్రదాడికి నిరసనగా

# సిపిఐ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ




ప్రజాపక్షం/బోడుప్పల్ : మేడిపల్లి మండ లం పిర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉప్పల్ బస్ డిపో ఎదురుగా పహల్గాంలో ఉగ్రవాదులు మారణకాండనకు నిరసనగా మేడిపల్లి మండల సిపిఐ పార్టీ మండల కార్యదర్శి రచ్చ కిషన్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో రచ్చ కిషన్ మరియు జె లక్ష్మిలు మాట్లాడుతూ ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని, మతం పేరిట మారణ హోమం చేస్తున్న వారిని కఠినంగా శిక్షించాలన్నారు. అమాయక ప్రజల ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని, వారి ఆత్మలకు శాంతి కలగాలని, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని కోరారు. ఉగ్రవాదం పిరికిపంద చర్యని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు సిపిఐ మండల కౌన్సిల్ సభ్యులు కె.ప్రమీల, సిహెచ్ మాధవి, బాపరాజు, భూతం అయిలయ్య, కనకయ్య, కొమరయ్య, ఇస్తారీ, మహేశ్వరి, బొందయ్య, జి.నాగరాజు, నర్సమ్మ,




లక్ష్మమ్మ, తదితరులు పాల్గొన్నారు.

**ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ....**

ఉగ్రవాద వ్యతిరేక పోరాటంలో దేశానికి అండగా నిలుస్తామని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఉప్పల్ బ్రాంచ్ అధ్యక్షులు డాక్టర్ అశోక్ పేర్కొన్నారు. కాశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన క్రూరమైన ఉగ్రదాడి ప్రజలందరిని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ భయంకరమైన చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పహల్గాం అమాయక పౌరులపై ఉగ్రవాదుల దాడులను ఖండిస్తూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఉప్పల్ బ్రాంచ్ ఆధ్వర్యంలో ఉప్పల్ బస్ డిపో ముందు డాక్టర్లు ప్లకార్డులు చేతబూని ఉగ్రవాదం నశించాలి, శాంతిని కాపాడాలి. ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని పెద్ద ఎత్తున నినదించారు. కొవ్వొత్తులు వెలిగించి బాధితులకు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఉప్పల్ బ్రాంచ్ ప్రదాన కార్యదర్శి డాక్టర్ వి.శ్రీనివాస్, కోశాదికారి డాక్టర్ బి.సౌజన్య రెడ్డిలతో పాటు పరిసర ప్రాంతంలోని డాక్టర్లు, హాస్పిటల్స్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

**కుషాయిగూడలో క్యాండిల్ ర్యాలీ...** జమ్ము కశ్మీర్ పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రవాద ముష్కరులు దాడి జరిపి 26 మందిని పంపేసిన సంఘటనను నిరసిస్తూ మధుర నగర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కుటుంబాలు చిన్నారులు,మహిళలు కొవ్వొత్తుల ర్యాలీని సీతారాంనగర్,కటింగ్ కాలనీ,టీచర్స్ కాలనీ,స్నేహపురి కాలనీ,చక్రీపురం కాలనీల మీదుగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో నాయకులు ఎంపల్లి పద్మారెడ్డి, నేమూరి మహేష్‌గౌడ్,కాలనీ ప్రతినిధులు,మహిళలు తదితరులు పాల్గొన్నారు.

**నాగారంలో కొవ్వొత్తుల ర్యాలీ**

నాగారం మున్సిపాలిటీ పరిధిలో ఉగ్రవాదులు



జరిపిన కాల్పులలో 26 మంది మృతి చెందడంతో కొవ్వొత్తుల ర్యాలీని జెఏసి,అల్ పార్టీ నాయకులతో కలసి నిర్వహించారు.ఉగ్రవాదుల దాడిని ఖండించడని పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ర్యాలీని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి,టిడిపి అధ్యక్షులు కొండా జంగారెడ్డి,సాయినాథ్‌గౌడ్,జాక్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కరాటే శిక్షణ కార్యక్రమం ప్రారంభం



ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి : వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని మెరినాట్స్ గ్రౌండ్‌లో జపాన్ పోటోకాన్ కరాటే డు అసోసియేషన్స్ ఆఫ్ ఇండియా ఆద్వర్యంలో ఫౌండర్ ,టెక్ డైరెక్టర్ మాస్టర్ ఖాజా పాషా తో పాటు మాస్టర్ విజయ్ ల ఆధ్వర్యంలో చిన్నారులకు కరాటే విక్షణ ఉచిత సమ్మర్ క్యాంపు కార్యక్రమంను చిగుళ్లపల్లి రమేష్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ వికారాబాద్ పట్టణంలో గత 30సంవత్సరాలుగా ఎలాంటి స్వలాభం చూసుకోకుండా ,చిన్నారులకు కరాటేలో ఉచితంగా శిక్షణ ఇస్తున్నదున దినిని సద్వినియోగం చేసుకోవలని అన్నారు. ఈ కార్యక్రమంలో హఫీజ్ , వెంకట్‌రెడ్డి, మహిపాల్ తదితరులు పాల్గోన్నారు.

## నూతన వ్యవసాయ అధికారిగా కె. పోలప్ప



ప్రజాపక్షం/బొంరాస్‌పేట్: కొడంగల్ నియోజకవర్గంలోని బొంరాస్‌పేట్ మండల నూతన వ్యవసాయ అధికారిగా కె. పోలప్ప బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం నారాయణపేట్ జిల్లాలో డిప్యూటేషన్‌లో విదులు నిర్వహిస్తుండగా డిప్యూటేషన్ రాద్దు కవడంతో తన స్థానంలోని బొంరాస్‌పేట్ రావడం .జరిగింది అని తెలిపారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న జి,తులసి కొడంగల్ మండల వ్యవసాయ అధికారిగా కొనసాగు తున్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రైతులకు అన్ని వేళల్లో అందుబాటులో ఉంటూ వ్యవసాయ శాఖ పరంగా సేవలను అందిస్తామని తెలిపారు.

## లాబరేటరీ హబ్‌లో కాంట్రాక్టు పద్ధతి ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోండి

**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో తెలంగాణ దయగ్నస్టిక్స్,నేషనల్ హెల్త్ మిషన్ పథకంలో భాగంగా,రంగారెడ్డి జిల్లా లాబరేటరీ హాబ్ లో వివిధ విభాగాల్లో కాంట్రాక్టు బేసిక్ లో పనిచేయడానికి పాథలి జిట్,రేడియో గ్రాఫర్, సపోర్టింగ్ స్టాప్ లకు ఒక్కొక్క పోస్ట్,ఫార్మసీస్ట్ రెండు పోస్టులు చొప్పున కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగాల భర్తీకి దరాకస్తులు 25.04.2025 నుండి 31.04.2015 తేదీలలో దరఖాస్తులు స్వకరిస్తారని రంగా రెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆరికారి డా.బి. వెంకటేశ్వర్ రావ్ తెలిపారు. ఆసక్తి గలవారు రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం శివరాం పెల్లి పేరా పోస్టు ద్వారా లేదా స్వయంగా దరఖాస్తు చేసుకోవాల్సిందిగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు.

## కుంట్లూరు అగ్నిప్రమాదం స్థలిలో రాచకొండ కమిషనర్ పరిశీలన



**ప్రజాపక్షం/ఎల్‌బినగర్ :** అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని కుంట్లూర్ గ్రామ సమీపంలో రావి నారాయణరెడ్డి కాలనీలో అగ్నిప్రమాదం జరిగిన చోటును శనివారం రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు సంఘటన స్థలాన్ని చేరుకుని పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ సుధీర్‌బాబు బాధితులను జరిగిన సంఘటనపై వారిని అడిగిపు లు విషయాలు తెలుసుకున్నారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి చట్టపరమైన చర్యలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్‌బి నగర్ డిసిపి ప్రవీన్‌కుమార్, వనస్థలిపురం ఏసిపి కాశిరెడ్డి తదితరులు ఉన్నారు.

## క్రీడాకారులకు హోప్ ఫౌండేషన్ ప్రోత్సాహం



**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి:** రెజ్లింగ్, బాక్సింగ్ పోటీలలో రాణిస్తున్న అక్క, తమ్ముళ్ళకు హోప్ ఫౌండేషన్ చైర్మన్, తెలంగాణ ఓలంపిక్ సంయుక్త కార్యదర్శి కొండ విజయ్ కుమార్ రెజ్లింగ్, బాక్సింగ్ కిట్ల కోనుగోలు కోరకు చందానగర్‌లోని హోప్ ఫౌండేషన్ కార్యలయంలో నగదును అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యంబజికి చేందిన సుంకు కావ్య రెజ్లింగ్, సుంకు హర్షవర్ధన్ బాక్సింగ్‌లో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించి పలు పథకాలు సాధించారని రానున్న రోజులలో జరిగే టోర్నమెంట్‌లలో మరింత రాణించాలని అలోచనతో హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అధునాతన కిట్లను కోనుగోళ్ళు చేయాడానికి నగదు పురస్కరాన్ని అందించామని తెలిపారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడలలో సైతం రాణించాలని , తల్లి దండ్రులు సైతం తమ పిల్లలను విద్యతో పాటె క్రీడల వైపు ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## ఉమెన్ థీమ్స్ పార్కులు పూర్తి చేయాలి



**ప్రజాపక్షం/ఎల్‌బినగర్ :** మహిళాలకు ప్రత్యేక పార్కులు ఉండాలనే ఉద్దేశంలో ఉమెన్ థీమ్స్ పార్కు పనులను త్వరగా పూర్తి చేసి అందుబాటులో తీసుకోరావాలని బిఎన్‌రెడ్డి నగర్ డివిజన కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం డివిజన్లోని ఎన్‌జిఒస్ కాలనీలో కోటీ 99 లక్షల వ్యయంతో చేపడుతున్న థీమ్స్ పార్కును జిహెచ్ఎంసి డిఇ దామోదర్ రావు, జలమండలి డిజిఎం రాజగోపాల్‌లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ లచ్చిరెడ్డి మాట్లాడుతూ పార్కులు పనులు పూర్తి చేసి ప్రజలకు త్వరగా అందుబాటులో తీసుకురావాలని, మహిళాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. సంబంధిత అధికారులు పార్కు పనులపై పరివేక్షణ ఉండాలని అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఎఇ రాజ్‌కుమార్, జలమండలి మేనేజర్ భవ్యరెడ్డి, కాలనీ వాసులు వర్ధిని, వాణి, సుమ, శర్మ పార్టీ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, సురేష్ కుమార్, వర్క్ ఇన్స్‌పెక్టర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేణుగోపాల్‌కు సన్మానం



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్ :** షాద్‌నగర్ మున్సిఫ్ కోర్టులో బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన వేణుగోపాల్‌ను స్థానిక మాజీ కౌన్సిలర్ నడికూడ యాదగిరి యాదవ్ సన్మానించారు. శనివారం తన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నడికూడ యాదగిరి యాదవ్ మాట్లాడుతూ కిందిస్థాయి కుటుంబం నుండి బార్ అసోసియేషన్ అధ్యక్ష స్థాయికి వేణుగోపాల్ రావడం ఎంతో అభినందనీయమని అన్నారు. వేణుగోపాల్‌ను ఆదర్శంగా తీసుకొని మిగత సభ్యులు భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి చేరుకునేందుకు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నూతన అధ్యక్షుడు వేణుగోపాల్ మాట్లాడుతూ తనను అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు బార్ అసోసియేషన్ సభ్యులందరికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు పిప్పల వెంకటేష్ యాదవ్, రిటైర్డ్ ఉపాధ్యాయులు మధుసూదన్, గౌరీలు పాల్గొన్నారు.

## ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** రాష్ట్రంలో కాంగ్రెస్ అనేక హామీలు చెప్పి ప్రజలను మోసం చేసి అధికారంలో వచ్చారని, కెసిఆర్ కుటుంబానికి జైల్లో పెట్టాడానికి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కుట్ర చేస్తుందని ఎల్‌బినగర్ నియోజకవర్గ ఎంఎల్ఎ దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆరోపించారు. శనివారం ఎల్‌బినగర్ నియోజకవర్గంలోని మన్సూరాబాద్‌లో శ్రీరమణ కాలనీ, హయత్ నగర్ బొమ్మల గుడి, వనస్థలిపురం ఏ టైప్ క్వాటర్స్, బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్‌ల్లో గాయత్రీ నగర్ బ్యాంక్ కాలనీ, ఎస్‌కెడి నగర్ వద్ద బిఆర్ఎస్ 25వ రజతోత్సవ జెండా పండుగను ఘనంగా నిర్వహించారు. సందర్భంగా ఎంఎల్ఎ దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, రాబోయే కాలంలో కెసిఆర్ రావాలని ప్రజలు కోరుతున్నారని ఆయన తెలిపారు. నేడు వరంగల్‌లో జరిగే రజతోత్సవ సభను ఎల్‌బి నగర్ నుంచి భారీగా పార్టీ శ్రేణులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వనస్థలిపురం మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షులు చింతల రవికుమార్ గుప్తా, లగ్గొని శ్రీధర్ గౌడ్, మధు, అజయ్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం వెంటనే నీటి ఎద్దడి నివారించాలి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వేసవికాలం ప్రారంభం కాగా నే నగర శివారు ప్రాంతాలలో తీవ్రమైన నీటి ఎద్దడిని ప్రజ లు ఎదుర్కోవడం జరుగుతోందని టిడిపి సికింద్రాబాద్ పా ర్లమెంట్ అధ్యక్షులు పి. సాయిబాబా అన్నారు. ప్రభు త్వం ఈ నీటి ఎద్దడిని నివారించడానికి చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వం చర్యలు చేపట్టకపోతే రానున్న రోజుల్లో పరిస్థితి మరింత దిగజారిపోతుంద ని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దోమల్‌గూ డ నగర పార్టీ కార్యాలయం లో శనివారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే గతంలో కర్ణాటక రాష్ట్రంలో మాదిరిగా తాగడానికి నీళ్లు లభించని పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. జలమండలి సరఫరా చేస్తున్న వాటర్ ట్యాంకులను అధికార పార్టీ నేతలు, వారి అనుచరులకు కేటాయిస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని విమర్శించారు. ప్రాంతాన్ని బట్టి ఒక్కో ట్యాంకర్‌కు రూ.500 నుండి రూ. 5 వేల వరకు వసూలు చేస్తూ, ప్రజలను అడ్డంగా దోచుకుంటున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు నల్లెల్ల కిషోర్, పి.బాలరాజ్ గౌడ్, ఎస్.ప్రకా ష్, కిరణ్ కుమార్, శ్యామ్ సుందర్, భానుప్రకాష్ పాల్గొన్నారు.

# ప్రజల భద్రతకు నోడల్ ఏజెన్సీ ఏర్పాటు అవశ్యం

### హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ ప్రజల భద్రతకు అత్యంత ప్రాధానమివ్వాలని, ముఖ్యంగా భవనాల్లో విద్యుత్ భద్రతను పర్యవేక్షించడానికి ఒక ప్రత్యేక నోడల్ ఏజెన్సీని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ అన్నారు. హైడ్రా కార్యాలయంలో శనివారం 'భవనాల్లో విద్యుత్ భద్రత' అనే అంశంపై జరిగిన అవగాహన సదస్సులో ఆయన ప్రసంగించారు. ప్రమాదాల నివారణకు సంబంధించి విద్యుత్, అగ్నిమాపక, పరిశ్రమల వంటి వివిధ ప్రభుత్వ విభాగాలు వేర్వేరుగా కాకుండా, ఒకే వేదికపైకి వచ్చి సమన్వయంతో పనిచేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. తరచుగా సంభవిస్తున్న అగ్ని ప్రమాదాలకు ప్రధాన కారణం విద్యుత్ వినియోగంలో లోపాలేనని తెలిపారు. ఇలాంటి దుర్ఘటనలను అరికట్టాలంటే, విద్యుత్ భద్రతా ప్రమాణాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడంతో పాటు, కఠినమైన నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజల భద్రతకు సంబంధించిన అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారా లేదా అనే అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించేందుకు సంబంధిత విభాగాల నిపుణులతో కూడిన ఒక నోడల్ ఏజెన్సీని ఏర్పాటు చేయాలని రంగనాథ్ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ ఏజెన్సీ కేవలం పరిశ్రమలకే పరిమితం కాకుండా అపార్ట్‌మెంట్‌లు, కార్యాలయాలు, నివాస గృహాల్లో కూడా విద్యుత్ వైరింగ్, ఎర్తింగ్ నాణ్యత, వినియోగిస్తున్న విద్యుత్ పరికరాల ప్రమాణాలను తప్పనిసరిగా తనిఖీ చేయాలని సూచించారు. ఏదైనా దుర్ఘటన జరిగిన తర్వాత విచారణ చేపట్టడం కన్నా, అసలు అలాంటి ప్రమాదాలకు ఆస్కారమే లేకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడంపై దృష్టిసారించాలన్నారు. ఈ సదస్సు ముఖ్య ఉద్దేశ్యం కూడా అదే అని తెలిపారు. ఈ సమన్వయ బాధ్యతను హైడ్రాకు చెందిన డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ విభాగం చొరవ తీసుకుని ముందుకు నడిపించాలన్నారు. డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రాజగోపాల్, బాయిలర్స్ డిపార్టుమెంట్ డిప్యూటీ చీఫ్ ఇన్స్‌స్పెక్టర్ భీమారావు, డిప్యూటీ చీఫ్ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శ్రీనివాస్, డిప్యూటీ చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్స్‌పెక్టర్ జనరల్ చంద్రశేఖర్, సినర్జీ కన్సల్టెంట్ శ్రీనివాస్, ఎలక్ట్రికల్ కన్సల్టెంట్ కృష్ణ రమేష్ మాట్లాడుతూ పరిశ్రమలు, భారీ కట్టడాలు, నివాస సముదాయాల భద్రత విషయంలో ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారనే అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో హైడ్రా ఫైర్ విభాగం అదనపు సంచాలకులు పాపయ్య, అదనపు ఎస్‌పి సుదర్శన్, డిప్యూటీ కలెక్టర్ సుధ, ఆర్ఎఫ్ఓ జయప్రకాశ్, డిఎఫ్ఓలు యజ్ఞనారాయణ, గౌతం పాల్గొన్నారు.

## డిప్యూటీ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలి

### కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన.. భాగ్యనగర్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.శ్రీధర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భవన నిర్మాణ అనుమతుల జారీలో అవకతవకలకు పాల్పడుతున్న సర్కిల్15 డిప్యూటీ కమిషనర్ రామాంజనేయులు రెడ్డిపై చర్యలు తీసుకోవాలని జిహెచ్ఎంసి కమిషనర్ ఇలంబర్తికి భాగ్యనగర్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.శ్రీధర్ ఫిర్యాదు చేశారు. శానిటరీ సూపవర్ వైజర్ వి.గోవర్ధన్‌తో కలిసి డిప్యూటీ కమిషనర్ అక్రమాలకు పాల్పడుతున్నట్లు లేఖలో స్పష్టం చేశారు. భవన నిర్మాణదారుల వద్ద వసూళ్లకు పాల్పడుతున్నారని, డబ్బులు ఇవ్వని పక్షంలో వారిని భయాభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. టౌన్‌ప్లానింగ్ అంశాలలో జోక్యం చేసుకుంటూ సిబ్బందిని ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. తన లాగిన్‌లో ఉన్న భవన నిర్మాణ అనుమతుల ఫైళ్లకు అనుమతులు మంజూరు చేయడానికి సంబంధిత భవన నిర్మాణ యజమానులను వస్తేనే దరఖాస్తులు మంజూరు చేస్తున్నారని అన్నారు. ఈ విషయంలో కార్యాలయ సిబ్బంది ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కావున కమిషనర్ ఈ విషయంలో తగిన విచారణ జరిపి, డిప్యూటి కమిషనర్, శానిటరీ సూపర్‌వైజర్‌లపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. వారి అవినీతి అక్రమాలు దృష్టిలో పెట్టుకొని వారిని, వారి మాతృ సంస్థకు సాగనంపాలని కమిషనర్‌ను శ్రీధర్ కోరారు.

## 'పార్కు స్థలం కబ్జాదారులపై చర్యలు తీసుకోండి'





**ప్రజాపక్షం / ఖైరతాబాద్ :** నగరంలోని కిస్మత్‌పూర్ బండ్లగూడ జాగీర్‌లోని ఫార్చ్యూన్ మిడ్వౌస్ పేరిట దాదాపు 2వేల చదరపు గజాల పార్కుతో కలిపి వెంచర్ నిర్మించిన రాధా రియ ల్టీ బిల్డర్స్ ఇప్పుడు ఆ పార్కును కబ్జా చేసి అక్ర మ నిర్మాణాలు నిర్మించారని హరిప్రియ దర్శిని మేకల ఆరోపించారు. శనివారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తన భర్త శ్రీకాంత్‌రావుతో కలిసి కబ్జా అయిన పార్కుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. మొదటి లే అవుట్ లో తన ప్లాట్ వెనుక పార్క్ అని చూపించారని, తరువాత లే అవుట్‌లో ప్లాట్లుగా చూపించారని పేర్కొన్నారు. తర్వాత ఫార్చ్యూన్ మిడ్వౌస్ వెంచర్‌లో తాను 500 గజాల ప్లాట్ కొనుగోలు చేసి, ఇల్లు నిర్మించుకొన్నానని తెలిపారు. అయితే. త న ఇంటి ముందున్న 40ఫీట్ల రోడ్డు పార్కుకు వెళ్లేందుకు కేటాయించగా, దానిని రాధా రియ ల్టీ బిల్డర్స్ వారు ఆ స్థలంలో అక్రమంగా ప్లాట్స్ చేసి విక్రయించారని ఆరోపించారు. దీంతో 40 ఫీట్ల రోడ్డు 16 ఫీట్లకు కుదించబడిందన్నారు. పార్కు స్థలంలో వెలిసిన అక్రమ నిర్మాణాలు కూల్చి వేసి, పార్కును యథాతథంగా అప్పగించాలని న్యాయపోరాటం చేస్తున్న తమను బిల్డ ర్స్ వారితో కుమ్మక్కైన అధికారులు తీవ్రంగా వేధిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై హైడ్రా, ప్రజావాణిలో ఫిర్యాదు చేశామని వెంటనే రాధా రియల్టీ బిల్డర్స్‌పై సమగ్ర విచారణ జరిపి, తమకు న్యాయం చేయాలని వారు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## కలెక్టర్ ప్రొసీడింగ్స్‌పై హైకోర్టు స్టే

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రంగారెడ్డి జిల్లా శంకరపల్లి మండలంలో కొండకల్, మోకిల్లా గ్రామాల మధ్యలోని 40.12 ఎకరాల బిలదాఖలా (ప్రభుత్వ భూమి) ని ప్రైవేట్ వ్యక్తులకు పట్టాలిస్తూ కలెక్టర్ ఇచ్చిన ప్రొసీడింగ్స్ అమలును నిలిపివేస్తూ హైకోర్టు ఆదేశాలిచ్చాంది. ఈ భూమిపై 2014లో సర్వే డిపార్ట్‌మెంట్‌తోపాటు తహసిల్దార్ సర్వే చేసి అది ప్రభుత్వ భూమి అని తేల్చారని గుర్తు చేసింది. ఆ రికార్డులను సవరించాలంటూ, ప్రైవేటు వ్యక్తులకు కేటాయిస్తూ కలెక్టర్ జారీ చేసిన ప్రొసీడింగ్స్‌ను నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. కొత్త సర్వే నెంబర్లు కేటాయించడం, ప్రభుత్వ భూమిని పట్టా భూమిగా మార్చే అధికారం అధికారులకు లేదంది. ఆ భూమిలో ఎలాంటి లావాదేవీలు నిర్వహించరాదని ఆదేశించింది భూమిలో మార్పులు చేయరాదని ఉత్తర్వులు జారీ చేసింది. విచారణను జూన్ 24కు వాయిదా వేస్తూ జస్టిస్ భాస్కర్‌రెడ్డి ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. భూమిని ప్రైవేట్ వ్యక్తులకు పట్టాలిస్తూ 2022, 2023లో కలెక్టర్ జారీ చేసిన ప్రొసీడింగ్స్‌ను సవాలు చేస్తూ శైలజ వేసిన పిటిషన్‌ను విచారించాక మధ్యంతర ఆదేశాలిచ్చారు. విచారణను జూన్‌కు వాయిదా వేశారు.

## ఉద్యోగ నోటిఫికేషన్ ప్రకారం ఆ భాషల్లో పరీక్షలు

### హైకోర్టు కీలక తీర్పు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గురుకుల విద్యా సంస్థల్లో క్రాఫ్ట్/ఆర్ట్ టీచర్ పోస్టుల భర్తీకి ఇచ్చిన నోటిఫికేషన్‌లో పేర్కొన్న మేరకు తెలుగు, ఇంగ్లీషు భాషల్లో పరీక్ష నిర్వహించాలని, తాజాగా ఆ బాషల్లో పరీక్షలు నిర్వహించాల్సిందేనని గురుకుల నియామక బోర్డును ఆదేశిస్తూ హైకోర్టు కీలక తీర్పు చెప్పింది. క్రాఫ్ట్, ఆర్ట్ టీచర్ పోస్టులకు రెండు భాషల్లో పరీక్షలు నిర్వహించాలన్న సింగిల్ జడ్జి ఉత్తర్వులను బోర్డు సవాలు చేసిన అప్పీళ్లను డివిజన్ బెంచ్ కొట్టివేసింది. సింగిల్ జడ్జి తీర్పులో జోక్యం చేసుకోవడానికి నిరాకరించింది. గురుకుల విద్యా సంస్థల్లో పలు పోస్టుల భర్తీ నిమిత్తం 2023లో నోటిఫికేషన్ జారీ చేసి అదే ఏడాది ఆగస్టు 1న పరీక్షలు నిర్వహించింది. నోటిఫికేషన్ నిబంధనలకు విరుద్ధంగా ఇంగ్లీషులోనే పరీక్ష నిర్వహించడంతో పలువురు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. అప్పీళ్లపై జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి, జస్టిస్ లక్ష్మీనారాయణ అలిశెట్టిలతో కూడిన డివిజన్ బెంచ్ పైవిధంగా తీర్పు చెప్పింది.

# హామీలను వెంటనే అమలు చేయాలి

### సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య



**ప్రజాపక్షం/షాబాద్ :** దేశ ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. శనివారం చేవెళ్ల నియోజకవర్గం, శంకర్‌పల్లి మండల పరిధిలోని జొన్నాడ గ్రామంలో సిపిఐ గ్రామ శాఖ సమావేశం అధ్వర్యంలో గ్రామ సిపిఐ కార్యదర్శి చంద్రకళ అధ్యక్షతన సిపిఐ 100 సంవత్సరాల సందర్భంగా శత దినోత్సవ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య మాట్లాడుతూ.. ఎన్నికల సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి సంవత్సరాలు గడస్తున్న ఇప్పటి వరకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండ అరచక పాలన కొనసాగిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పోరాటం చేస్తున్న ఎకైక ఉద్యమ పార్టిగా కేవలం సిపిఐ కే దక్కుతుందన్నారు. సిపిఐ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. గ్రామాల అభివృద్ధి జరగాలంటే ప్రశ్నించేవారు హక్కుగా సిపిఐ పార్టీ నాయకులు ముందుండాలని పేర్కొన్నారు. కేం ద్రంలో నరేంద్ర మోది అధికారంలోకి వచ్చిన వెంటనే సీజ్ బ్యాంకులోని నల్లాధన్నాని దేశ ప్రజలకు అంకితం చేస్తామని మోసం చేసిన వ్యక్తిగా చరిత్రలో నిలిచిపోతాదని వివరించారు. రాష్ట్రం లో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండ నిర్లక్ష్యం చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రికి స్థానిక ఎన్నికల్లో సరైన బుద్ధి చెప్తురని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం సభ్యుడు ప్రభు లింగం, బికెఎం జిల్లా అధ్యక్షుడు అంజయ్య, శంకర్‌పల్లి మండల కార్యదర్శి సుధీర్, సిపిఐ నాయకులు గంగయ్య, యశోద, అంజన్, బిక్షపతి, గ్రామ కార్యదర్శి చంద్రకళ, సహా కార్యదర్శిగా నరసింహ్మా తదితరులు ఉన్నారు.

## వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయాలన్నదే కాంగ్రెస్ లక్ష్యం

### షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, అందుకే సబ్సిడిపై వ్యవసాయ పనిముట్ల అంధిస్తున్నట్లు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. శనివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో కొందుర్గు, జిల్లేడు చౌదరిగూడ మండలాలకు చెందిన అన్నదాతలకు సబ్సిడిపై వచ్చిన యంత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ రెండు మండలాల రైతులకు సబ్సిడిపై మంజూరైన14 యూనిట్ల తైవాన్ పవర్ స్ప్రేయర్ పంపులను అన్నదాతలకు అంధించినట్లు తెలిపారు. రైతులను ఆర్థికంగా అభివృద్ధి చేయాలన్నదే లక్ష్యంగా ప్రభుత్వం పెట్టుకొని సబ్సిడిపై అనేక యంత్రాలను పంపిణీ చేస్తుందని వివరించారు. రైతులకు సబ్సిడి యంత్రాలు ఇవ్వడమే కాకుండా పండించిన పంటలకు సైతం గిట్టుబాటు ధరలు సైతం కల్పిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలోనే ధాన్యం విక్రయించుకునేందుకు కృషి చేయాలని, దళారుల వద్దకు వెళ్తేనే ఆర్థికంగా ఇబ్బందులు ఎదురయ్యే అవకాశాలు ఉన్నాయని గుర్తు చేశారు. మున్ముందు అనేక సబ్సిడి యంత్రాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలు వ్యవసాయ శాఖ ఏడిఎ రాజారత్నం, మార్కెట్ కమిటి వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్, కొందుర్గు మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్ గౌడ్, డైరెక్టర్ కరుణాకర్, నేతలు మహ్మద్ ఇబ్రహీం, చౌదరిగూడ మండల వ్యవసాయ అధికారి రాజేందర్‌రెడ్డిలతోపాటు రైతులు పాల్గొన్నారు.

## ఉగ్రదాడిని యావత్ ప్రపంచం ముక్త కంఠంతో ఖండిస్తోంది: సిఆర్ ఫౌండేషన్



**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** జమ్ముకాశ్మీర్‌లో ని పహల్గామ్‌లో పర్యాటుకులపైన ఉగ్రావాదులు జరిపిన దాడిని యావత్ ప్రపంచం ముక్తఖంతంగా ఖండిస్తుందని సిఆర్ ఫౌండేషన్ పాలిక్లినిక్ డైరెక్టర్ రజనీ, మాజీ ఎంఎల్‌సి పీజే చంద్రశేఖర్ రావు తెలిపారు. ఉగ్రవాదులు జరిపిన మారణ కాండను ఖండిస్తూ కొండాపూర్‌లోని చంద్ర రాజేశ్వర్‌రావు ఫౌండేషన్ ఫర్ సోషల్ ప్రోగ్రెస్ (సిఆర్ ఫౌండేషన్) ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి పీజే చంద్రశేఖర్ , సిఆర్ ఫౌండేషన్ పాలిక్లీనిక్ డైరెక్టర్ కె.రజనీ, సిఆర్ ఫౌండేషన్ కోశాధికారి చెన్నకేశవ రావులు పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాద నిర్మూలనకు చేపట్టే అన్ని చర్యలకు యావత్ సమాజం ఎటువంటి వివక్ష లేకుండా సమర్ధిస్తుందని ఉద్ఘాటించారు. కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాద సమస్యలపై, విఘా వ్యవస్థలను పటిష్ట పరచవలసిందిగా తెలిపారు. పాలిత ప్రాంతమైన జమ్ముకాశ్మీర్‌లోని పహల్గామ్ ఉగ్రదాడులను అరికట్టాలంటే , ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా వారికి వేంటనే ఊరి శిక్షలు అమలు చేయాలని కోరారు. సిఆర్ ఫౌండేషన్ జనరల్ బాడీ మెంబర్ ప్రతిభ మాట్లాడుతూ అందరు సమైక్యంగా ఉండాలని కుల వివక్ష, మత వివక్ష ఉండకూడదని తెలిపారు. కార్యక్రమంలో సిఆర్ ఫౌండేషన్ పాలిక్లినిక్ సిఓఓ కుంభంపాటి విజయలక్ష్మి , మేనేజర్ శ్రీనివాస్, రిసెర్చ్ సెంటర్ సభ్యులు దేవేందర్ రావు,సుబ్బరామన్, మమత, లలిత, కమీటీ మెంబర్స్ చెన్నమనేని వెంకటేశ్వర్‌రావు, రాజేంద్రరావు, తానీయా, గోపిచెంద్, సీనీయర్ పాత్రికేయులు ఎబికె ప్రసా ద్, జమున, రామిరెడ్డి, మిసిమి మాస పత్రిక ఎడిటర్ అశ్వని కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# భూ భారతితోనే సత్వర పరిష్కారం

### రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి



**ప్రజాపక్షం/కొత్తూరు :** భూ వివాదాలకు తావులేకుండా రైతులకు సంబంధించిన భూములపై పూర్తి యాజమాన్య హక్కు కల్పించేందుకు ప్రభుత్వం భూ భారతి చట్టం తీసుకువచ్చిందని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి వివరించారు. శనివారం రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గంలోని కొత్తూరు మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో భూ భారతి 2025 ఆర్ఓఆర్‌పై నిర్వహించిన అవగాహన సదస్సుకు ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఆర్‌డిఒ సరితలు హాజరయ్యారు. అదే విధంగా నందిగామ మండల కేంద్రంలో భూ భారతి 2025 చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సుకు కలెక్టర్ నారాయణరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి రెండు అంచెల అప్పిల్ వ్యవస్థ రైతులకు న్యాయబద్ధమైన మార్గం కల్పిస్తోందని తెలిపారు. ఇంటిస్థలాలు, ఆబాది, వ్యవసాయేతర భూములకు హక్కుల రికార్డులతో వ్యవస్థను సమగ్ర అభివృద్ధి చేయడంతోపాటు భవిష్యత్‌లో పేద రైతులకు ఉచిత న్యాయ సహాయం అంధించే దిశగా చర్యలు తీసుకుంటామని వివరించారు. గ్రామ పంచాయతీ స్థాయిలోనే నాలుగు రకాల రెవిన్యూ రికార్డులను నమోదు చేయడం జరుగుతుందని, ప్రతి సర్వే నంబర్‌కు భూధాన్ కార్డులు ఇచ్చేందుకు ప్రభుత్వం అన్ని విధాల చర్యలు తీసుకుంటుందని తెలిపారు. మండల స్థాయిలోనే ఎక్కువ శాతం భూ సమస్యలను పరిష్కరించేందుకు కొత్త చట్టం తీసుకువచ్చినట్లు వివరించారు. ప్రణాళిక బద్ధంగా భూ భారతి2025 చట్టాలను అమలు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతు ఏన్నో ఏళ్ళు గా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వివరించారు.ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ మార్కెట్ కమిటి వైస్ చైర్మెర్ బాబర్‌ఖాన్, తహశీల్దార్ రవీందర్‌రెడ్డి, ఎంపిడిఓ అరుందతి, మున్సిపల్ చైర్ పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్, వైస్ చైర్మెన్ డోలీ రవీందర్, మున్సిపల్ అధ్యక్షుడు జె.సుదర్శన్ గౌడ్ పాల్గొన్నారు.

## నేర విశ్లేషణలో సిసిటివి కెమెరాలే కీలకం

### రాచకొండ పోలీస్ కమిషనర్ జి.సుధీర్ బాబు



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** నేర విశ్లేషణను సులభతరం చేయడంలో సిసిటివి కెమెరాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని రాచకొండ పోలీస్ కమిషనర్ జి.సుధీర్ బాబు అన్నారు. శనివారం మహేశ్వరం జోన్‌లో 855 సిసిటివి కెమెరాలను ప్రారంభించారు,వీటిలో 26 కాలనీలు/గ్రామాల్లో ప్రధాన రోడ్లు,జంక్షన్లతో కూడిన ప్రాంతలలో 289 సిసిటివి కెమెరాలను వివిధ కమ్యూనిటీలు అందించిన 68 లక్షల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన కెమెరాలను సిపి సుధీర్ బాబు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు.ఈ సందర్భంగా సిపి సుధీర్ బాబు మాట్లాడుతూ భద్రతను బలోపేతం చేయడం నేరాల నివారణ, నేర కార్యకలాపాలను నిరోధించడం ద్వారా సురక్షితమైన సమాజాన్ని సృష్టించడం, దర్యాప్తులలో సహాయపడతయాన్నారు. నేర విశ్లేషణను సులభతరం చేయడం, సమాజ భద్రతను ప్రోత్సహించడంలో సిసిటివి కెమెరాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు.ఆధునిక నేర నివారణ వ్యూహాలలో ఇవి కీలకమైన భాగమని సిపి సుధీర్ బాబు పేర్కొన్నారు.సిసిటివి కెమెరాల సహాయంతో, రాచకొండ పోలీసులు అనేక సంచలనాత్మక కేసులను గుర్తించడంలో విజయం సాధించారని ఆయన స్పష్టం చేశారు. భవిష్యత్తులో మరిన్ని కాలనీ, గ్రామల పెద్దలు సిసిటివి కెమెరాలను ఏర్పాటు చేయడానికి ముందుకు రావాలని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు కోరారు.ఈ కెమెరాలు సమాజ భద్రతకు చాలా అవసరం, ఇది నేరాలను అరికట్టడానికి, అనుమానాస్పద కార్యకలాపాలను పర్యవేక్షించడానికి, నేరాల దర్యాప్తులో పోలీసులకు సహాయపడుతుందని తెలిపారు.సిసి కెమెరాలు, సిసి టివి ఏర్పాటుకు సహకరించిన కాలనీ పెద్దలను సిపి సుధీర్ బాబు అభినందించి, సత్కరించారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం డిసిపి డి.సునీత రెడ్డి, డిప్యూటీ మహేశ్వరం జోన్ పోలీస్ కమిషనర్ బి.వి. సత్య నారాయణ, మహేశ్వరం జోన్ అదనపు డిసిపి సి. కు శాల్కర్,మహేశ్వరం ట్రాఫిక్ డివిజన్ అదనపు డిసిపి జె. నరేందర్ గౌడ్, ఐటి సెల్ ఎసిపి పి.లక్ష్మీకాంత రెడ్డి, మ హేశ్వరం డివిజన్ ఎసిపి కె.పి.వి.రాజు, ఇబ్రహీంపట్నం డివిజన్ ఎసిపి, మహేశ్వరం జోన్ అధికారులు, పాల్గొన్నారు.

ఫోకస్ క్రీడ

# ఐపిఎల్‌కు 'ఫిక్సింగ్' బెడద!

## మళ్లీ ఆరోపణలు..




చాలాకాలం తర్వాత మళ్లీ బెట్టింగ్, ఫిక్సింగ్ ఆరోపణలు తెరపైకి వచ్చాయి. ఈ ఏడాది ఐపిఎల్ ప్రారంభం నుంచే ఏదో ఒక వివాదంలో చిక్కుకొని అల్లాడుతునే ఉంది. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సిఎ) టికెట్లు, పాస్‌ల గురించి ఒత్తిడి తెస్తున్నదని, వేధింపులు ఆపకపోతే, హోం గ్రౌండ్‌ను హైదరాబాద్ నుంచి మరో ప్రాంతానికి మార్చేసుకుంటామని సన్‌రైజర్స్ హైదరాబాద్ యాజమాన్యం హెచ్చరించడం సంచలనం రేపింది. ఆటగాళ్ల ప్రవర్తన, మ్యాచ్ ఫలితాల పట్ల అనుమానాలు వంటి అంశాలు ఈసారి ఐపిఎల్ ప్రతిష్ఠను మసకబరిచాయి. తాజాగా మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణలు ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. రాజస్థాన్ రాయల్స్ మరోసారి ఫిక్సింగ్ ఆరోపణలకు కేంద్రబిందువైంది. రాజస్థాన్ క్రికెట్ అసోసియేషన్ (ఆర్‌సిఎ) అడ్‌హాక్ కమిటీ కన్వీనర్ జయదీప్ బిహాని, రాజస్థాన్ రాయల్స్ జట్టు ఇటీవల ఢిల్లీ క్యాపిటల్స్, లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లలో చివరి ఓవర్లో 9 పరుగులు చేయడంలో విఫలమైన తర్వాత, మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణలు చేశాడు. అయితే, రాజస్థాన్ రాయల్స్ ఈ ఆరోపణలను ఖండిస్తూ, బిహాని చేసిన వ్యాఖ్యలు తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని, జట్టు ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఉన్నాయని పేర్కొంది. టిక్కెట్ల వివాదంతో ఆరోపణల వెనుక ఆర్‌సిఎ, రాజస్థాన్ రాయల్స్ మధ్య టిక్కెట్ల పంపిణీపై వివాదం ఉన్నట్లు తెలుస్తోంది. సాధారణంగా ఆర్‌సిఎకు ప్రతి మ్యాచ్‌కు సుమారు 1,800 టిక్కెట్లు లభించేవి. కానీ 2025 సీజన్‌లో ఈ సంఖ్య 1,000 నుంచి 1,200లుగా నిర్ణయించారు. ఈ కారణంగా ఆర్‌సిఎ అసంతృప్తిగా ఉందని నివేదికలు సూచిస్తున్నాయి. ఇలావుంటే, పాకిస్తాన్ మాజీ క్రికెటర్లు జునైద్ ఖాన్, తన్వీర్ అహ్మద్, ఐపిఎల్‌లో మ్యాచ్ ఫిక్సింగ్ జరుగుతోందని సోషల్ మీడియాలో వ్యాఖ్యానించారు. జునైద్ ఖాన్, సన్‌రైజర్స్ హైదరాబాద్ బ్యాట్స్‌మన్ ఇషాన్ కిషన్ అనుమానాస్పదంగా ఔట్ అయిన వీడియోను షేర్ చేస్తూ, 'దాల్ మే కుచ్ కాళా హై' అని వ్యాఖ్యానించాడు. ఈ వ్యాఖ్యలను బోర్డ్ ఆఫ్ కంట్రోల్ ఫర్ క్రికెట్ ఇన్ ఇండియా (బిసిసిఐ) ఖండించింది. ఐపిఎల్‌లో పారదర్శకతను కాపాడేందుకు 24x7 యాంటీకరప్షన్ యూనిట్ పనిచేస్తోందని పేర్కొంది. ప్రస్తుతానికి రాజస్థాన్ రాయల్స్ జట్టుపై వచ్చిన మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణలకు సంబంధించిన ఎలాంటి సాక్ష్యాధారాలు లభించలేదు. ఫిక్సింగ్ జరిగినట్టు ఇతరత్రా ఆరోపణలు రాలేదు. కేసులు నమోదు కాలేదు. దీనితో ప్రస్తుతానికి ఫిక్సింగ్ కేవలం అనుమానం స్థాయిలోనే ఉంది.

క్రికెట్ వంటి క్రీడల్లో బెట్టింగ్ సహజం. బెట్టింగ్ మాఫియా ఏకంగా మ్యాచ్ ఫలితాలను నిర్ణయించడం దుర్మార్గం. క్రీడాస్ఫూర్తికి పూర్తి భిన్నంగా జరుగుతున్న ఈ తతంగం అభిమానులను ఆవేదనకు గురి చేస్తున్నది. 'జంటిల్మన్ గేమ్' క్రికెట్ ప్రతిష్ఠను నడిబజారుకీడుస్తున్నది. ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన క్రికెట్ టోర్నమెంట్‌గా ఎదిగిన ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్)కు బెట్టింగ్ బెడద మరింత ఎక్కువ. బెట్టింగ్ నిర్వహించే పంటర్లు మ్యాచ్ ఫలితాలను తారుమారు చేసేందుకు బుకీలను ఆశ్రయించడం, వారు ఆటగాళ్లకు భారీ మొత్తాలను ఆశచూపి తమకు అనుకూలంగా మార్చుకోవడం నిన్నమొన్న పుట్టుకొచ్చిన జాఢ్యమేమీ కాదు. సుమారు రెండున్నర దశాబ్దాలుగా బెట్టింగ్, ఫిక్సింగ్ చెట్టపట్టాలేసుకొని తిరుగుతునే ఉన్నాయి. భారత క్రికెటర్లు మహమ్మద్ అజరుద్దీన్, మనోజ్ ప్రభాకర్, అజయ్ జడేజా తదితరులపై వచ్చిన ఆరోపణలను అప్పట్లో సంచలనం రేపాయి. దక్షిణాఫ్రికా మాజీ కెప్టెన్ హన్సీ క్రానే, పాకిస్తాన్ మాజీ కెప్టెన్ సలీం మాలిక్ వంటి ఆటగాళ్లు బెట్టింగ్, మ్యాచ్ ఫిక్సింగ్‌లో కీలక భూమిక పోషించారన్న విమర్శలున్నాయి. చాలా మందిపై ఆయా దేశాల క్రికెట్ బోర్డులు నిషేధం విధించాయి కూడా. తర్వాతి కాలంలో పలువురు ఆటగాళ్లపై వచ్చిన ఆరోపణలను కోర్టులు కొట్టేయడం, బోర్డులు నిషేధాన్ని ఎత్తివేయడం జరిగింది. అయితే, అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. నాటి ప్రకంపనలు పూర్తిగా సద్దుమణగక ముందే 2013 ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్)లో స్పాట్ ఫిక్సింగ్, బెట్టింగ్ కలకలం క్రికెట్ ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురి చేసింది. ఢిల్లీ పోలీసులు ముగ్గురు క్రికెటర్లు శ్రీశాంత్, అజిత్ చండిలా, అంకిత్ చవాన్‌లను స్పాట్ ఫిక్సింగ్ ఆరోపణలపై అరెస్టు చేయడంతో ఈ వ్యవహారం బట్టబయలైంది. ఈ ముగ్గురు 2013 ఐపిఎల్‌లో రాజస్థాన్ రాయల్స్‌కు ప్రాతినిధ్యం వహించారు. మరో కేసులో, ముంబై పోలీసులు నటుడు విందు దారా సింగ్, వజ్రాల వ్యాపారి ప్రియాంక్ సెపానీ, చెన్నై సూపర్ కింగ్స్ జట్టు ప్రిన్సిపాల్ గురునాథ్ మెయ్యప్పన్‌లను బెట్టింగ్ ఆరోపణలపై అరెస్టు చేశారు. 2015 జూలైలో, ఆర్‌ఎం లోధా కమిటీ చెన్నై సూపర్ కింగ్స్ , రాజస్థాన్ రాయల్స్ యజమానులైన ఇండియా సిమెంట్స్, జైపూర్ ఐపిఎల్‌లను రెండేళ్ల పాటు సస్పెండ్ చేసింది. అదనంగా, పాటియాలా హౌస్ కోర్టులు శ్రీశాంత్, చండిలా, చవాన్‌లను నిర్దోషులుగా తేల్చిన తర్వాత అన్ని ఆరోపణల నుండి విముక్తి పొందారు. అయితే, జనవరి 2016లో, చండిలాను బిసిసిఐ అన్ని రకాల క్రికెట్ నుండి జీవితకాల నిషేధం విధించింది. 2019 మార్చిలో, శ్రీశాంత్ పై బిసిసిఐ విధించిన జీవితకాల నిషేధాన్ని సుప్రీంకోర్టు ఎత్తివేసింది. తరువాత ఫిబ్రవరి 2023లో, బిసిసిఐ చండిలాపై విధించిన జీవితకాల నిషేధాన్ని ఎత్తివేసింది. కేసు ప్రారంభంలో, నీరజ్ అలియాస్ వాతును అతని స్నేహితుడి ఇంట్లో అరెస్టు చేయగా, చండిలా, చవాన్‌లను ముంబైలోని వారి జట్టు హోటల్ నుండి అదుపులోకి తీసుకున్నారు. రాజస్థాన్ రాయల్స్ దర్యాప్తు పూర్తయ్యే వరకు ముగ్గురు ఆటగాళ్ల కాంట్రాక్టులను నిలిపివేసింది. స్పాట్ ఫిక్సింగ్‌లో పాల్గొన్నట్లు చవాన్ అంగీకరించాడని ఢిల్లీ పోలీసులు పేర్కొన్నారు. బుకీల ఆదేశాల మేరకు చవాన్‌తో సహా ఇతర ఆటగాళ్లను స్పాట్ ఫిక్సింగ్‌లో పాల్గొనేలా చండిలా ప్రయత్నించాడని కూడా పోలీసులు పేర్కొన్నారు. భారత క్రికెట్ నియంత్రణ మండలి ( బిసిసిఐ) తదుపరి దర్యాప్తు పూర్తయ్యే వరకు ఆటగాళ్లను సస్పెండ్ చేసింది. ఐపిఎల్ పాలక మండలి సమావేశమై, స్పాట్ ఫిక్సింగ్ కుంభకోణంలో వారు అరెస్టు చేసిన శ్రీశాంత్, చండిలా, చవాన్ మరియు మరో 23 మందిపై మహారాష్ట్ర వ్యవస్థీకృత నేర నియంత్రణ చట్టం (ఎంసిఒసిఎ) కింద కేసులు పెట్టారు. ఈ వ్యవహారంలో అండర్ వరల్డ్ డాన్లు దావూద్ ఇబ్రహీం, చోటా షకీల్ ప్రమేయం ఉందని ఢిల్లీ పోలీసుల వాదన. అయితే, పూర్తి ఆధారాలను కోర్టుకు సమర్పించడంలో పోలీసులు విఫలమయ్యారు. ఇలావుంటే, ఢిల్లీ పోలీసులు అరెస్టు చేసిన బుకీ సునీల్ భాటియా, ఐపిఎల్‌తో పాటు ఇండియన్ క్రికెట్ లీగ్, బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్‌లలో ఫిక్సింగ్‌కు పాల్పడ్డాడని చెప్పడంతో, మొత్తం ఫిక్సింగ్ కుంభకోణం మరింత లోతుగా సాగుతుందనే ఊహాగానాలు చెలరేగాయి.




### ముకుల్ ముద్గల్ కమిటీ



అక్టోబర్ 2013లో, భారత సుప్రీంకోర్టు ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్)లో బెట్టింగ్, స్పాట్ ఫిక్సింగ్ ఆరోపణలను దర్యాప్తు చేయడానికి జస్టిస్ (రిటైర్డ్) ముకుల్ ముద్గల్ నేతృత్వంలో ముగ్గురు సభ్యుల కమిటీని నియమించింది. ఈ కమిటీ ఫిబ్రవరి 2014లో సుప్రీంకోర్టుకు తన నివేదికను సమర్పించింది. ఈ కమిటీలోని ఇతర సభ్యులు భారత అదనపు సొలిసిటర్ జనరల్ ఎల్ నాగేశ్వరరావు, సీనియర్ న్యాయవాది, మాజీ క్రికెట్ అంపైర్ నిలయ్ దత్తా. మాజీ భారత క్రికెట్ కెప్టెన్ సౌరవ్ గంగూలీ కూడా కమిటీలో భాగంగా మరియు కమిటీ దర్యాప్తు ప్రక్రియలో భాగంగా ఉన్నారు. కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా ఈ కమిటీ ఎలాంటి రుజువులు, సాక్ష్యాలు సేకరించకలేక, కేవలం కొన్ని సూచనలు చేసి చేతుపు దులిపేసుకుంది. తదనంతర కాలంలో సుప్రీం కోర్టు జోక్యం చేసుకోవడంతో, లోధా కమిటీ సిఫార్సులను బిసిసిఐ అంగీకరించాల్సి వచ్చింది.


- క్రికెట్ బెట్టింగ్ కు సంబంధించి ఢిల్లీ పోలీస్ స్పెషల్ సెల్ అధికారుల బృందం యాహ్యా మొహమ్మద్ ను 2013 మే 24 తెల్లవారుజామున హైదరాబాద్ లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుండి అరెస్టు చేసింది. అహ్మదాబాద్ క్రైమ్ బ్రాంచ్ 25 మే 2013న అహ్మదాబాద్ నగరంలోని శాటిలైట్ ఏరియా నుండి బుకీ వినోద్ ముల్చందానిని అరెస్టు చేసింది. అతని వద్ద నుండి 12.8 మిలియన్ల విలువైన భారత కరెన్సీ, ల్యాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ స్పాట్ ఫిక్సింగ్‌లో బుకీలతో సంబంధాలున్నాయని ఆరోపిస్తూ విందు దారా సింగ్‌ను అరెస్టు చేశారు. తరువాత అతను జూన్ 3, 2013న ముంబై కోర్టు ద్వారా బెయిల్‌పై విడుదలయ్యాడు.
- బెట్టింగ్ కుంభకోణానికి సంబంధించి విందు దారా సింగ్ కాల్ రికార్డులు అతను చెన్నై సూపర్ కింగ్స్ (సిఎస్‌కె) జట్టు ప్రిన్సిపాల్, బిసిసిఐ అప్పటి అధ్యక్షుడు ఎన్. శ్రీనివాసన్ అల్లుడు గురునాథ్ మెయ్యప్పన్‌తో తరచుగా సంప్రదింపులు జరుపుతున్నట్లు చూపించాయి. మెయ్యప్పన్‌కు తరచుగా కాల్స్ చేయడం బెట్టింగ్ కోసమా అని దర్యాప్తు చేయడానికి, ముంబై పోలీసులు అతనికి సమన్లు జారీ చేశారు. 24 మే 2013న, ముంబై క్రైమ్ బ్రాంచ్ గురునాథ్ మెయ్యప్పన్‌ను ప్రశ్నించిన తర్వాత బెట్టింగ్, కుట్ర, మోసం ఆరోపణలపై అరెస్టు చేశారు. అరెస్టు తర్వాత, సిఎస్‌కె ఫ్రాంచైజీ వెంటనే అతనిని పదవి నుంచి తొలగించింది. మెయ్యప్పన్‌ను ముంబై కోర్టు 3 జూన్ 2016న బెయిల్‌పై విడుదల చేసింది.



ఎస్.శ్రీనివాసన్ | గురునాథ్ మెయప్పన్ | రాజ్ కుంద్రా

- జూన్ 5, 2013న, రాజస్థాన్ రాయల్స్ జట్టు సహ యజమాని రాజ్ కుంద్రాను అక్రమ బెట్టింగ్‌లో పాల్గొన్నందుకు ఢిల్లీ పోలీసులు ప్రశ్నించారు. జూన్ 6, 2013న, తన స్నేహితుడు అయిన ఒక బుకీ ద్వారా తన ఐపిఎల్ జట్టుపై పందెం వేసినట్లు తాను అంగీకరించానని ఢిల్లీ పోలీసులు పేర్కొన్నారు. జూన్ 7, 2013న, బెట్టింగ్‌లో అతనిపై ఉన్న అభియోగాలు రుజువైతే రాజ్ కుంద్రాను సస్పెండ్ చేస్తామని, జట్టులోని అతని అన్ని వాటాలను తిరిగి తీసుకుంటామని రాజస్థాన్ రాయల్స్ జట్టు యాజమాన్యం తెలిపింది. దీని కారణంగా, జూన్ 10, 2013న బిసిసిఐ అతన్ని ఐపిఎల్ నుండి సస్పెండ్ చేసింది.
- 25 మార్చి 2014న, భారత సుప్రీంకోర్టు ఎన్. శ్రీనివాసన్‌ను తన అల్లుడు గురునాథ్ మెయ్యప్పన్‌పై మోపిన బెట్టింగ్, స్పాట్ ఫిక్సింగ్ ఆరోపణలపై న్యాయమైన దర్యాప్తు జరిగేలా చూసుకోవడానికి బిసిసిఐ అధ్యక్ష పదవి నుండి స్వయంగా వైదొలగాలని ఆదేశించింది. లేకుంటే ఆయన పదవి నుంచి తప్పుకోవాలని కోరుతూ తీర్పు వెలువరించక తప్పదని హెచ్చరించింది. శ్రీనివాసన్ బిసిసిఐ అధ్యక్షుడిగా కొనసాగడం 'వికారం' కలిగిస్తుందని సుప్రీంకోర్టు పేర్కొంది.

### హ్యాట్రిక్ రనౌట్లు



ఒక బౌలర్ హ్యాట్రిక్ వికెట్లు సాధించడం తెలుసుగానీ, ముగ్గురు బ్యాట్స్‌మెన్ మూడు వరుస బంతుల్లో రనౌట్ కావడం మాత్రం చాలా అరుదు. ఢిల్లీ క్యాపిటల్స్ ఛేజింగ్‌లో 19వ ఓవర్‌లో ఈ అసాధారణ హ్యాట్రిక్ నమోదైంది. తొమ్మి ది బంతుల్లో గెలవడానికి 14 పరుగులు అవసరమైనప్పుడు, క్యాపిటల్స్ జస్ప్రీత్ బుమ్రా వరుస బంతుల్లో అశుతోష్ శర్మ, కుల్దీప్ యాదవ్, మోహిత్ శర్మలను కోల్పోయింది. ఆవెంటనే మ్యాచ్ ముగిసింది. మొదటి రెండు నిర్ణయాలు ఇటివి రీప్లేల ద్వారా ధృవీకరించిన హెయిర్‌లైన్ నిర్ణయాలు కాగా, చివరిది మిచెల్ సాంట్నర్ మిడ్‌ఆన్ నుండి డైరెక్ట్ హిట్. ఐపిఎల్‌లో ఈ విధంగా హ్యాట్రిక్ రనౌట్లు జరగడం ఇదే మొదటిసారి. అయితే, టి20 ఫార్మాట్‌లో మాత్రం మొత్తం నాలుగు పర్యాయాలు ఇలాంటి అరుదైన ఘటనలు చోటు చేసుకున్నాయి. 2011లో కరాచీలో ముల్తాన్ టైగర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఫైసలాబాద్ వోల్వ్స్ ఇన్నింగ్స్‌లో మొదటిది జరిగింది. ఆ మ్యాచ్ చివరి ఓవర్‌లో నాలుగు రనౌట్లు వచ్చాయి. దీని తర్వాత 2014లో కోల్‌కతాలో జరిగిన సయ్యద్ ముష్తాక్ అలీ ట్రోఫీలో త్రిపురపై అస్సాం, 2019లో కాబూల్‌లో స్పీన్ ఘర్ టైగర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో అమో షార్క్స్ , 2024లో బంగ్లాదేశ్‌లోని సిల్హెట్‌లో ఖుల్నాపై బారిసాల్ (ఖుల్నాకు ఒక పరుగుతో విజయం సాధించడానికి మ్యాచ్‌లోని చివరి మూడు బంతులు) హ్యాట్రిక్ రనౌట్లు నమోదయ్యాయి.

---

## కార్మిక హక్కులను కాలరాస్తున్న మోదీ సర్కార్ : మేకల



**ప్రజాపక్షం /లక్షెట్టిపేట్ :** కార్మిక హక్కులను కాలరాస్తూ బిజెపి ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చి కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా పని చేస్తోందని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు అన్నారు. శనివారం లక్షెట్టిపేట్ మార్కెట్ యార్డ్‌లో 139వ మేడే పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా మేకల దాసు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ విధానాలపై తీవ్రంగా మండిపడ్డారు. కార్మికుల హక్కులను హరిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని, కార్మికుల ఐక్యతతోనే అది సాధ్యమవుతుందని, కార్మికుల సంక్షేమం, హక్కుల కోసం నిరంతరం అండగా నిలిచేది ఎఐటియుసి అని తెలిపారు. 139వ మేడే ఉత్సవాలను కార్మిక వర్గం ఘనంగా నిర్వహించాలని, నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని, మే 20న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇందుకు సన్నాహక సదస్సు ఈ నెల 27న మంచిర్యాలలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, స్కీమ్ వర్కర్లను క్రమబద్ధీకరించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని స్పష్టం చేశారు. కనీస వేతనం రూ.26,000గా నిర్ణయించాలని, పరిశ్రమల అమ్మకాన్ని నిలిపి, ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రభుత్వాల ఆధీనంలో కొనసాగించాలని డిమాండ్ చేశారు. జమ్ముకాశ్మీర్ పహల్గాంలో ఉగ్రదాడిలో మృతిచెందిన వారికి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో మేధరి దేవవరం, కేతిరెడ్డి రమణ రెడ్డి, రవి కిరణ్, బాను చెందర్, రాజన్న, సత్తయ్య, ఐలయ్య, బాలయ్య, లచ్చన్న పాల్గొన్నారు.

## కార్మిక చట్టాలను కాపాడుకుందాం

ఎఐటియుసి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్

**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి :** కార్మిక చట్టాలను కాపాడుకుందామని ఎఐటియుసి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ అన్నారు. సికెఎం హస్పిటల్ ఎదుట 139వ మేడే వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మేడే వరంగల్ జిల్లాలో సంఘటిత, అసంఘటితరంగా కార్మికులు ఘనంగా నిర్వహించాలని కేంద్రంలో బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక చట్టాలను వ్యతిరేకిస్తూ నాలుగు లేబర్ కోడ్‌ల రద్దుకై 29 కార్మిక చట్టాల పునరుద్ధరణకై మే 20వ తేదీన జరుగు దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేద్దామని, దేశాన్ని రాజ్యాంగాన్ని ప్రజలను రక్షించుకుందామన్నారు. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు సంఘటిత రంగం, అసంఘటిత కార్మికులపై పని గంటలు పెంచుతూ ఆనాడు చికాగో నగర అమరవీరుల స్ఫూర్తితో సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానం ఈనాడు మరల మోదీ ప్రభుత్వం బడా కార్పొరేటర్లకు అనుకూలంగా 12 గంటలు విధానాన్ని అమలు చేస్తున్నారని, దీన్ని కార్మికులందరూ ఐక్యమై పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సికెఎం హాస్పటల్ బ్రాంచ్ అధ్యక్షులు కలకోట రాజు, కార్యదర్శి నాగవెల్లి శంకర్, సక్కుబాయి, సులోచన, రజిత, వీరన్న, రవీందర్, వాణి, పద్మలత, సురేందర్, దేవేందర్, స్వరూప, రాజు, శ్రీనివాస్, యశోద, కావ్య, దేవి, లక్ష్మి , బాబు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



## కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న పాలక ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాలి


ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ కార్మికుల కు పిలుపు



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మే 20న దేశవ్యాప్త సమ్మెను సింగరేణిలో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని, అదేవిధంగా 139వ మేడేను సింగరేణి వ్యాప్తంగా అన్ని గనులు, డిపార్ట్మెంట్, ఓసిపిలలో మేడే పతాకాలను ఆవిష్కరించి చికాగో అమరవీరులకు నివాళులు అర్పించి ర్యాలీలు, సభలు నిర్వహించి ఘనంగా మేడే వేడుకలను జరుపుకోవాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ పిలుపు నిచ్చారు. శనివారం కొత్తగూడెం ఏరియాలోని సెంట్రల్ వర్క్ షాప్ నందు ఎఐటియుసి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం రాకముందు కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న హక్కులను, 44 కార్మిక చట్టాలను కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం చట్ట సవరణ ద్వారా నిర్వీర్యం చేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా విభజించి కార్మిక వర్గానికి తీరని అన్యాయం చేస్తుందని ఆయన ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కొత్త చట్టాల వల్ల కార్మికులు ఇప్పుడు అనుభవిస్తున్న హక్కులు ఉండవని ఆయన పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశ వ్యాప్తంగా అన్ని కార్మిక సంఘాలు కలిసి మే 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు పిలుపు నిచ్చాయని, కనుక సింగరేణిలో కూడా సమ్మెను జయప్రదం చేయాలని ఆయన కోరారు. అదేవిధంగా కార్మికుల దినోత్సవం మేడేను సింగరేణి వ్యాప్తంగా ఎర్ర జెండాలను ఎగుర వేసి ప్రపంచ కార్మిక పోరాట దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలని, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న పాలక ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాలని ఆయన పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలకు, నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు కొరకు మే 20న జరిగే దేశ వ్యాప్త సమ్మెను సింగరేణిలో విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఇంకా ఈ సమావేశంలో ఏఐటియుసి కేంద్ర కార్యదర్శి వెంకట్, బ్రాంచి కార్యదర్శి ఎస్.వి.రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఫార్మా కంపెనీల అనుమతులు రద్దు చేసేవరకూ పోరాటం

ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తీర్పారి వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం/చండూరు/గట్టుప్పల :** మునుగోడు నియోజకవర్గంలో విచ్చల విడిగా నెలకొల్పుతున్న ఫార్మా కంపెనీలను తరిమికొట్టేందుకు ప్రజలు సిద్ధం కావాలని ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తీర్పారి వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం గట్టుప్పల మండల కేంద్రంలో నిర్వహించిన సిపిఐ గట్టుప్పల మండల కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఫార్మా కంపెనీలకు విచ్చల విడిగా అనుమతులు ఇచ్చారని అట్టి తనుమతులు రద్దు అయ్యేంతవరకు పోరాడుతామన్నారు. గట్టుప్పల ,క్రిష్టాపురం, వెలిమినేడు, చౌటుప్పల్ లాంటి ప్రాంతాలలో ప్రమాణాలు పాటించని కంపెనీలకు కూడా అనుమతులు ఇచ్చారని దీని కారణంగా వాతావరణం కాలుష్యం ఏర్పడి ప్రజలు ఈ ప్రాంతంలో నివాసం ఉండలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. నిరుద్యోగ యువతకు స్థానిక పరిశ్రమలలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. జమ్ము కాశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిని ప్రజలు ముక్తకంఠంతో ఖండించాలని దోషులను నిర్దాక్షిణ్యంగా ఉరితీయాలని కోరారు. మత చాందస్తవాదులకు తగిన బుద్ధి చెప్పాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొల్గూరి నర్సింహ్మామాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్ధానాలను అమలు చేయాలని సంక్షేమ పథకాల అమలులో అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే అధికారులపై పోరాటం తప్పదన్నారు. మండల సహాయ కార్యదర్శి రాపోలు సత్తయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిపిఐ గట్టుప్పల మండల కార్యదర్శి భీమనపల్లి రమేష్, మండల నాయకులు కారింగు శ్రీను, కందాల ము త్యం, దెందె నర్సింహ్మా, ఐతరాజు లక్ష్మ య్య, ధర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టండి

కార్మిక సంఘాల జిల్లా సదస్సు తీర్మానం

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** హనుమకొండ జిల్లా ఆల్‌ట్రేడ్ యూనియన్స్ ఆధ్వర్యంలో మే 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ కాకతీయ యూనివర్సిటీలోని కామర్స్ సెమినార్ హాలులో జాతీయ, రాష్ట్ర కార్మిక సంఘాల జిల్లా సదస్సు శనివారం జరిగింది. ఈ సదస్సులో ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రేమ్ పావని, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేష్, బిఆర్‌టియు రాష్ట్ర అధ్యక్షులు జి.రాంబాబు, ఐఎఫ్‌టియు రాష్ట్ర కార్యదర్శి ఎం.శ్రీనివాస్, ఎఐసిటియు రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎమ్మెస్ రావు, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కాసు మాధవి ముఖ్య వక్తలుగా పాల్గొని మాట్లాడుతూ కేంద్రంలో మూడో సారీ అధికారంలోకి వచ్చిన బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తూ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా పనిచేస్తున్నదని విమర్శించారు. కార్మికులు సమరశీల పోరాటాల ద్వారా 100 సంవత్సరాల్లో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేస్తూ నాలుగు లేబర్ కోడ్లను ముందుకు తీసుకొచ్చి కార్మికులను కట్టు ఆధునిక బానిసత్వంలోకి నెట్టే కుట్ర చేస్తున్నారని దుయ్యబట్టారు. భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను రక్షించుకునేందుకు కేంద్ర కార్మిక సంఘాలు స్వతంత్ర ఫెడరేషన్లు అసోసియేషన్లు కలిసి మే20న దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చాయని తెలియజేశారు. మే 20న జరిగే సమ్మెను జయప్రదం చేయాలని వారు కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. ఈ సదస్సుకు సిఐటియు జిల్లా కార్యదర్శి రాగుల రమేష్, ఎఐటియుసి వర్కింగ్ ప్రెసిడెంట్ డి.రామ్మూర్తి, టిఎన్టియుసి జిల్లా అధ్యక్షులు కుసుమ శ్యాంసుందర్, ఐఎన్‌టియుసి జిల్లా నాయకులు మైముదా, ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు రాజేందర్, బిఆర్‌టియు జిల్లా నాయకులు నాయిని రవి, అధ్యక్షత వహించారు.ఈ సదస్సులో రవి, బొట్ల చక్రపాణి, పుల్లా అశోక్ తదితరుల పాల్గొన్నారు.



## నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా కార్మిక వర్గం ఐక్యంగా పోరాడాలి

ఎఐటియుసి మేడే పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్సీ సత్యం



**ప్రజాపక్షం/నల్లగొండ ప్రతినిధి :** నాలుగు లేబర్ కోడ్‌ల అమలు వల్ల కార్మికుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారబోతునందున కార్మిక వర్గం ఐక్యంగా పోరాడాలని ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం పిలుపు నిచ్చారు. నల్లగొండ ఎఐటియుసి జిల్లా కార్యాలయంలో 139వ మేడే పోస్టర్‌ను ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం శనివారం ఆవిష్కరించి మాట్లాడుతూ అమెరికాలోని చికాగో నగరంలో కార్మికుల రక్తంతో తడిసిన పోరాట దినోత్సవం మేడేను కార్మికులు జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్మికులు కొట్లాడి సాధించుకున్న అనేక కార్మిక చట్టాలను రద్దు చేస్తూ, పనిగంటలను కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా 12 గంటలుగా మార్చుటకు కేంద్ర ప్రభుత్వం లేబర్‌కోడ్‌లను ముందుకు తెచ్చిందని విమర్శించారు. నేడు దేశంలో అసంఘటితరంగా కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా వారికి కనీసం పని భద్రత, ఎలాంటి సౌకర్యాలు లేవని, కనీస వేతనాలకు నోచుకోక వారు దుర్భర జీవితం కొనసాగిస్తున్నారని అన్నారు. ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ స్కీమ్ వర్కర్ల ను క్రమబద్ధీకరించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. మేడే సందర్భంగా అన్ని గ్రామాల్లో మండల కేంద్రాల్లో పని ప్రదేశాల్లో జెండాలు ఎగురవేయాలని, పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు కెఎస్ రెడ్డి, పాణెం వెంకటరావు, డివిజన్ కార్యదర్శి విలెనిన్, భవన నిర్మాణ కార్మిక సంఘం పట్టణ అధ్యక్షులు గుండె రవి,జి నరేందర్,ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి ఎన్ఆర్‌సి రాజు, వెంకన్న, అంజయ్య, కె.రాజు తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్‌లో ఉన్న ఉపాధి కూలీల డబ్బులు చెల్లించాలి : సాబీర్ పాషా



**ప్రజాపక్షం/సుజాతనగర్ :** పెండింగ్‌లో ఉన్న ఉపాధి కూలీల డబ్బులు చెల్లించాలని, మెప్మా ద్వారా యువతకు పేదలకు పని కల్పించాలి అని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె సాబీర్ పాషా అన్నారు. ఉపాధి కూలీలతో కలిసి సమస్యలపై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేస్ వి.పాటిల్‌కు సోమవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలతో పాటు సుజాతనగర్ మండలంలోని ఏడు గ్రామ పంచాయతీలను సుజాతనగర్, నాయకులగూడెం, కోమటిపల్లి, లక్ష్మి దేవి పల్లి, మంగపే ట, నరసింహసాగర్, నిమ్మలగూడెం గ్రామపంచాయతీలను కలుపుతూ ప్రభుత్వం కార్పొరేషన్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పారిశ్రామికంగా ఈ ప్రాంతం అభివృద్ధి చేయడం కోసం ఉద్యోగ, ఉపాధి కోసం కార్పొరేషన్ ఏర్పాటు జరిగిందన్నారు. ప్రభుత్వం కార్పొరేషన్ ఏర్పాటు చేసిన గ్రామాలలో నిధులు మంజూరు చేసి ఉపాధి కల్పించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి వచ్చే మెప్మా నిధులను గ్రామీణ ప్రాంతాలకు వెంటనే విడుదల చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి భూక్యా దస్రు, సిపిఐ జిల్లా సమితి సభ్యులు జక్కుల రాములు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తాళ్ళూరి పాపారావు, మండల అధ్యక్షులు మదన్‌సింగ్, ఏఐటియూసి మండల అధ్యక్షులు వీర్ల మల్లేష్, నాయకులు బొడ్డు కేశవరావు, వీర్ల దుర్గా ప్రసాద్, మూడు గణేష్, వీర్ల లింగేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం

REGIONAL NEWS

మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్

## జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలిసిన ఎస్‌పి



**ప్రజాపక్షం/నారాయణపేట్ :** నారాయణపేట జిల్లాకు నూతన జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా వచ్చిన బోయ శ్రీనివాసులును జిల్లా ఎస్‌పి యోగేష్ గౌతమ్, డిఎస్‌పి ఎన్.లింగయ్యలు శనివారం కోర్టు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందజేశారు. జిల్లాలో నేరాల నమోదు దర్యాప్తు, కోర్టు కేలండర్ నెంబర్, కేసు ట్రయల్స్, లోక్ అదాలత్ నిర్వహణ, కేసులలో నేరస్తులకు శిక్షల అమలు తదితర అంశాల గురించి చర్చించారు. కోర్టు అధికారులు పోలీసులు సమన్వయంతో పనిచేసి త్వరిత గతిన కేసుల పరిష్కారం చూపాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి అన్నారు. కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆకుల బాలప్ప తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు అండగా ప్రజాప్రభుత్వం

**ప్రజాపక్షం/ఊర్కొండ :** కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అండగా ఉండి ప్రతి పేదవాడికి వైద్యం అందించడానికి కృషి చేస్తుందని కాంగ్రెస్‌పార్టీ రాష్ట్రనాయకులు జకినాలపల్లి గ్రామమాజీ సర్పంచ్ తలసాని అనిల్‌రెడ్డి అన్నారు. జకినాలపల్లి గ్రామానికిచెందిన సత్యం రూ.60వేలు, అమ్మపల్లితండాకి చెందిన అనిత రూ.52వేలు, జకినాలపల్లి గ్రామానికిచెందిన నరేందర్‌రెడ్డి రూ.20వేలు సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను స్థానిక నాయకులు అందజేశారు. కార్యక్రమంలో చంద్రయ్య, మహేష్, రాంగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందని ఎంపిడిఓ వెంకట్‌రాములు అన్నారు. శనివారం మండల పరిధిలోని మార్చాల గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 65 ఇండ్ల దరఖాస్తులను పరిశీలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల పర్యవేక్షకులు విజయ భాస్కర్, సహాయకులు ఫిరోజ్‌ఖాన్, రాఘవేందర్, పంచాయతీ కార్యదర్శి రమేష్, ఇందిరమ్మ గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు



**ప్రజాపక్షం/వెల్దండ :** మండలపరిధిలోని రాచూర్ గ్రామంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో నూతన విద్యుత్ స్తంభాలను శనివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు గున్నేళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ ఎమ్మెల్యే సహకారంతో గ్రామాన్ని అన్నివిధాలుగా అభివృద్ధిపరుస్తామన్నారు. కార్యక్రమంలో గంగధారి రమేష్, శ్రీనివాస్, రాజు, సాయిలు, వెంకటమ్మ, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

## ఇండ్ల నిర్మాణ పనులు పరిశీలన

**ప్రజాపక్షం/ఊర్కొండ :** ఇందిరమ్మ ఇండ్ల పైలట్ ప్రాజెక్టు గ్రామమైన నర్సంపల్లి గ్రామాన్ని సందర్శించి ఇప్పటికే నిర్మాణ పనులు ప్రారంభించి బేస్‌మెంట్‌లెవల్ పూర్తిచేసి ఇండ్ల పనులను, ఇంకాప్రారంభంకానివారికి అవగాహనకల్పించి త్వరగా ఇంటిపనులు ప్రారంభించుటకు సూచించడం జరిగిందని ఎంపిడిఓ తెలిపారు. సందర్శనలో నర్సింహ్మా , ఏపిఓ భారతమ్మ, మంజుల, ఇబ్రహీం, పంచాయతీ కార్యదర్శులు కళమ్మ పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు పరామర్శ



**ప్రజాపక్షం/బిజినేపల్లి :** మండలంలోని అల్లీపూర్‌గ్రామానికి చెందిన దేగశేఖర్ తల్లి అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మర్రిజనార్ధన్‌రెడ్డి శనివారం వారి ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. బిఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు వలిశెట్టికృష్ణయ్య తండ్రి బాలస్వామి మృతిచెందారు. ఆయన ఇంటికివెళ్లి పరామర్శించారు. ఆయన వెంట మాజీ ఎంపిపి శ్రీనివాస్‌గౌడ్, బిఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పులేందర్‌రెడ్డి, మాజీరైతుబంధు అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

## హోటళ్లలో అధికారుల తనిఖీలు



**ప్రజాపక్షం/అచ్చంపేట :** పట్టణంలో ఉన్న పలు హోటళ్లపై శనివారం జిల్లా ఫుడ్‌ఇన్‌స్పెక్టర్ మనోజ్‌కుమార్ తనిఖీ చేసి కేసులు నమోదు చేశారు. ఈసందర్భంగా ఆయన హోటళ్లు, రెస్టారెంట్లు, చాట్‌బండారులు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో తనిఖీ చేశారు. ఆహార పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కొన్ని హోటళ్లలో శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపిస్తున్నట్లు తెలిపారు.

## ఇందిరమ్మ ఇండ్లస్థలాల పరిశీలన



**ప్రజాపక్షం/వంగూర్ :** మండల పరిధిలోని ఉల్పర, పోతిరెడ్డిపల్లి గ్రామాలలో శనివారం ఎంపిడిఓ ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్దిదారుల ఇండ్లస్థలాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ ప్రభుత్వం నియమాలకు అనుగుణంగానే ఇండ్ల నిర్మాణాలు చేపట్టాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శులు రాజు, రాజశేఖర్, మాజీసర్పంచ్ శంకర్‌యాదవ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజాపక్షం /వీపనగండ్ల :** రైతులు తమ పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్మకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని మహిళా సమైక్య సిపిఎం బుచ్చన్న, అధ్యక్షురాలు శాంతమ్మ, కాంగ్రెస్ పార్టీ నాయకులు గోపాల్ నాయక్ అన్నారు. శనివారం మండల పరిధిలోని కోర్లకుంటలో మహిళా సమైక్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాల్లోని రైతులకు మద్దతు ధర లభిస్తుందని, కష్టపడి పండించిన ధాన్యాన్ని రైతులు దళారులకు అమ్మవద్దని సూచించారు. సన్న రకం ధాన్యానికి కూడా బోనస్ లభిస్తుందని అన్నారు. గ్రామ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మంగమ్మ, బుక్ కీపర్ శృతి, నాయకులు రామనంద రావు తదితరులు ఉన్నారు.

# మానవ అక్రమ రవాణా, వెట్టిచాకిరి నిర్మూలనకు కృషి

### జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.పాపిరెడ్డి



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** మానవ అక్రమ రవాణా, వెట్టిచాకిరి నిర్మూలనకు అన్ని శాఖలు పరస్పర సహకారం, సమన్వయంతో పనిచేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.పాపిరెడ్డి అన్నారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార అదేశాలననుసరించి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులకు మానవ అక్రమ రవాణా, వెట్టిచాకిరి నిర్మూలనపై నిర్వహించిన అవగాహన సమావేశంలో జిల్లా ప్రధాన న్యాయ మూర్తి బి.పాపిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, ఎస్‌పి డి. జానకి, జిల్లా న్యాయ సేవాధికర సంస్థ కార్యదర్శి డి. ఇందిరలతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ మహబూబ్ నగర జిల్లాను మానవ అక్రమ రవాణా, వెట్టి చాకిరి రహిత జిల్లాగా రూపొందించాలన్నారు. మానవ అక్రమ రవాణా, వెట్టి చాకిరి నేరం అన్నారు. చిన్నపిల్లలు, మహిళల మానవ అక్రమ రవాణా గుర్తించేందుకు, ఇటువంటి సంఘటనలు. జరుగకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని, సమస్య వచ్చినట్లయితే ఏ విధంగా చట్ట పరంగా చర్యలు తీసుకోవాల్సిన విషయాలపై శిక్షణలో తెలుసుకోవాలని సూచించారు. శిక్షణ కార్యక్రమంలో తెలుసుకున్న చట్టాలు క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు చేసే విధంగా కార్యాచరణతో సిద్ధంగా ఉండాలని సూచించారు. జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి మాట్లాడుతూ చిన్నపిల్లలు, మహిళలను మానవ అక్రమ రవాణా చేయకుండా పటిష్ట చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మానవ అక్రమ రవాణా, బాల కార్మికుల వెట్టి చాకిరి నిర్మూలనకు ప్రభుత్వం చట్టాలు రూపొందించినట్లు తెలిపారు. చైల్డ్ ప్రొటెక్షన్, పోలీస్ కార్మిక శాఖ వైద్య ఆరోగ్య శాఖలు, విద్య శాఖలు వారికి వారి బాధ్యతలు నిర్వర్తించి వారికి కావాల్సిన సహాయం అందించాలన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఇందిర మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులకు తమ వంతుగా సహకారం అందిస్తామని తెలిపారు. శిక్షణ కార్యక్రమానికి డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్, ఎన్.చంద్రశేఖర్‌గౌడ్, జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారిని జరీనా బేగం, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె కృష్ణ ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ (ఎన్జీవో) జోబి ఏసుదాస్, పోలీస్ అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మానవాళికి వరం సైన్స్

### 'డ్రీం ఫోర్స్ ' ఫౌండేషన్ చర్చా వేదికలో విద్యార్థులు

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి:** సైన్స్ మానవాళికి వరమని దానిని సద్వినియోగం చేసుకుంటే అద్భుత ఫలితాలను పొందవచ్చునని విద్యార్థులు అభిప్రాయపడ్డారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని వాగ్దేవి జూనియర్ కళాశాలలో గ్రీన్ ఫోర్స్ ఫౌండేషన్ డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ల్యాడ్ జిల్లా విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో కొనసాగుతున్న వేసవి సైన్స్ శిక్షణా శిబిరంలో శనివారం విద్యార్థులు సైన్స్ మానవాళిక పరమా శాపమా అనే అంశంపై మాట్లాడారు. సైన్స్ వల్ల సాంకేతికత పెరిగిందని యంత్రాల వినియోగంతో ఉపాధి కోల్పోవాల్సి వస్తుందరని కొంత మంది విద్యార్థులు అభిప్రాయం వ్యక్తం చేయగా మరి కొంతమంది విద్యార్థులు సైన్స్ ద్వాకా ఎంతో ప్రగతిని సాధించామని సరైన రీతిలో వినియోగించుకుంటే అనేక రకల ప్రయోజనాలను పొందవచ్చన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కంచె గచ్చిబౌలిలోని నాలుగొందల ఎకరాల అడవిని అభివృద్ధి పేరుతో నాశనం ధ్వంసం చేస్తే వన్యప్రాణుల పరిస్థితి ఏం కావాలని విద్యార్థిలు ప్రశ్నించడం అందరినీ ఆలోచింపజేసింది. అభివృద్ధి కారణంగా సేంద్రీయ వ్యవసాయం దెబ్బతిందని రసాయనికి ఎరువులతో నేల నిస్సారంగా మారుతుందని యంత్రాల ప్రవేశంతో ఉపాధి కోల్పోవాల్సి వస్తుందన్న చేయాలను ఈ చర్చలో ప్రశ్నించారు. ఈ చర్చా వేదికకు డ్రీం ఫోర్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు టిఎన్ శ్రీధర్ గుముడాల చక్రవర్తి గౌడ్ కరుణాకర్ అనురాధ వ్యవహరించారు.




# అర్హులకే ప్రభుత్వ సంక్షేమ పథకాలు





### కలెక్టర్ సిక్తా పట్నాయక్

**ప్రజాపక్షం/నారాయణపేట్ :** ఇందిరమ్మ ఇండ్ల పథకానికి అర్హులను మాత్రమే ఎంపిక చేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. శనివారం కలెక్టర్ జిల్లాలోని కొత్త పల్లి మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. గ్రామానిక చెందిన కొండన్న అనే దరఖాస్తుదారుని ఇంటికి వెళ్లి ఇంటి పరిస్థితిని చూశారు. ఇంటి పై కప్పు బండ్ల రాళ్ళతో ఉందని హౌసింగ్ శాఖ ఏఈ నిర్ధారించగా, మిగతా వివరాలను పూర్తిగా పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. ఇండ్ల పథకానికి మహిళా పేరుతోనే దరఖాస్తు చేయాల్సి ఉండేదని హౌసింగ్ అధికారి తెలిపారు. కొండన్న బదులుగా ఆయన భార్య పేరిట ఇల్లు వచ్చేలా చూడాలని గ్రామ మాజీ ప్రజాప్రతినిధి ఒక్కరు అధికారులను కోరారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ శంకర్, తహసీల్దార్ జయ రాములు, రెవెన్యూ, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

### భూభారతి చట్టంతో భూసమస్యలకు పరిష్కారం

భూభారతి చట్టంతో భూ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. శనివారం జిల్లాలోని కొత్తపల్లి, గుండుమాల్ మండల కేంద్రాలలో రెవెన్యూ శాఖ ఏర్పాటు చేసిన భూ భారతి అవగాహన సదస్సుకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూ భారతి చట్టం ద్వారా రైతులకు సంబంధించిన అన్ని భూ సమస్యలను పరిష్కరించడమే కాకుండా, వారికి భూధార్ కార్డును ఇవ్వడం జరుగుతుందన్నారు. సదస్సులలో జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ వార్ల విజయకుమార్, కోస్గి సింగిల్ మెంట్ అధ్యక్షులు భీమ్ రెడ్డి, కొత్తపల్లి, గుండుమల్ తహసిల్దారులు జయరాములు, భాస్కర స్వామి, ఎంపీడీవో వేణుగోపాల్ రెడ్డి, ఏవో రేష్మారెడ్డి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

### నిబంధనల మేరకే ఇసుక రవాణాకు అనుమతులు

జిల్లాలో గుర్తించిన ప్రాంతాలలో టీజీఎండిసి ద్వారా నిబంధనల మేరకు ఇసుక రవాణాకు అనుమతులు ఇవ్వాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో కలెక్టర్ అధ్యక్షతన డిస్టిక్ లెవెల్ స్యాండ్ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఇసుక తరలింపు విషయంలో మైనింగ్ , రెవెన్యూ, భూగర్భ జల శాఖ, సర్వే ల్యాండ్, నీటి పారుదల, వ్యవసాయ శాఖల అధికారుల నివేదికలు, అభిప్రాయాలను ఆమె అడిగి తెలుసుకున్నారు. మైనింగ్ ఏడి సంజయ్ కుమార్, ఎస్పీ యోగేష్ గౌతమ్ మాట్లాడుతూ రీచ్‌ల నుంచి రాత్రి వేళలో ఇసుక అక్రమ రవాణా జరగకుండా నిఘా పెట్టాలని ఆదేశించారు. సమావేశంలోఅదనపు కలెక్టర్ బేన్, షోలోమ్, ఆర్డీవో రామచందర్ నాయక్, డిఎస్‌సి నల్లపు లింగయ్య, జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్ ఆర్డీవో మేఘా గాంధీ తదితరులు పాల్గొన్నారు.

## పర్యాటకులపై ఉగ్రదాడులు హేయమైన చర్య

### సిపిఐ జిల్లా కార్యదర్శి బి.బాలకిషన్

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** కశ్మీర్‌లోని పహాల్గంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడులు హేయమని సిపిఐ జిల్లా కార్యదర్శి బి.బాలకిషన్ అన్నారు. సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో పార్టీ ఆఫీసు నుంచి తెలంగాణ చౌరస్తా వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి ఘటనలో మరణించిన పౌరులకు నివాళులర్పించారు. బాలకిషన్ మాట్లాడుతూ సామాన్య పౌరులపై ఉగ్రవాదులు దాడులు హేయమైన చర్య అన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొండపల్లి రాము యన్ఎఫ్ఐడబ్లూ జిల్లా ప్రధాన కార్యదర్శి కే.పద్మావతి, జిల్లా కౌన్సిల్ సభ్యులు చాంద్‌బాషా, కోట కదిరి నరసింహ, ఏఐఎస్ఎఫ్ కార్యదర్శి లక్ష్మణ్, సత్యనారాయణరెడ్డి, పూజ, ఇందిర, అరుణ, మహేశ్, అంజి, శ్రావణ్‌కుమార్ , ఆనంద్ , సునీల్ కుమార్, విగ్నేష్, పవన్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

**నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** ఉగ్రవాద అంతానికి సమైక్యంగా పోరాడుదామని సిపిఐ రాష్ట్ర సమితిసభ్యులు వార్లవెంకటయ్య అన్నారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో జమ్మూకాశ్మీర్‌లోని పహాల్గామ్‌లో జరిగిన పాకిస్తాన్ తీవ్రవాదుల చేతిలోబలైన భారతీయటూరిస్టుల మరణకాండకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్రసమితి సభ్యులు వార్లవెంకటయ్య మాట్లాడుతూ ఎన్‌డిఏ ప్రభుత్వం వైఫల్యంకారణంగానే దేశంలో తీవ్రవాదులు రెచ్చిపోతున్నారని వారినికట్టడం చేయడంలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ, కేంద్రహోంమంత్రి అమిత్‌షా విఫలమయ్యారన్నారు. దేశ రక్షణను గాలికివదిలేసి ప్రజలను కాపాడటంలో విఫలమైందన్నారు. కేంద్రప్రభుత్వం ఇప్పటికైనా కళ్లుతెరిచి టెర్రరిస్టుమూలాలను సమూలంగా నిర్మూలించాలన్నారు. కార్యక్రమంలో కేశవులుగౌడ్, జిల్లాసమితి సభ్యులు కృష్ణాజి, బండి లక్ష్మిపతి, శంకర్‌గౌడ్, రవీందర్, కుతుబుద్దీన్, మధుగౌడ్, రామస్వామి, శివకృష్ణ, శ్రీను, సురేష్, కొండయ్య, బుగ్గస్వామి, నిరంజన్ పాల్గొన్నారు.




## 'ఉపాధి' చట్టాన్ని కాపాడుకుందాం



### వ్యవసాయ కార్మిక సంఘం వనపర్తి జిల్లా కార్యదర్శి ఆంజనేయులు

**ప్రజాపక్షం/వీపనగండ్ల :** ఉపాధి హామీ చట్టాన్ని రక్షించుకునేందుకు పోరాటాలు చేస్తేనే ప్రభుత్వాలు దిగవస్తాయని వ్యవసాయ కార్మిక సంఘం వనపర్తి జిల్లా కార్యదర్శి ఎం.ఆంజనేయులు పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర విస్తృత సమావేశాలు నారాయణపేట జిల్లా మరికల్ పట్టణంలో ఏప్రిల్ 26,27 తేదీలలో రాష్ట్ర విస్తృత సమావేశాలు జరుగుతున్న సందర్భంగా మండలం నుంచి ప్రజలు బహిరంగ సభకు తరలి రావాలని వ్యవసాయ కార్మిక సంఘం వనపర్తి జిల్ల కార్యదర్శి ఎం. ఆంజనేయులు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎండి. మహబూబ్ పాషా కోరారు. ఈ సందర్భంగా వారు గోవర్ధనగిరిలో కూలీలతో మాట్లాడుతూ ఉపాధి కూలీల సమస్యల పరిష్కారం కోసం ప్రమాదంలో బీజేపీ ప్రభుత్వం పడేసిన ఉపాధి హామీ చట్టాన్ని రక్షించుకునేందుకు పోరాటాలు చేస్తేనే ప్రభుత్వాలు దిగివస్తాయని, ఉపాధి కూలీల సౌకర్యాలను తగ్గిస్తూ అఖిరికి ఉపాధి పని ఎత్తివేసే కుట్ర జరుగుతుందని అన్నారు. రెండు రోజుల పాటు జరిగే రాష్ట్ర విస్తృత సమావేశాలు కేంద్ర బీజేపీ ప్రభుత్వం చేసే ఉపాధి పనిని ఉప సంహరించుకునే కుట్రను భగ్నం చేస్తూ పెద్ద ఎత్తున ప్రజా సమీకనేసి పోరాటాలకు సిద్ధం చేసేందుకు ఈ విస్తృత సమావేశాలు వినియోగించుకోవడం జరుగుతుందని, కూలీలు అధిక సంఖ్యలో పాల్గొని భవిష్యత్తులో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో తీసుకునే పోరాటాలకు కలిసి రావాలని పిలుపునివ్వడం జరిగింది.

# భూ సమస్యలకు పరిష్కారం భూభారతి

### ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి





**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** భూమికి సంబంధించిన అన్ని సమస్యలకు పరిష్కారం భూ భారతి చట్టం ద్వారా లభిస్తుందని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ నగరపాలక పరిధిలో యుబి గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన భూ భారతి అవగాహన సదస్సును జిల్లా కలెక్టర్ విజయేందిర బోయితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నం పెట్టే రైతన్నను రాజు చేయాలన్నదే ప్రజా ప్రభుత్వం లక్ష్యం అని ఆయన స్పష్టం చేశారు. భూ భారతి చట్టంతో రికార్డుల్లో చిన్న చిన్న ఇబ్బందులు ,పొరపాట్లు, ఉన్నా విస్తీర్ణంలో గాని, తమ పేరులో గాని, వారసత్వం విషయంలో గాని ఏవైనా ఇబ్బందులు ఉంటే తహసీల్దార్ ఆఫీస్‌కు పోయి సరి చేసుకోవచ్చు అని ఆయన సూచించారు. ధరణి వల్ల తప్పులు జరిగాయని, అందుకే మళ్ళీ ఎట్టి పరిస్థితుల్లోనూ రైతు నష్టపోరాదని 14 నెలలు శ్రమించి, రైతులకు మేలు చేసే విధంగా భూ భారతి చట్టం తెచ్చామని ఆయన స్పష్టం చేశారు. భూ భారతి చట్టం గురించి ప్రతి ఒక్కరికి బాధ్యత తీసుకొని గ్రామాల్లో వివరించాలని ఆయన చెప్పారు. జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి మాట్లాడుతూ భూభారతి చట్టం ద్వారా భూ సమస్యలు పరిష్కారం అవతాయని భూ భారతి చట్టం రైతులకు మేలు చేస్తుందన్నారు. భూ సమస్యలు పరిష్కరించే అధికారం ప్రభుత్వ రెవెన్యూ అధికారులకే ఇచ్చిందన్నారు. భూ భారతి చట్టం ద్వారా భూ సమస్యలకు రెవెన్యూ అధికారులు శాశ్వత పరిష్కారం కల్పిస్తారన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత మధుసూదన్ రెడ్డి అదనపు జిల్లా కలెక్టర్లు, మోహన్ రావు శివేంద్ర ప్రతాప్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్ నాయకులు బుద్దారం డిఆర్డీవో నర్సింహులు, ఆర్డీవో నవీన్, తహసీల్దార్ ఘన్సీరాం తదితరులు పాల్గొన్నారు.

### రైతు సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

రైతు సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. మహబూబ్‌నగర్ నియోజకవర్గంలోని హన్వాడ మండలం బుద్దారం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతు సంతోషంగా ఉంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందని, అందుకే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారధ్యంలోని ప్రజాప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను రైతుల కోసం అమలు చేస్తుందన్నారు. రైతు భరోసా ఇందిరమ్మ ఆత్మీయ భరోస, రైతు రుణమాఫీ రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తూ రైతు ఉన్నతికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, హన్వాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వి.మహేందర్, కాంగ్రెస్ నాయకులు బుద్దారం సుధాకర్‌రెడ్డి, కృష్ణయ్య యాదవ్, కె,లక్ష్మన్, రమేష్ యాదవ్, శ్రీశైల్యం యాదవ్, ప్రశాంత్ పాల్గొన్నారు.



# స్థానికం

REGIONAL NEWS

నల్లగొండ, సూర్యాపేట యాదాద్రి, గద్వాల

## ఉగ్రదాడిని ఖండించిన సిపిఐ




**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల ప్రతినిధి:** జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని నల్లకుంట రాజీవ్ మార్గ్‌లో ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నిన దిస్తూ మరణించిన కుటుంబాలకు సిపిఐ ఎఐటియుసి ఆధ్వర్యంలో ఘనం గా క్యాండిల్ నివాళులు అర్పించారు. ఉగ్రవాదులు అమాయక ప్రజలను చంపే పిరికిపంద చర్యకు పాల్పడ్డారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయు లు, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి రాంనాథ్, హమాలీ సంఘాల నాయకులు నారాయణ రాజు, సిపిఐ నాయకులు విరేష్ కృష్ణతో పాటు 30మంది నాయకులు, కార్యకర్తలు కార్మికులు పాల్గొన్నారు.



## ఉగ్రవాదుల దాడి హేయమైన చర్య

సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఉస్తేల సృజన

**ప్రజాపక్షం/చింతలపాలెం:** జమ్ము కాశ్మీర్‌లోని పహల్గాం వద్ద పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడి హేయమైన చర్య అని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఉస్తేల సృజన అన్నారు. శనివారం చింతలపాలెం మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారికి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతీయులపై ఉగ్రవాదులు జరిపిన దాడిని భారత కమ్యూనిస్టు పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఉగ్రవాదం దేశానికి ప్రమాదకర మని, దినిని నివారించేందుకు ప్రపంచ దేశాలు ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉస్తేల నారాయణరెడ్డి, మండల కార్యదర్శి చింతిరాల రవి, గ్రామశాఖ కార్యదర్శి అంకరాజు, సిపిఐ నాయకులు గొనె చిన్న అంకయ్య, షేక్ జియాలుద్దీన్, భిమిశెట్టి సత్యం, గంధంకొండ, గంధం రంగయ్య, గొంగరెడ్డి వెంకటరెడ్డి, భూక్య రామారావు, చింతలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## భారతదేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే



**ప్రజాపక్షం/ సంస్థాన్ నారాయణపురం :** మండల కేంద్రంలో భగత్ సింగ్ విగ్రహం వద్ద అఖిల భారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ జిల్లా రెండవ మహాసభలు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు కొందూరు విప్లవ్ మాట్లాడుతూ భారతదేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని యువత ఈ దేశానికి వెన్నెముక లాంటిదని అన్నారు. దేశ సమగ్రత సమైక్యతను పరిరక్షించడానికి సమరశీల పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. పహల్ గాం లోని పర్యాటకులను అతి కిరాతకంగా చంపిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సినీ నటులకు వై కేటగిరి భద్రతను కల్పించిన కేంద్రం ప్రభుత్వం పర్యాటకులకు భద్రత కల్పించడంలో విఫలమైందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మారగోని నాగరాజ్, శనిగల నరేష్, కొందూరు వంశీ, రావుల ప్రశాంత్, కొందూరు రాజు, కొందూరు శ్రవణ్, శివ చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లు



**ప్రజాపక్షం/చండూరు:** ఇల్లు లేని ప్రతి నిరుపేద కుటుంబానికి ప్రభుత్వమే ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇవ్వాలని సిపిఐ చండూరు మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం చండూరు మున్సిపాలిటీలోని అంగడిపేట సిపిఐ శాఖ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడుతూ చండూరు మున్సిపాలిటీలో ఇల్లులేని ప్రతి పేద కుటుంబాన్ని గుర్తించి ప్రభుత్వమే ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అర్హులైన ప్రతిఒక్కరికి నూతన రేషన్ కార్డులు ,ఆసరా పెన్షన్ లు మంజూరు చేయాలని అన్నారు. అంగడిపేటలో భారత కమ్యినిస్టు పార్టీ బలోపేతం కోసం ప్రతి కార్యకర్త సైనికుడిలా కష్టపడి పని చేయాలని పిలుపునిచ్చారు. సిపిఐ అంగడిపేట నూతన శాఖ కార్యదర్శిగా అందిర్క పరమేషను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సమావేశంలో మండల పార్టీ కార్యవర్గ సభ్యులు జెల్ల శ్రీను, దోటి వెంకన్న ,కర్నాటి వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

## మేడే స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం




**ప్రజాపక్షం/సూర్యాపేట:** మేడే స్ఫూర్తితో కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలని ఎఐటియుసి నియోజకవర్గ కార్యదర్శి నిమ్మల ప్రభాకర్ పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ ధర్మభిక్షం భవన్‌లో చామల అశోక్ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడారు. 139వ మేడే వేడుకలను కార్మికవర్గం ఘనంగా నిర్వహించాలన్నారు. బ్రిటిష్ కాలం నుండి కార్మికులు సాధించుకున్న హక్కులను కేంద్రం అధికారంలో ఉన్న ప్రభుత్వ చట్ట సవరణ ద్వారా నిర్వీర్యం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. 44 కార్మిక చట్టాలను 4 కోడ్‌లుగా విభజించి కార్మికులకు హక్కులు లేకుండా, కార్పొరేట్లకు అనుకూలంగా చట్టాలు సవరిస్తుండటాన్ని కార్మిక వర్గం తీవ్రంగా వ్యతిరేకిస్తుందని ఆయన స్పష్టం చేశారు. పరిశ్రమల అమ్మకాన్ని ఆపాలని ప్రభుత్వ రంగ పరిశ్రమలన్నింటికి ప్రభుత్వం ఆధీనంలో నిర్వహించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఇటీవ జమ్ముకాశ్మీర్ పహల్గంలో ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారికి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, రిక్షా వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు పెండ్ర కృష్ణ, టైలరింగ్ యూనియన్ అధ్యక్షులు దీకొండ శ్రీనివాస్, పున్నం రమేష్, మల్లికార్జున్ రెడ్డి, రవి, టిప్పర్ యూనియన్ అధ్యక్షులు నరేష్ యాదవ్ పాల్గొన్నారు.

## మైనర్‌లకు వాహనాలు ఇవ్వొద్దు

**ప్రజాపక్షం/సూర్యాపేట:** వేసవి సెలవుల్లో పిల్లలు ఇంటి వద్దనే ఉంటారని వారి పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని జిల్లా ఎస్‌పి కె నరసింహ అన్నారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ గత కొద్ది రోజులుగా పోలీసుల తనిఖీల్లో మైనర్ పిల్లలు వాహనాలు నడుపుతూ పట్టుబడుతున్నారని వారికి తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వొద్దని సూచించారు. విద్యార్థులపై కేసులు నమోదు అయిదే భవిష్యత్తులో ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందన్నారు. వాహనాలు నడుపుతూ పిల్లలు ప్రమాదాలకు గురైతే వారి జీవితం ఇబ్బందికంగా మారుతుందన్నారు. ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలను పాటించాలని చెప్పారు.

# భూమి ఉన్న ప్రతి రైతుకూ భూ భద్రత

ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



**ప్రజాపక్షం/గుండాల:** భూమి ఉన్న ప్రతి రైతుకు భూ భద్రత కల్పించడమే ప్రధాన ధ్యేయంగా భూ భారతి చట్టాన్ని ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిందని ప్రభుత్వ విప్, ఆలేరు ఎంఎల్‌ఏ బీర్ల అయిలయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలోని స్థానిక తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన భూ భారతి చట్టం 2025 అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరై ఆయన మాట్లాడుతూ సామాన్య రైతులకు అర్థమయ్యే విధంగా భూ భారతి పోర్టల్ ఉంటుందని, భూ భారతి చట్టం ద్వారా భూ సమస్యలు ఉన్న ప్రతి రైతుకు శాశ్వత పరిష్కారం చూపుతాం అని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హనుమంతరావు, అడిషనల్ కలెక్టర్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు సంజీవ రెడ్డి, ఆలేరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాదగిరి గౌడ్, మాజీ ఎంపిపి కృష్ణారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు రాంరెడ్డి, హరితాదేవి, డిటి నీలిమ, సిపిఎం జిల్లా నాయకులు రాజు, పిఏసిఎస్ చైర్మన్ బిక్షం, నాయకులు పాల్గొన్నారు.

### సామాన్య రైతుకు అర్థమయ్యేలా భూభారతి పోర్టల్ : ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/బీబీనగర్ :** రైతాంగానికి భరోసానిస్తూ, భద్రత కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం భూభారతి చట్టం రూపొందించడం జరిగిందని భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం బీబీనగర్ మండల కేంద్రంలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భూ భారతి అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ హనుమంతరావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డితో కలిసి భూభారతి అవగాహన సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ భూభారతి అవగాహన సదస్సులో భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రైతుల భూముల పరిరక్షణ బాధ్యత ప్రభుత్వానిదే అని దానికి ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. జిల్లా కలెక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ ప్రతి రైతుకు అర్థమయ్యే విధంగా సెక్షన్ల వారీగా భూభారతి చట్టాన్ని రైతులకు క్షుణ్ణంగా వివరిస్తూ అవగాహన కల్పించారు. గ్రామాలలో అవగాహన లేని రైతులకు భూభారతి చట్టంతో అవగాహన కల్పించి భూ సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కృష్ణ రెడ్డి, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ కసిరెడ్డి నారాయణ రెడ్డి, సింగల్ విండో చైర్మన్ మెట్టు శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ గడ్డం బాలకృష్ణ గౌడ్, తాసిల్దార్ భగత్, ఎంపీడీవో వై.శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.



## విద్యుత్ స్తంభాన్ని ఢీకొని ఇద్దరు యువకులు మృతి



**ప్రజాపక్షం/మునుగోడు:** బైక్ పై అతివేగంగా వెళుతూ విద్యుత్ స్తంభానికి ఢీకొని ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన శుక్రవారం రాత్రి మండలంలోని ఊకోండి గ్రామ శివారులో చోటుచేసుకుంది తెలుగులో గ్రామస్తులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అదే గ్రామానికి చెందిన బింగి మత్స్యగిరి (21) మర్రి మురళి(21) ఇద్దరు స్నేహితులు కలిసి పక్కనే ఉన్న తాళ్ల వెల్లంల గ్రామానికి వెళుతుండగా అతివేగంగా వెళ్లి రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభానికి ఢీకొట్టడంతో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ ఇరుగు రవి సంఘటన స్థలానికి చేరుకొని పంచనామ నిర్వహించి శవ పరీక్షల నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## వివాహేతర సంబంధం, ప్రియుడి మోజులో భర్త హత్య

మర్డర్ కేసులో వీడిన మిస్టరీ ...నలుగురు నిందితులు అరెస్ట్

అక్రమ సంబంధమే హత్యకి కారణమని తేల్చిన పోలీసులు

**ప్రజాపక్షం/ జోగులాంబ గద్వాల ప్రతినిధి:** వరుసకు మామ వరుస అయిన వ్యక్తితో అక్రమ సంబంధం పెట్టుకుని భర్తను హతమర్చిన సంఘటన జోగులాంబ గద్వాల జిల్లాలోని కేటీ దొడ్డి మండలంలో చోటుచేసుకుంది. గత వారం క్రితం బసాపురం శివారులో ఇంకుడు గుంతల కొరకు ఉపాధి కూలీలు పనులు చేస్తుండగా మట్టి కుప్ప నుండి దుర్వాసన రావడంతో పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని అనుమానస్పద స్థితిలో కనిపించడంతో కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ప్రియుడి మోజులో జరిగిన హత్యకు గల కారణాలను గద్వాల సీఐ కార్యాలయంలో డిఎస్పి మొగులయ్య వెల్లడించారు. కేటీదొడ్డి మండలం బసాపురం శివారులో మృతి చెందిన వ్యక్తి నర్సింహులు (28) భార్య పద్మమ్మ వరుసకు మామ అయినా అంజిలప్పతో వివాహేతర సంబంధం పెట్టుకోవడంతో ఈ విషయం భర్తకు తెలవడంతో ఇరువురు మధ్య పలుమార్లు గొడవలు చోట్టు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో ఎలాగైనా తన భర్తను హతమార్చాలని ప్రియుడిని కోరింది. దీంతో అంజలప్ప అతనితో పరిచయం పెంచుకొని మద్యం సేవించేందుకు హనుమప్ప గుట్టకు వెళ్లారు. మద్యం సేవించిన అనంతరం మరో ఇద్దరు సహాయంతో గొంతుకోసి హత్యకు పాల్పడినట్లు డిఎస్పీ తెలిపారు. పోలీసులు వారిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు.




# ప్రపంచసుందరి పోటీదారుల సందర్శనకు ఏర్పాట్లు



**ప్రజాపక్షం/నందికొండ:** ప్రపంచ సుందరి పోటీలలో పాల్గొనే పోటీదారులు మే 12న బుద్ధవనం సందర్శిస్తున్నందున ఏర్పాట్లలో ఎలాంటి లోటు,పాట్లు లేకుండా చూడాలని రాష్ట్ర ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్, ఐఏఎస్ అధికారి లక్ష్మి అన్నారు. మే 12న ప్రపంచ సుందరి పోటీలలో పాల్గొనే వివిధ దేశాలకు చెందిన సుందరీమణులు బుద్ధవనం సందర్శిస్తున్న దృష్ట్యా ఏర్పాట్ల విషయమై శనివారం ఆమె బుద్ధవనం సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి , మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, సంబంధిత శాఖల అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు.కేవలం 15 రోజుల సమయం మాత్రమే మిగిలి ఉన్నందున త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ,ప్రత్యేకించి సివిల్ పనులు అన్నిటిని మే 3 నాటికి పూర్తి చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ప్రపంచ సుందరి పోటీలలో పాల్గొనే వారందరూ బుద్ధవనం రాక సందర్భంగా ప్రపంచం మొత్తం మన వైపు చూస్తున్నదని, దీనిని దృష్టిలో ఉంచుకొని ఏర్పాట్లలో ఎలాంటి లోటు పాట్లు,ఇబ్బందుకు లేకుండా చూడాలన్నారు. అందరూ గర్వపడేలాగా ఏర్పాట్లు చేయాలన్నారు. ముఖ్యంగా బుద్ధవనం పరిసర ప్రాంతాలు, విజయ విహార్ రోడ్డుకిరిపక్కల లైటింగ్, పరిశుభ్రత చేయించాలని చెప్పారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ సమయం తక్కువగా ఉన్నందున త్వరితగతన పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మీడియా ప్రతినిధులతో ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ లక్ష్మి మాట్లాడుతూ మే 3 నాటికి పూర్తి చేస్తామని చెప్పారు. ప్రపంచ సుందరి పోటీదారుల తాత్కాలిక పర్యటన ప్రకారం మే 12 న మధ్యాహ్నం 1 గంటకు వారు హైదరాబాద్ నుండి బయలుదేరి సాయంత్రం 4.30 గంటలకు బుద్ధవనం వస్తారు ,విజయ విహార్ చేరుకొని అనంతరం బుద్ధవనం సందర్శించి అక్కడ ధ్యాన మందిరం, జాతకవనం తదితరాలన్ని సందర్శించిన తర్వాత తిరిగి రాత్రి 7.45 గంటలకు బయలుదేరి హైద్రాబాద్ వెళ్లనున్నారు.మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, బుద్ధవనం ప్రాజెక్టు ఓ ఎస్ డి సుధాన్ రెడ్డి, టూరిజం శాఖ ఎస్ ఈ భాస్కరరావు, సంబంధిత శాఖల అధికారులు,తదితరులు హాజరయ్యారు .

# భూ భారతి చట్టం చరిత్రాత్మక మార్పు



**ప్రజాపక్షం/ఆత్మకూర్(ఎస్):** భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకవచ్చిన భూ భారతి చట్టం చారిత్రాత్మక మార్పు అని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. శనివారం మండలంలోని నెమ్మికల్‌లోని ఎస్‌వి గార్డెన్‌లో రైతులు, ప్రజలకు భూ భారతి 2025పై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధరణిలోని లోపాలను గుర్తించి ఏలా పరిష్కారం చేయాలో కమిటీ ద్వారా ప్రజలు, మేధావులు, నిపుణులు ద్వారా అభిప్రాయలు సేకరించి ముసాయిదాను పబ్లిక్ డోమైన్‌లో పెట్టి ప్రజల నుండి అభిప్రాయాలు, సూచనలు సేకరించి భూ భారతి చట్టాన్ని రూపొందించినట్లు తెలిపారు. గతంలో గ్రామ స్థాయిలో భూ సమస్యలను పరిష్కరించేందుకు విఆర్‌ఓ, విఆర్‌ఎలు ఉండేవారని ధరణి చట్టం అమలులోకి వచ్చిన తరువాత విఆర్‌ఓ వ్యవస్థను రద్దు కావడంతో రైతుల సమస్యలు ఎవరికి చెప్పాలో తెలియకా తహసీల్దార్ కార్యాలయం, ఆర్‌డిఓ కార్యాలయాల చుట్టు తిరిగితే మా దగ్గర అధికారాలు లేవని కలెక్టర్ దగ్గరకు వెళ్లమని చెప్పేవారని దీంతో మూరు మూల ప్రాంతాలకు రావాలంటే రైతులు తీవ్ర ఇబ్బందులు పడేవారని చెప్పారు. అనంతరం అదనపు కలెక్టర్ పి రాంబాబు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రైతుల భూ సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం భూ భారతీ చట్టాన్ని తీసుకవచ్చిందన్నారు. రెవెన్యూ వ్యవస్థను బలపర్చేందుకు త్వరలో జిల్లాలో 279 మంది గ్రామపాలన అధికారులను తీసుకరానున్నట్లు తెలిపారు. అనంతరం ఆర్‌డిఓ వేణుమాధవరావు భూ భారతి చట్టం గురించి రైతులకు క్లుప్తంగా సెక్షన్లవారిగా వివరించారు. ఈ సమావేశంలో మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్ నాయక్, తహసీల్దార్ హరికిషోర్ శర్మ, ఎంపిడిఓ ఎండి అషిం, డిటి హరిచంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

# పేదల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులే

సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్




**ప్రజాపక్షం/కోదాడ(చిలుకూరు):** పేద ప్రజల పక్షాన మాట్లాడేది, పోరాటం చేసేది కమ్యూనిస్టులేనని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్ అన్నారు. శనివారం చిలుకూరు మండల కేంద్రంలోని పాత చిలుకూరు గ్రామంలోని కస్తూరి అప్పారావు ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటుచేసిన భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ చిలుకూరు గ్రామశాఖల మహాసభ జరిగింది. ఈ మహాసభల సందర్భంగా పార్టీ జెండాను స్వాతంత్ర్య సమరయోధుడు, సిపిఐ సీనియర్ నాయకులు దొడ్డా నారాయణరావు ఆవిష్కరించారు. అనంతరం జరిగిన మహాసభలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దేశంలోని పాలకవర్గాలు కార్పోరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ పేద ప్రజల పొట్ట కొడుతున్నాయని ఆరోపించారు. పేద వర్గాలకు సంబంధించిన నిత్యావసర వస్తువుల ధరలు పెంచుతూ బడా కార్పోరేట్ వర్గాలకు సంబంధించిన వ్యక్తుల లక్షల కోట్ల రుణాలు మాఫీ చేస్తున్నారని విమర్శించారు. భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆవిర్భవించి 100 వసంతాలు పూర్తి చేసుకున్న తర్వాత ఏప్రిల్, మే నెలలో జరగనున్న మండల జిల్లా రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయడానికి పార్టీ నాయకత్వ, కార్యకర్తలు ఆహర్నిశలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. గతంలో తెలంగాణ సాయుధ పోరాట సమయంలో అష్టాంగ మహాసభ జరుపుకున్న ఈ చిలుకూరు గడ్డ మీద ఎర్రజెండా నిత్యం ఆడాలని వారు ఆకాంక్షించారు. అనంతరం కొత్త చిలుకూరు, పాత చిలుకూరు సంబంధించిన నూతన కమిటిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కొత్త చిలుకూరు, పాత చిలుకూరు గ్రామ కార్యదర్శులుగా షేక్ సాహెబ్‌అలీ, చిలువేరు ఆంజనేయులు, 35 మందిని కౌన్సిల్ సభ్యులుగా ఎన్నుకోవడం జరిగినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కట్టెకొల నాగేశ్వర రావు, బాలెబోయిన రాంబాబు, కొండా కోటయ్య, దొడ్డా వెంకటయ్య, చేపూరి కొండలు, ముక్కా లక్ష్మి నారాయణ, కొడారు శ్రీనివాసరావు, మండవ అచ్చయ్య, సుల్తాని వెంకటేశ్వర్లు, రవి, మల్లెపంగు ఉపేందర్, పూల వాసు, సిరాపురపు శ్రీను, లక్ష్మయ్య, మాచర్ల వెంకటి, మేరి, సైదులు పాల్గొన్నారు.

# అంబరాన్ని అంటే సంబరాలతో మేడే

సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ పిలుపు



**ప్రజాపక్షం/మోటకొండూరు :** మేడే సిపిఐ శ్రేణులు ఘనంగా నిర్వహించాలని యాదాద్రి భువనగిరి జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఆయన శనివారం మోటకొండూరు మండల కేంద్రంలోని రెడ్డిగట్టు శేషయ్యనగర్‌లో సిపిఐ కార్యాలయంలో ముఖ్యకార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ ప్రపంచ కార్మికుల దినోత్సవం మే ఒకటో తేదీన మండల స్థాయిలో అన్ని గ్రామాలలో పార్టీ దిమ్మలను అలంకరించి పార్టీ జెండాలను ఉత్సాహ పూరితమైనటువంటి స్థాయిలో మేడే ను జయప్రదం చేయాలని పార్టీ శ్రేణులను కోరారు. రాష్ట్రంలో రైతులు పండించిన పంటలను ఐకెపి సెంటర్ల నిర్లక్ష్యం కారణంగా సకాలంలో రైతుల వడ్లను కొనుగోలు చేయడంలో జాప్యం జరుగుతున్నందున ఎగుమతి చేయడంలో లారీలు అందుబాటులో పెట్టకుండా వడ్లు పట్టే జల్లిని తగిన కావలసిన కరెంటు సరఫరా కొరకు వైరును ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. నూతనంగా ఏర్పడిన మండలానికి కనీస రోడ్ల సౌకర్యములు లింకు రోడ్ల నిర్మాణం లేక సరియైన రవాణా సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఆలేరు నుండి నల్లగొండకు పోయే బస్సును ఈ మండల ప్రజల సౌకర్యార్థం వెంటనే పునరుద్ధరింపజేయాలని డిమాండ్ చేస్తున్నామని, మండల కేంద్రంలో విద్యార్థిని విద్యార్థినులకు జూనియర్ కళాశాల , డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పల్లా వెంకన్న అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి గాదెగాని మాణిక్యం, సహాయ కార్యదర్శి ఆలేటి బాలరాజు, మండల కార్యవర్గ సభ్యులు మంచాల రాధమ్మ, పసుపుల నరసింహ, ఫైళ్ల రాంరెడ్డి, నల్ల రాములు, ఎంకన్న, బీరకాయల మధు, బొంగు బిక్షం, జీవికలపెల్లి పాండు, నల్ల బిక్షం, పల్లె శ్రీనివాసు, కుమారస్వామి, సునీల్, మంకయ్య పాల్గొన్నారు.

## ఉగ్రవాదం దేశానికి ప్రమాదకరం

ఎఐపిఎస్ఓ ఆధ్వర్యంలో మృతి చెందిన పౌరులకు నివాళి

**ప్రజాపక్షం/నల్లగొండ :** జమ్ముకశ్మీర్ లోని పహల్గాంలో యాత్రికులపై ఉగ్రవాదులు చేసిన మారణహోమం హేయమైన చర్య ఇది దేశా నికి ప్రమాదకరమని అఖిల భారత శాంతి సంఘీ భావ సంఘం (ఐస్సో) సీనియర్ నాయకులు మల్లెపల్లి ఆదిరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని గడియార సెంటర్‌లో శనివారం ఎఐపిఎస్ఓ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పహల్గాంలో ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన పౌరులకు నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగ్రవాదం కన్నా మానవ త్వం గొప్పదని, మనిషి మానవత్వంతో జీవించాలని ప్రగతిని కాక్షించాలన్నారు. మారువేషంతో వచ్చి అమాయక పర్యాటకులను కాల్చి చంపిన పాకిస్తాన్ ప్రేరేపిత లష్కరే తోయిబా ఉగ్రవాదులను అంతమొందించాలన్నారు. అదేవిదంగా పహల్గాం దాడిలో మరణించిన, గాయపడిన వారి కుటుంబాలను ప్రభుత్వాలు అదుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కట్ట వెంకటరెడ్డి, అనంతుల శంకరయ్య,గుర్రం వెంకటరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జిల్లా యాదయ్య, ఉపాధ్యక్షులు ఎండి షరీఫుద్దీన్, ముండ్ల ముత్యాలు, పశలశౌరయ్య, పి బ్రహ్మాచారి,పబ్బు వీరస్వామి,ఎల్ వి యాదవ్,ఆర్ ఆచారి,వీ లెనిన్,ఎస్.కె మదర్, తెలగమళ్ళ దశరథ, నరేందర్ రెడ్డి,యాదగిరి రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.



# క్రీడ

## అతడి కోసం ప్రయత్నించి విఫలమయ్యాం! : ఎస్ఆర్‌హెచ్

ఐపిఎల్ 2025లో సన్‌రైజర్స్ హైదరాబాద్ పేలవ ప్రదర్శన చేస్తూ అభిమానులను నిరాశపరుస్తోంది. ఇప్పటివరకు ఆడిన 9 మ్యాచుల్లో ఆరింటిలో ఓడి పాయింట్ల పట్టికలో 8వ స్థానంలో నిలిచింది. అయితే తాజాగా చెపాక్ స్టేడియం వేదికగా చెన్నై సూపర్ కింగ్స్ తో జరిగిన మ్యాచులో విజయం సాధించి ప్లే ఆఫ్స్ ఆశల్ని సజీవం చేసుకుంది. అయితే మ్యాచ్ అనంతరం ఎస్ఆర్‌హెచ్ హెడ్ కోచ్ డేనియల్ వెట్టోరి కీలక వ్యాఖ్యలు చేశారు. తమ జట్టు.. మెగా వేలంలో ఓ లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ ను దక్కించుకునేందుకు తీవ్రంగా పోటీ పడిందని, కానీ కొనుగోలు చేయలేక పోయిందని చెప్పాడు.

**అతడెవరంటే?**

గుజరాత్ టైటాన్స్ లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ రవిశ్రీనివాసన్ సాయి కిశోర్ ప్రదర్శన తనను బాగా ఆకట్టుకుందని తెలిపాడు హెడ్ కోచ్ డేనియల్ వెట్టోరి. 'కిశోర్ కు మంచి భవిష్యత్ ఉంది. అతడు అద్భుతంగా ఆడుతున్నాడు. ముంబై జట్టులో మిచెల్ శాంట్నర్, పంజాబ్ కింగ్స్ తరఫున హర్‌ప్రీత్ బ్రార్ మంచిగా ఆడుతున్నారు. ఇక సాయి కిశోర్ అద్భుతం. మెగా వేలంలో అతడిని కొనుగోలు చేసేందుకు బాగా ప్రయత్నించాం. చాలా దగ్గరి వరకు వెళ్లాం. అతడు మా జట్టులో ఉండాలని కోరుకున్నాం.ఇతడు ఆడే విధానం.. ఇతర స్పిన్నర్లకు ఓ టెంప్లెట్ సెట్ చేస్తుంది. పోటీ పడి మరీ ఎలా విజయం సాధించొచ్చో అతడు చూపించగలడు. మంచి బ్యాటింగ్ పిచ్‌లపై కూడా అతడు మంచి ప్రదర్శన చేశాడు,' అని వెట్టోరి పేర్కొన్నాడు

## ఓ పాజీ ఊచకోత కోశారు.. ఊపిరాడనివ్వలేదు!



ఐపిఎల్ 2025లో భాగంగా తాజాగా ఈడెన్ గార్డెన్స్ వేదికగా కోల్‌కతా నైట్ రైడర్స్ తో జరుగుతోన్న మ్యాచులో పంజాబ్ కింగ్స్ బ్యాటర్లు అదరగొట్టారు. మిగతా బ్యాట్లర్లు ఇంకాస్త బాగా ఆడి ఉండాల్సింది. దీంతో నిర్ణీత 20 ఓవర్లలో పంజాబ్ కింగ్స్ 4 వికెట్లు కోల్పోయి 201 పరుగులు చేసింది. అయితే పంజాబ్ కింగ్స్ ఫినిషింగ్ అంతగా బాలేదు. ఇంకాస్త మంచిగా ఆడి ఉంటే.. 220 వరకు స్కోరు వెళ్లేది.

**ఇద్దరూ ఊదేశారు..**

ఈ మ్యాచులో మొదటగా టాస్ నెగ్గిన పంజాబ్ కింగ్స్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ బ్యాటింగ్ ఎంచుకున్నాడు. అయితే కేకేఆర్ బౌలర్లకు పంజాబ్ ఓపెనర్లు చుక్కలు చూపించారు. ఓపెనర్లు ప్రియాంశ్ ఆర్య (35 బంతుల్లో 8 ఫోర్లు, 4 సిక్సుల సాయంతో 69 పరుగులు), ప్రభ్ సిమ్రన్ సింగ్ (49 బంతుల్లో 6 ఫోర్లు, 6 సిక్సుల సాయంతో 83 రన్స్) అటాకింగ్ షాట్లు ఆడుతూ మంచి శుభారంభం అందించారు. ఇద్దరు కలిసి తొలి వికెట్ కు 120 పరుగులు భాగస్వామ్యాన్ని నెలకొల్పారు.

**ఈ బౌండరీలతో విరుచుకుపడుతూ..**

ఇద్దరూ 197, 169 స్ట్రైక్ రేటుతో విరుచుకుపడ్డారు. గ్యాప్ లేకుండా బౌండరీలు బాదారు. అయితే వీరిద్దరిని ఆండ్రూ రస్సెల్ విడగొట్టాడు. ప్రియాంశ్ ఆర్యను పెవిలియన్ పంపాడు. అలానే సెంచరీకు దగ్గరగా వచ్చిన ప్రభ్‌సిమ్రన్‌ను వైభవ్ అరోరా ఔట్ చేశాడు.

**కెప్టెన్ నాటౌట్..**

ఆ తర్వాత గ్లెన్ మ్యాక్స్ వెల్ (7) మళ్లీ నిరాశపరిచాడు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (25 నాటౌట్), మార్కో జాన్సన్ (3), జోస్ ఇంగ్లీష్ (11) పరుగులు చేశారు.కేకేఆర్ డెత్ ఓవర్లు బాగా వేసింది. లాస్ట్ రెండు ఓవర్లు యండ్రూ రసెల్ మంచిగా వేశాడు. తక్కువ పరుగులే ఇచ్చాడు. వైభవ్ అరోరా 2 వికెట్లు తీయగా, వరుణ్ చక్రవర్తి, యాండ్రూ రసెల్ తలో వికెట్ దక్కించుకున్నారు.

## ఐపిఎల్ 'కాస్ట్లీ' ప్లేయర్..!



'హై షాప్.. టేస్ట్‌లెస్ డిష్' అనే సామెత దాదాపు అన్ని ఐపిఎల్ సీజన్లకు సరిపోతుంది. ఐపిఎల్‌లో పెద్ద పేరున్న ఆటగాళ్ల కోసం ఫ్రాంచైజీలు భారీ మొత్తంలో డబ్బు ఖర్చు చేస్తాయి. కానీ వారు తరచుగా అంచనాలను అందుకోవడంలో విఫలమవుతారు. ఐపిఎల్‌లోని ఫ్రాంచైజీలు ఆటగాళ్లపై డబ్బుల వర్షం కురిపించినప్పుడు ఈ ఆటగాళ్లు తమకు అదృష్టాన్ని మార్చేవారిగా నిరూపిస్తారనే ఆశతో అలా చేస్తారు. ఈ కారణంగా లీగ్‌లో ఖరీదైన ఆటగాళ్ల సంఖ్య సీజన్ తర్వాత సీజన్ పెరుగుతూ వస్తోంది. ఐపిఎల్ 2025లో లక్నో సూపర్ జెయింట్స్ రిషబ్ పంత్‌ను రూ.27 కోట్లకు కొనుగోలు చేసింది. పంత్ లీగ్ చరిత్రలో అత్యంత ఖరీదైన ఆటగాడిగా నిలిచాడు. కానీ పంత్ ఇప్పటివరకు విఫలమయ్యాడు. ఇది కొత్త విషయమేమీ కాదు. సీజన్‌లో అత్యంత ఖరీదైన ఆటగాడు విఫలమవడం లీగ్ చరిత్రలోనే ఉంది.

ఈ సీజన్‌లో నిరాశపరిచిన ఖరీదైన ఆటగాడు ఐపిఎల్ 2025లో రిషబ్ పంత్ ప్రదర్శన ఇప్పటివరకు ప్రత్యేకంగా ఏమీ లేదు. 18వ సీజన్‌లో ఇప్పటివరకు ఆడిన 9 మ్యాచ్‌ల్లో 8 ఇన్నింగ్స్‌ల్లో రిషబ్ పంత్ 106 పరుగులు మాత్రమే చేశాడు. ఈ కాలంలో రిషబ్ పంత్ ఒకే ఒక అర్ధ సెంచరీ సాధించగలిగాడు. ఐపిఎల్ చరిత్ర కూడా అలాగే ఉంది. ఈ సీజన్‌లో అత్యంత ఖరీదైన ఆటగాడు తన ప్రదర్శనతో నిరాశ చెందాడుచెందాడు. .

# లీల



## 3డీలో 'జగదేక వీరుడు - అతిలోక సుందరి' రీరిలీజ్

మెగాస్టార్ చిరంజీవి, అందాల భామ శ్రీదేవి జంటగా నటించిన బ్లాక్ బస్టర్ సోషియో ఫాంటసీ మూవీ 'జగదేక వీరుడు అతిలోక సుందరి' విడుదలై 35 సంవత్సరాలు పూర్తి అవుతున్న నేపథ్యంలో ఈ యేడాది మే 9న ఈ చిత్రాన్ని 2డీతో పాటు 3డీలోనూ భారీ స్థాయిలో విడుదల చేయబోతోంది వైజయంతి మూవీస్ సంస్థ. ఈ విషయాన్ని శనివారం అధికారికంగా తెలిపారు. మే 9వ తేదీ పవన్ కళ్యాణ్ 'హరి హర వీరమల్లు' సినిమా విడుదల కావాల్సి ఉంది. కానీ దాని విడుదల వాయిదా పడిందని, అందువల్లే 'జగదేక వీరుడు అతిలోక సుందరి' మూవీని గ్రాండ్ గా అశ్వనీదత్ రిలీజ్ చేస్తున్నారని తెలుస్తోంది. చిరంజీవి నటిస్తున్న 'విశ్వంభర' చిత్రం విడుదల విషయంలో ఇంకా క్లారిటీ రాని నేపథ్యంలో మరోసారి 'జగదేక వీరుడు అతిలోక సుందరి'ని చూడగలగడం, అదీ త్రీడీ చూడబోవడం అభిమానులకు పండగే!




## అడ్వెంచర్ కథతో చైతూ సినిమా

అక్కినేని నాగచైతన్య ప్రస్తుతం తన నెక్స్ట్ ప్రాజెక్ట్‌ను దర్శకుడు కార్తీక్ దండు డైరెక్షన్‌లో తెరకెక్కించేందుకు సిద్ధమయ్యాడు. ఈ సినిమాను గతంలోనే అనౌన్స్ చేసిన సంగతి తెలిసిందే. ఇక తాజాగా ఈ సినిమా నుంచి ఓ ఇంట్రెస్టింగ్ అప్డేట్ అయితే మేకర్స్ ఇచ్చారు. ఈ సినిమాకు సంబంధించిన రీసెర్చ్, దాని కోసం వారు పడ్డ కష్టం, ఇక సినిమా కోసం వారు రెడీ అవుతున్న తీరు ను ప్రెజెంట్ చేస్తూ ఓ ప్రీప్రొడక్షన్ వీడియోను మేకర్స్ తాజాగా రిలీజ్ చేశారు. మిస్టిక్ థ్రిల్లర్‌గా రానున్న ఈ సినిమా కోసం అందరూ సిద్ధమయ్యారని ఈ వీడియో ద్వారా తెలిపారు. ఇక ఈ సినిమా కోసం భారీ బడ్జెట్‌ను కేటాయించారు. ఈ సినిమాలో చైతూ సరికొత్త లుక్‌తో అడ్వెంచర్ చేయబోతున్నాడని చిత్ర యూనిట్ తెలిపింది. ఈ సినిమాను శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర, సుకుమార్ రైటింగ్స్ ప్రొడ్యూస్ చేస్తున్నాయి.



## అల్లు అర్జున్, అట్లీ మూవీలో ముగ్గురు హీరోయిన్స్

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తన నెక్స్ట్ ప్రాజెక్ట్‌ను తమిళ దర్శకుడు అట్లీతో చేయబోతున్నట్లు ఇటీవల అఫీషియల్‌గా అనౌన్స్ చేశాడు. ఇక ఈ సినిమాను భారీ బడ్జెట్ చిత్రంగా హెవీ వీఎఫ్ఎక్స్ వర్క్‌తో రూపొందించబోతున్నారు. అయితే, ఈ సినిమాకు సంబంధించి తాజాగా సినీ సర్కిల్స్‌లో ఓ ఇంట్రెస్టింగ్ వార్త చక్కర్లు కొడుతోంది. ఈ సినిమాలో హీరోయిన్‌గా మృణాల్ ఠాకూర్ సెలెక్ట్ అయ్యింది. ఇప్పటికే ఆమె ఈ సినిమా కోసం లుక్ టెస్ట్ కూడా చేసినట్లు తెలుస్తోంది. ఇక ఈ సినిమాలో మరో హీరోయిన్‌గా జాన్వీ కపూర్ కూడా నటించ బోతున్నట్లు తెలుస్తోంది. ఆమెతో పాటు మరో హీరోయిన్ కూడా ఈ సినిమాలో ఉండనుందట. ముగ్గురు హీరోయిన్లతో అంతేగాక, అల్లు అర్జున్ తొలిసారి తన కెరీర్‌లో డబుల్ రోల్ చేయబోతున్నాడని తెలుస్తోంది. ఈ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్‌ను సన్ పిక్చర్స్ అత్యంత భారీ బడ్జెట్‌తో ప్రొడ్యూస్ చేస్తున్నారు.

## ఎల్‌జి, హోం శాఖదే

(మొదటి పేజీ తరువాయి)

వెలువడ్డాయి. అయితే, మంచు కురిసే సమయంలో మినహా ఏడాది పాటు తెరిచే ఉండే బైసరన్ పర్యాటక ప్రదేశం గురించి ఎన్నడూ పోలీసుల ధృవీకరణ కోసం కోరలేదని జమ్మూకశ్మీర్ ప్రభుత్వ సీనియర్ అధికారి తెలిపినట్లు ప్రముఖ ఆంగ్ల దినపత్రిక 'ది హిందూ' లో వార్త కథనం ప్రచురితమైంది. ఈ విషయాన్ని కేంద్ర పాలిత ప్రాంత ప్రభుత్వ యంత్రాంగానికి జమ్మూ కశ్మీర్ పోలీసులు ఇంకా లాంఛనంగా తెలియజేయాల్సి ఉన్నదని ఆ అధికారి తెలిపారు. ఎన్నో ఏళ్ళుగా బైసరన్ పచ్చిక బయలు పర్యాటకుల కోసం తెరిచే ఉంటుందని ఆయన వెల్లడించారు. అక్కడి పిక్‌నిక్ స్పాట్ గేటు మీద దానిని ''పహల్గామ్ డెవెలప్‌మెంట్ అథారిటీ, అనంత్‌నాగ్ డిస్ట్రిక్ట్'' నిర్వహిస్తున్నట్లు పోస్టర్‌తో పాటు, ప్రతి వ్యక్తికి రూ.35 ప్రవేశ రుసుం అని రాసి ఉంది. జమ్మూ కశ్మీర్‌ను రాష్ట్రం నుంచి 2019లో శాసనసభ కలిగిన కేంద్ర పాలిత ప్రాంతంగా హోదా తగ్గించి, 2024లో మొదటిసారి ఎన్నికలు నిర్వహించారు. శాంతి భద్రతల నిర్వహణ, పోలీసు, భద్రత బాధ్యత లెఫ్టినెంట్ గవర్నర్ కార్యాలయం, కేంద్ర హోం మంత్రిత్వశాఖకు ఉంటుంది. పర్యాటకం కేంద్ర పాలితంలో ఎన్నికైన పాలనాయంత్రాంగం కిందికి వస్తుంది. బైసరన్‌ను ఏప్రిల్ 20 నుంచి 22వ తేదీ మధ్య వెయ్యి లోపు పర్యాటకులు మాత్రమే దర్శించినట్లు గురువారం జరిగిన అఖిల పక్ష సమావేశంలో ఎంపిలకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలియజేశారు. హోటల్, రిసార్ట్ యజమానులు బాధ్యతాయుతంగా వ్యవహరించి ఉండాల్సిందని, పర్యాటకులను పంపే ముందు సెక్యూరిటీ ప్రోటోకాల్‌ను పాటించాల్సిందని ఆయన అన్నట్లు అఖిలపక్ష సమావేశానికి హాజరైన ఎంపిలు చెప్పినట్లు 'ది హిందూ' పత్రిక కథనంలో పేర్కొంది.

## ఉన్మాదం దేశానికి ప్రమాదకరం

ప్రజలను విస్మరిస్తే పతనం తప్పదు
-సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని
-వరద నర్సింహారావు సహా సిపిఐలో వందలాది మంది చేరిక
-ఖమ్మంలో భారీ ప్రదర్శన





ప్రజాపక్షం/ఖమ్మం : ఉన్మాదం దేశానికి ప్రమాదకరమని దేశ భవిష్యత్తుకు అది గొడ్డలి పెట్టుగా మారనుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. ఉన్మాదానికి, టెర్రరిజానికి మతం ప్రాధాన్యత కాదని అలజడి సృష్టించడం ప్రజలను హింసించడమే దాని లక్ష్యమని ఆయన తెలిపారు. భారత కమ్యూనిస్టు పార్టీలో ఖమ్మం నగరానికి చెందిన వరద నర్సింహారావు సహా వందలాది మంది సిపిఐలో చేరారు. ఈ సందర్భంగా ఖమ్మం ముస్తఫానగర్ సెంటర్ నుంచి అల్లిపురం రోడ్డులోని బహిరంగ సభా స్థలి వరకు డప్పు, కోలాట దళాలు వందలాది మంది కార్యకర్తలతో ప్రదర్శన నిర్వహించారు. సిపిఐ నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా అధ్యక్షతన జరిగిన సభలో సాంబశివరావు మాట్లాడుతూ ఉన్మాదులకు మతం లేదని గతంలో అనేక మంది ప్రముఖులను హతమార్చిన విషయంలోనూ ఇది రుజువైందన్నారు. టెర్రరిజం విషయంలో ఒక మతాన్ని బూచిగా చూపడం సరి కాదన్నారు. టెర్రరిస్టు దాడిని అంచన వేయడంలోనూ, అడ్డుకోవడంలోనూ వైఫల్యం చెందిన తర్వాత దేశ ప్రజల ఆలోచనలను మళ్లించే రీతిలో మోడీ, అమిత్‌షా లాంటి నేతలు ప్రకటనలు చేస్తున్నారని ఇది సరి కాదని ఆయన స్పష్టం చేశారు. విభిన్న మతాల, కులాల, భాషల సమ్మిళితమైన భారతదేశంలో ఏకపక్ష విధానాలు దేశ విచ్ఛిన్నానికి దారితీస్తాయని ఆయన హెచ్చరించారు. ఉన్మాద మూర్ఖుల చేష్టలను ఒక మతానికి, ప్రాంతానికి ముడి పెట్టడం సరికాదన్నారు. పహల్గాం ఘటనలో ముస్లిం టెర్రరిస్టులు కాల్చి చంపితే అదే ఘటనలో గాయపడిన వారికి అనేక మందికి ముస్లింలు సేవలు అందించి ప్రాణాలు కాపాడరన్న విషయాన్ని గుర్తెరగాలన్నారు. ప్రజలను విస్మరించి పాలన చేస్తున్న మోడీ తన అనుకూలురైన సంస్థల అధిపతులకు మేలు చేస్తున్నారన్నారు. కమ్యూనిస్టుల అవసరం ఈ దేశంలో పెరుగుతుందన్నారు. లౌకిక, ప్రజాస్వామిక వాదులు కమ్యూనిస్టుల అవసరాలను గుర్తిస్తున్నారని ఈ దేశ ప్రజలు కమ్యూనిస్టుల అవసరాన్ని గుర్తించిన నాడు ప్రజా వ్యతిరేకులకు గుణపాఠం తప్పదన్నారు. కమ్యూనిస్టు పార్టీకి ద్రోహం చేసిన ఎవరిని వదిలేది లేదన్నారు. అధికారం శాశ్వతం కాదని ప్రజల పక్షాన పనిచేయడమే అతి గొప్ప అధికారమని ఆయన తెలిపారు. వరద నర్సింహారావు సహా వందలాది మందికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నగర సహాయ కార్యదర్శి పగడాల మల్లేష్ ఆహుతులను వేదికపైకి ఆహ్వానించగా ఈ సభలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, వరద నర్సింహారావు తదితరులు ప్రసంగించగా ఈ సమావేశంలో రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రాబాబు, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు,జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు,పోటు కళావతి, మహ్మద్ సలాం, తోట రామాంజనేయులు, మిడికంటి వెంకటరెడ్డి, ఏపూరి రవీంద్రబాబు, మేకల శ్రీనివాసరావు, సాంబశివరెడ్డి, ఏనుగు గాంధీ, నూనె శశిధర్, తాటి నిర్మల, బోడా వీరన్న, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శులు నానబాలరామకృష్ణ, ఇటికాల రామకృష్ణ తదితరులు

### భారీ ప్రదర్శన

సిపిఐ ఆధ్వర్యంలో శనివారం ఖమ్మంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. ముస్తఫానగర్ సెంటర్ నుంచి అల్లిపురం రోడ్డులోని బహిరంగ సభాస్థలి వరకు భారీ బహిరంగ సభ జరిగింది. డప్పు, కళా నృత్యాలు, కోలాటం దళాలు నగర ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అగ్రభాగాన సిపిఐ జిల్లా నాయకత్వం నడవగా పెద్ద సంఖ్యలో మహిళలు, ప్రదర్శనలో పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో ఆటో కార్మికులు సిపిఐలో చేరుతున్న సందర్భంగా ఆటో ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ పతాకాన్ని మహ్మద్ మౌలానా ఆవిష్కరించారు.

## కేసులు వెల్లడించాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

అవినీతి ఆచరణ నిబంధనలకు సమానమని అతని ఎన్నికను శూన్యం, చెల్లుబాటు కాదని ప్రకటించడానికి ఇది సరైన కారణం' అని హైకోర్టు తీర్పు పేర్కొన్నది.సుప్రీంకోర్టు ధర్మాసనం మాట్లాడుతూ 'హైకోర్టుకు సంబంధించబడిన నిషేదం ఉత్తర్వులు, తీర్పులను పిటిషనర్ సవాల్‌చేసిన దానిపై మేం వాస్తవాలను కనుగొనడంలో విఫలం అయ్యాం. దీనిపై కోర్టు ఆందోళన చెందుతున్నది. రాష్ట్ర ఎన్నికల సంఘం దీనికి సంబంధించి నిబంధనలు రూపొందించిన కారణంగా మేం అలా చెబుతున్నాం. అవి సరిగ్గా అమలు అవుతున్నాయా లేదా అన్న విషయాన్ని పరిశీలించిన హైకోర్టు తీర్పు వెల్లడించింది. పంచాయతీ ఎన్నికలలో పోటీ చేస్తున్న అభ్యర్థులు ఆనిబంధనలకు తలొగ్గి వారిపై పెండింగ్‌లో ఉన్న కేసుల సమాచారం గురించి వెల్లడించాల్సిందే' అని అత్యున్నత న్యాయస్థానం తెలిపింది.ధర్మాసనం మాట్లాడుతూ 'ఏ సందర్భంలోనైనా మీ పిటిషనర్ బసంత్‌లాల్ చట్టం, నియమనిబంధనలు, కార్యకలాపాల గురించి ప్రస్తావించాల్సిన అవసరం లేదని సూచించింది. ఆయనపై వ్యతిరేకంగా క్రిమినల్ కేసు ఉన్న విషయాన్ని ఉద్దేశపూర్వకంగా దాచిపెట్టి అఫిడవిట్ దాఖలు చేసిన కేసులు అది. అతని ఎన్నికను రద్దు చేయకుండా అతనిపై ఉన్న కేసు వాస్తవాన్ని దాచిపెట్టాడు' అని బెంచ్ పేర్కొంది. హైకోర్టు డివిజన్ బెంచ్ 2024, నవంబర్ 7న ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ బసంత్‌లాల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఒక క్రిమినల్ కేసుకు సంబంధించిన వాస్తవాలను వెల్లడించని కారణంగా ఇంతకుముందు తాను 6 సంవత్సరాలపాటు ఎన్నికల్లో పోటీచేసేందుకు అనర్హుడిగా ఉన్నానని పిటిషనర్ బసంత్‌లాల్ కోర్టు ముందు తన సమస్యను లేవనెత్తారు.

## ఎసిబి సోదాలు

(మొదటి పేజీ తరువాయి)

ఈ దాడులు నిర్వహించినట్లు తెలుస్తుంది. రాత్రి వరకు కూడా దాడులు కొనసాగుతునే ఉన్నాయి.అయితే, హరిరాం.. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో కీలకంగా , టోలీచౌకిలోని హరిరామ్ ఇంట్లో తనిఖీల్లో భారీగా ఆస్తిపత్రాలను అధికారులు గుర్తించినట్టు తెలుస్తోంది. గజ్వేల్లో 30 ఎకరాల వ్యవసాయ భూమి, అలాగే, మూడు బ్యాంక్ లాకర్లను ఎసిబి అధికారులు గుర్తించినట్టు సమాచారం. ఈ సోదాల్లో భాగంగా అనధికారిక లావా దేవీలను కూడా గుర్తించే పనిలో ఎసిబి అధికారులు ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆదాయానికి మించి అక్రమాస్తుల కేసును ఎసిబి నమోదు చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. మరో వైపు.. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో అనేక లోపాలు ఉన్నాయని ఎన్‌డిఎస్ఎ ఇచ్చిన తుది నివేదిక తీవ్ర దుమారం రేపుతోంది. వీటిని రీ డిజైన్ చేసి మళ్లీ నిర్మించాలని సిఫారసు చేసింది. నిర్మాణం, డిజైన్లో అన్నీ లోపాలేనని స్పష్టం చేసింది. ఎన్‌డిఎస్ఎ రిపోర్టులో నిర్మాణ, నిర్వహణ, డిజైన్ లోపాలే మూడు బ్యారేజీలకు గండిని తేల్చేయడంతో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బిఆర్ఎస్ పార్టీల మధ్య మాటల యుద్ధం తారా స్థాయికి చేరింది. ఇక, ఎన్‌డిఎస్ఎ రిపోర్టుపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందించారు. రూ.లక్ష కోట్లతో నాసిరకం ప్రాజెక్ట్ నిర్మించారని.. కేవలం దోచుకోవడానికి మాత్రమే కాళే శ్వరం ప్రాజెక్టు నిర్మించారంటూ ఆయన వ్యాఖ్యానిం చారు. బ్యారేజ్ ఎందుకూ పనికిరాదని ఎన్‌డిఎస్ఎ రిపోర్ట్ తేల్చిం దని.. వచ్చే కేబినెట్లో ఎన్‌డిఎస్ఎ రిపోర్టుపై చర్చించి చర్యలు తీసుకుంటామన్నారు. కాళేశ్వరంతో అద్భుతాలు సృష్టి స్తున్నామని.. చెప్పి లక్ష కోట్ల ప్రాజెక్ట్ కట్టారు. ఎన్‌డిఎస్ఎ నివే దిక చూసి బిఆర్ఎస్ నేతలు సిగ్గుపడాలి. మీరే డిజైన్ చేశా రు..మీరే కట్టారు. అబద్ధాలతో బిఆర్ఎస్ బతకాలనుకుం టుం ది. నిర్మాణం చేసిన వాళ్లు.. చేయించిన వాళ్లు రైతులకు ద్రోహం చేశారు. బీఆర్ఎస్ రైతులకు క్షమాపణ చెప్పాలి. ఎన్డీఎ స్ఏ రిపోర్ట్పై అధ్యయనం చేస్తాం. కాళేశ్వరం రైతుల కోసం కా దు.. జేబులు నింపుకునేందుకు కట్టారు' అని మండిపడ్డారు. కాళేశ్వరం అక్రమాలపై విచారణ జరుపుతున్న జస్టిస్ ఘోష్ కమిషన్ కు ఈ రిపోర్టు అత్యంత కీలకం కానుంది. ఇప్పటికే పలుమార్లు జస్టిస్ ఘోష్ కమిషన్ విచారణ జరిపింది. ఫైన ల్‌గా కెసిఆర్, హరీష్ రావులను కూడా ప్రశ్నించే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. ఇలాంటి సమయంలో ఎన్‌డి ఎస్ఎ రిపోర్టు రావడం బిఆర్ఎస్‌కు షాక్ లాంటిదే. ఇప్పుడు సాధారణ ప్రజలు.. పాలక పార్టీ నుంచి వచ్చే విమర్శలకు సమాధానాలు చెప్పుకోవాల్సి ఉంటుంది.మాజీ ఇరిగేషన్ అధికారి హరిరాం ఇంట్లో ఎసిబి సోదాలు రాజకీయ నేతల్లో చర్చానీయాంశంగా మారింది.




Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com